# కోసూరి ఉమాభారతి



# ..రాజీ పడిన బంధం..

## (నవల)



## రచన :  కోసూరి ఉమాభారతి

‘వలచినవాడు  కట్టిన  తాళి,  మెడచుట్టూ  బిగుస్తున్న  ఉచ్చుగా  మారినప్పుడు,
సాంప్రదాయలలో పెరిగిన ఓ సామాన్య యువతి, అసమాన మనోస్థైర్యంతో
ముందుకు సాగిన పైనమే...... ‘రాజీ పడిన బంధం’ లోని ఇతివృత్తం....

సున్నితమైన కథాంశంకి రూపకల్పన ఈ నవల...
చదివి ఆదరిస్తారని,  మీ ఆలోచనలు పంచుకుంటారని ఆశిస్తున్నాను...

–  రచయిత్రి

# ముందు మాట...

స్వర్గసౌఖ్యాలు అందించగల భర్త, అంతస్తు, హోదా - అన్నీ ఉన్న నీలవేణి,
అంతులేని ఆవేదనలో, మనుగడ ఓ నరకంగా, భయాందోళనల నడుమ రాజీపడి జీవించింది..
ఆమె రాజీమార్గం ఓ సంగ్రామంగా మారిందా? .....

అత్తమామల అభిమానం ఓ ప్రక్క - అర్థంకాని భర్త వైఖరి మరో ప్రక్క,
రెంటికీ నడుమ ఉక్కిరిబిక్కిరైన సగటు యువతి నీలవేణి.
బిడ్డల శ్రేయస్సు కోసమని సాహసించి గడప దాటగలిగిందా?
పెద్దలని, విలువలని గౌరవించిందా?
చాకచక్యంగా జీవితాన్ని మలుచుకోగలిగిందా?

ఇలా ఎన్నో ప్రశ్నలకి జవాబే - **'రాజీ పడిన బంధం' - నవల...**

**క్లిష్ట సమస్యల నడుమ కూడా, తాను నమ్మిన సంస్కృతి-సంప్రదాయాలు, కుటుంబ బాంధవ్యాలని గౌరవిస్తూ, ఓ కోడలిగా- ఇల్లాలిగా- తల్లిగా ప్రేమను పంచి, బాధ్యతలు నిర్వహిస్తూ బతుకుని సమన్వయ పరుచుకునేందుకు ప్రయత్నించిన – 'నీలవేణి' కథ చదవండి.....**

**........రచయిత్రి**

# 1

***"వెండితెర - సినీ సర్క్యూట్ వారి – తాజావార్త" –***

పేపర్ చదువుతూ, ఏదో ముఖ్యమైన ప్రకటన చేస్తున్న శైలిలో చేయి పైకెత్తి స్వరం పెంచిందామె.

> ***'మొరటోడు' సినిమా లోని ఓ యుగళగీతం చిత్రీకరణ సమయంలో- 'ఖాయిలా పడిన నటి, వాయిదా పడిన షూటింగ్'***
>
> *'రొమాంటిక్ సీక్వెన్స్ కోసం వెరైటీగా బాక్సింగ్, ఫుట్బాల్ క్రీడల్లో పాల్గొన్నందుకు నటి రాణికి అస్వస్థత. వారంపాటు షూటింగ్ నిలిపి వేసినట్టు దర్శకుడు కరుణాకరం అందించిన వార్త. వరుణ్ హీరోగా నిర్మాణంలో ఉన్న ఈ రొమాంటిక్ చిత్రాన్ని ఎలాగైనా దీపావళి కానుకగా అందించనున్నారు నిర్మాతలు..'*

అరుగు మధ్యలో చెట్టునానుకుని కూర్చుని, సినీపత్రికలోని ఆ వార్తని ఓ ప్రకటనలా చాటి చెప్తున్నది ఎవరో కాదు, మా డియర్ ఫ్రెండ్, రమణీ యే.

హైదరాబాద్ విమెన్స్ కాలేజీ ఆవరణలో, ఆ చెట్టు క్రింద అరుగు మా *ఫేవరెట్ హైడౌట్ స్పాట్.* కెమిస్ట్రీ క్లాసుకి ఇంకా గంట సమయం ఉంది. కాసేపు బాతాఖానీ వేసి, కెమిస్ట్రీ టెస్ట్ కి రీవ్యూ చేద్దామని, ముగ్గురం అక్కడ చేరాము ....

"ఏయ్ నీలా, చిత్రా, ఈ న్యూస్ వింటున్నారా లేదా?" అంటూ మా వైపు తిరిగింది రమణి.
"అయినా, సినిమాల్లో రోమాన్స్ ఇంత *అన్నాచురల్* గా చూపెడతారెందుకో?", "రొమాన్స్ లో కొట్టుకోడాలు, ఫుట్బాల్ గేమ్స్ ఏమిటి? *సో స్టుపిడ్,*" పెద్దగా నవ్వింది రమణి.

అక్కడ చేరిన జూనియర్ స్టూడెంట్స్ తో పాటు అంతా నవ్వుకున్నాము.
"పైగా *టారిడ్* రొమాన్స్, అంటూ *హారిడ్* కలర్ ఫోటోలు కూడా," అని వ్యాఖ్యానిస్తూ రమణి అందర్నీ *ఎంటర్టైన్* చేస్తుంటే, కెమిస్ట్రీ బుక్స్ మూసేసి దాని మాటలు వినసాగాము.

సినిమా పత్రికల్లోని తాజా వార్తలు, ఇలా మాకు ఎప్పటికప్పుడు అందిస్తుంది రమణి.


మా జూనియర్, వందన, మా వైపు చూస్తూ, "హలో 'తీన్ దేవియా'! *అన్నాచురల్* రోమాన్స్ గురించే అంతలా *అప్సెట్* అయితే ఎలా? మినర్వాలో నడుస్తున్న 'పునర్జన్మ' అనే డబ్బింగ్ సినిమా చూసారా? ప్రేమ, పెళ్ళి, జీవితం అంటే భయమేసేలా ఉంది.
'శాడిస్ట్' మొగుడుతో ఆ అమ్మాయి పడే నరకం చూడాలి. *హౌజ్ ఫుల్* గా నడుస్తుంది సినిమా. టికెట్లు దొరకవు. మీకు కావాలంటే నేను *మానేజ్* చేసి తెప్పిస్తా. ఒక్క రోజు ముందు చెప్పండి," అంటూ టైం అవడంతో లేచి క్లాసుకి వెళ్ళిపోయింది.

"జూనియర్ అన్న మాటే గాని, *షి ఇజ్ 'ఫైర్ బ్రాండ్' లేడీ*," అంది నవ్వుతూ చిత్ర.
కెమిస్ట్రీ టెస్ట్ గుర్తొచ్చి బుక్ తెరవబోయాను.

"నీలా, ఆ మధ్య పెళ్లి చేసుకొన్న మా కజిన్ గురించి చెప్పాను. గుర్తుందా? మొగుడు 'మొరటోడు' అని, కాపురానికి వెళ్ళకుండా ఎనిమిది నెలలగా పుట్టింట్లోనే ఉందని చెప్పానే, గుర్తుందా ఆమె సంగతి?," అంటూ మా వంక చూసింది చిత్ర.

"అవునవును గుర్తే, లేటెస్ట్ ఏంటి? విరహం ఓపలేక ఆ అమ్మాయి భర్త వద్దకు చెక్కేసిందా? చెప్పు చెప్పు," అంటూ మా మధ్యకొచ్చి కూర్చుంది రమణి.

"కానే కాదు. 'భర్త ఆమడ దూరంగా ఉన్నా సహించలేను' అంటూ సీరియస్ గానే కోర్ట్ లో విడాకులకి పెట్టుకొందట," అని చిత్ర చెపుతుంటే విని, నిజమా! అని ఆశ్చర్య పోయాము నేను, రమణి కూడా.
జీవితాల్లో ఇలాంటి సమస్యలు, సున్నితత్వాలు ఉంటాయన్న మాటని అనుకొన్నాము.
"అయినా ఆ మ్యారేజ్ ఫెయిల్ అవడానికి, ఆమె 'డైవర్స్' నిర్ణయం తీసుకోడానికి, అసలా పిల్లని అతను ఏం చేసుంటాడంటావు?" ఆరా తీసింది రమణి.



కాసేపు నిశబ్ధం ....

"సరే, కబుర్లు మాని కనీసం ఓ ట్వెంటీ మినిట్స్ మౌనంగా కెమిస్ట్రీ టెస్ట్ కి రీవ్యూ చేద్దాము," అని బుక్ తెరిచాను.

చూపు పుస్తకంలో ఉన్నా, నా మనస్సు మాత్రం పరి విధాల ఆలోచిస్తుంది.

మా ముగ్గురి స్నేహం, మా అభిరుచుల వైపుగా సాగింది.

నా పూర్తిపేరు - నీలవేణి,

రమణి అసలు పేరు చంద్రమణి,

చిత్ర పూర్తిపేరు - చిత్రలేఖ.

కాలేజీలో ముగ్గురం ఎప్పుడూ కలిసే ఉంటామని మమ్మల్ని అందరు 'తీన్ దేవియా" అంటారు. రెండు నెలల్లో మా డిగ్రీ చదువు ముగిసిపోతుంది.

రమణికి బి.ఎస్.సి అవుతూనే వాళ్ళ బావతో పెళ్లని నిశ్చయమైంది. నేను స్కూల్ ఫస్ట్ వచ్చి, *అకడమిక్* స్కాలర్షిప్పు తో చదువుతున్నాను. పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువులకి కూడా '*గ్రాంట్*' అందుకోవచ్చని మొన్ననే అకడమిక్ కమిషన్ తెలియజేసింది. మరోప్రక్క నాకు మావాళ్ళు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు.

చిత్ర మాత్రం ఇపుడప్పుడే పెళ్లి చేసుకోదట. మెడిసిన్ చదివి, సైకియాట్రిస్ట్ గా మానసిక రుగ్మత ఉన్నవారికి సహాయపడాలని

తన ఆశయం. స్త్రీకి పెళ్ళి-పిల్లలు ముఖ్యమే. ఐనా, జీవితానికి ఒక ధ్యేయం, ఆశయం కూడా ఉండాలనేది చిత్ర నిర్దిష్టమైన అభిప్రాయం.

'ఏకత్వంలో భిన్నత్వం' అనేది మా ముగ్గురు స్నేహితురాళ్ళ విషయంలో సరిగ్గా వర్తిస్తుంది.

మేము చదివే పుస్తకాలనుండి మా దృక్పధాల వరకు, మా స్థితిగతులనుండి మా జీవన విధానాల వరకు అన్నిటా తేడాలున్నా, మాది ఘాడమైన స్నేహమే.

ముగ్గురం ఐదవ తరగతి నుండి క్లాస్మేట్స్.

నాటి నవలల నుండి నేటి ఇంగ్లీష్, తెలుగు బెస్ట్ సెల్లర్స్ వరకు, నే చదువుతాను.

రమణి వరసబెట్టి సినిమా పత్రికలు చదివితే, చిత్ర మాత్రం *సైంటిఫిక్* సమీక్షలు, కరెంట్ న్యూస్ చదివి, నలుగురికి చెబుతుంది.

మా ముగ్గురిలో చిత్రకి మాత్రమే వంట చేయడమన్నా, కంప్యూటర్ వాడటం అన్నా ఇష్టం.

కంప్యూటర్ కోర్స్ ల్లో నేను *టాప్*. అయినా కంప్యూటర్ వాడకం పడదు.

మా లెక్చరర్లకి *వెబ్-రిసర్చ్* అవసరమైతే మాత్రం నన్నే అడుగుతారు.

నేను కాటన్ చీరల్లో, సింపుల్ గా తయారవుతాను.

చిత్ర స్కర్ట్ బ్లౌజ్, చుడిదార్-కుర్తాలతో పాటు ఒక్కింత లిప్స్టిక్ వేస్తుంది. ఇకపోతే, జార్జెట చీరలు, చేతుల నిండా గాజులు, పర్ఫ్యూం రమణి స్టైల్.

మాది మధ్యతరగతి కుటుంబం - నాన్నగారు సౌత్ సెంట్రల్ రైల్వేస్ లో *సూపర్వైజర్,* చిత్ర ఆగర్భ శ్రీమంతురాలైతే, రమణి వాళ్ళది వ్యవసాయం - సంపన్నులే.
ఇన్నిట్లో వ్యత్యాసాలున్నా, మరెన్నో విషయాల్లో మేము ఎకీభవిస్తాం కూడా.

కాబోయే భర్త, సంసారం, కెరియర్, భావిజీవితం గురించిన మా ఊహలు, ఆశలు, ఆలోచనలు కూడా పంచుకొంటాము.
భర్త అనే వాడికి మంచి రూపం, ఉన్నతవిద్యలే కాదు, సున్నితమైన మనస్సు కూడా ఉండాలి. రొమాంటిక్ గా ఉండాలే కానీ, మనిషిలో మొరటుదనం అస్సలు ఉండకూడదు - అన్నది మా ముగ్గురి అభిప్రాయం.
ఇక పిల్లల విషయానికొస్తే, పిల్లలే వద్దంటుంది రమణి, దగ్గరుండి పెంచుకోవాలంటాను నేను, 'అమ్మతనం అద్భుతవరం' అంటుంది చిత్ర.

నా ఆలోచనా శ్రవంతికి బ్రేక్ వేస్తూ క్లాస్ బెల్ మ్రోగింది.
"రెండు వారాల్లో ఎగ్జామ్స్ అని మర్చిపోవద్దు. అప్పటి వరకు మాగజిన్స్, నవల్స్ పక్కకి పెట్టేయాలి మనం," అన్నాను పైకి లేస్తూ.

“అవునవును అది కరక్టే. పోతే, మన చదువులు కూడా అయిపోతాయి కాబట్టి, పరీక్షలవ్వగానే, కలిసి ఎక్కడికైనా దూరంగా ట్రిప్ వేద్దామా అని ఐడియా వచ్చింది. ఆ సంగతి తరువాత మాట్లాడుదాములే,” అన్నది రమణి మాతో పాటు వడివడిగా లెక్చర్ హాల్లోకి నడుస్తూ.

**

“టెస్ట్ రాసిన తరువాత ఎన్.ఎస్.ఎస్ *బాచ్* అందరూ వచ్చి నన్ను కలవండి. ఈ ఏడాదికి ఆఖరి *ఫీల్డ్ ట్రిప్* గురించి సమాచారం ఇస్తాను,”, “దానిగ్గాను ఎల్లుండి పొద్దున్నే కాలేజీ నుండి బయలుదేరాలి మనం,” అంది కెమిస్ట్రీ మేడమ్. ఆవిడే మా ‘నేషనల్ సర్వీస్ స్కీం’ గ్రూప్ కి ఇంచార్జ్ కూడా.

ఆఖరి ఫీల్డ్ ట్రిప్ కి *అజెండా* - ‘స్త్రీ సంక్షేమ పథం’ అని క్లాస్ అయ్యాక, మేడమ్ చెప్పారు.

**

ఎన్.ఎస్.ఎస్ వారి ‘సంక్షేమ పథం’ అమలులో ఉండేది ఊరి శివారుల్లోని గ్రామాల్లో. అక్కడ నివసించే బడుగు వర్గాల స్త్రీలని కలిసాము. వారి జీవనవిధానం, వారి బతుకుల్లోని విషాదం మనస్సుని కలిచివేసాయి.

***మా మొదటి కేసు***: తనకి సపర్యలు చేయకుండా పసిబిడ్డతోనే ఉంటుందని, మళ్ళీపెళ్ళి చేసుకొని కొత్తపెళ్ళాన్ని ఇంటికి తెచ్చాడుట ఓ యువతి భర్త. కాక, పసిబిడ్డతో సహా ఆ బాలింతని ఇంటినుండి వెళ్ళగొట్టాడట ఆ మూర్ఖుడు.

***రెండవ కేసు***: రెండు సార్లూ ఆడపిల్లల్నే కన్నదని, పాక నుండి తరిమేశారుట, మరో యువతిని - ఆమె భర్త, అత్త. వేరే దారి లేక, అత్తని బతిమాలి, ఆ చూర క్రిందనే పసివాళ్ళని ఉంచి, పాచిపని చేసుకొన్న డబ్బుతో వాళ్ళ కడుపులు నింపుతుందట ఆమె..

“నమ్మ శక్యం కాని నరరూప రాక్షసులా కొందరు మగాళ్ళు? ఆడదంటే ఒక *ఆబ్జెక్ట్* వాళ్ళకి,” అంటూ తిడుతూనే ఉంది రమణి.
ఆడవాళ్ళంటే ఇంతటి అలసత్వం ఏమిటి? ప్రేమించవల్సిన భార్యని, భర్తే హింసించడం ఏమిటి? అన్న ఆలోచనలతో స్తబ్దుగా ఉండిపోయాను నేను.
చిత్ర ఒక్కతే ఎటువంటి వ్యాఖ్యానం చేయకుండా ఆ యువతులని సముదాయించి, ఆ పూటకి వాళ్ళకి కావలసినవన్నీ చేకూర్చింది. మా ఇద్దరి చేత వారి పేర్లు, సమాచారం, నమోదు చేయించింది.

వారి దగ్గరలోనే ఉన్న వయోవిద్యాకేంద్రం, ఉచిత స్త్రీ-శిశు-ఆరోగ్య సౌకర్యం గురించి వివరించి, వారికి సులభంగా లభ్యమయ్యే స్వయం-ఉపాధి స్కీం గురించి సమాచారాన్ని అందించాము.

మేము అక్కడ ఉండగా మాత్రం, ఆ పసిపిల్లల నానమ్మ, వాళ్ళ వంటిమీదున్న బట్టలు సవరించి, మాకు దగ్గరగా వచ్చి కూర్చుంది.

నేనే ఆమెతో మాట కలిపాను. నేనడిగిన విషయాలు ఆమెకి నచ్చలేదు.

“ఏం సెప్పేది బిడ్డా? మా మగాళ్ళు మృగాలనుకో. ఆడదంటే, బువ్వొండి, సాకిరీ చేసి, పిల్లల్ని కనే మెషిన్ లెక్క. నా మొగుడు అట్టాగే, నా కొడుకు అట్టాగే. నా మాటేమన్నా ఇంటాడా? నన్ను కూడా కొడతాడు తాగేసినప్పుడు. పిల్లల్ని, కోడల్ని మంచిగా సూసుకోమని నా కొడుక్కి ఎంతగానో సెప్పినా. ఇనలే. ఇగ పంచాయతి పెట్టి నలుగురితో సెప్పిస్తుండాలే,” అంది ఆ అవ్వ.

‘అయితే, ఈ విషయాల్లో ఇన్ని కోణాలున్నాయా? బాధించే భర్త, ప్రేమించే అత్త, ఇదెలా సాధ్యం?’ అనుకున్నాము మేము.

**

“డిగ్రీ పూర్తయిన సందర్భంగా, మీ అందరికీ ‘అరకువేలీ ట్రిప్’ మా తరఫున బహుమానం,” అంటూ చిత్ర వాళ్ళ మామయ్య అన్ని ఏర్పాట్లు చేసారు. మా *ట్రిప్* ఖర్చు కూడా ఆయన భరించడం, నాకు, రమణికి మొహమాటంగా అనిపించింది. చిత్ర ఊరుకోలేదు.

మా పెద్దవాళ్ళ దగ్గర అనుమతి తీసుకొని బయలుదేర దీసింది.

మా తమ్ముడు వినోద్ ని సైతం ప్రత్యేకంగా ఆహ్వానించింది చిత్ర.

**

అరకులో, మేమున్న *బీచ్ రిసార్ట్* లోనే ఆర్కేడ్ గేమ్స్ నుండి ఆధ్యాత్మిక యోగా వసతి వరకు ఎన్నో సౌకర్యాలున్నాయి. అరకు లోని అందాలని ఆస్వాదిస్తూ, కాలం ఎలా గడిచిపోతుందో కూడా తెలియనంత ఎంజాయ్ చేస్తున్నాము. చిన్నపిల్లల్లా రమణి, వినోద్ చెయ్యని అల్లరి లేదు.

షాపింగులు, *రిసార్ట్ ట్రాక్* మీద పరుగు పందాలు, రాత్రంతా ఆర్కేడ్ గేమ్స్....

తిరిగివెళ్ళే ముందురోజు బీచ్ ఫెస్టివల్ ఉందంటే, సాయంత్రం బీచ్ కి బయలుదేరాము. విపరీతమైన జన కోలాహలం.
*వాటర్ గేమ్స్* అంటూ అటుగా వెళ్లాడు వినోద్.

మేము ముగ్గురం అందమైన భీమునిపట్నం బీచ్ మీద చాలా దూరం నడిచి, తెల్లని, చల్లని ఇసుక మీద సముద్రానికి ఎడంగా కూర్చున్నాము.

మమ్మల్ని చూసి ఓ పదిహేనేళ్ళ కుర్రాడు మా వద్దకు పరుగున వచ్చాడు. సన్నజాజుల మాలలు, వేరుసెనగలు, కొబ్బరి స్వీట్స్ అమ్మజూపాడు.

చిత్ర అందరికీ అన్నీ కొని ఓ పది రూపాయలు ఎక్కువే ఇచ్చింది ఆ కుర్రాడికి.

“ఈ సన్నజాజులు, మల్లెపూవుల గుభాళింపుల చుట్టూ ఎంత రొమాంటిక్ పాటలు రాస్తారో జనాలు. అంతా ఓ పెద్ద హైప్. రొమాన్స్ మనస్సులోంచి, పక్కనున్న మనిషి నుంచి రావాలి. రోమాన్స్ అనేది ప్రేమికుడి చూపులో, చిరునవ్వులో ఉంటుంది. ప్రియురాలి భావాల్లో, భావనల్లో ఉంటుంది.

పాలల్లో, పువ్వుల్లో, మిఠాయిల్లో కాదు,'' అంటూ కిలకిలా నవ్వింది రమణి.

''సరేనమ్మా తల్లీ! నీవు దేన్నైనా, ఆఖరికి పువ్వుల్ని కూడా డిబేటింగ్ మేటర్ లోకి మార్చేస్తావుగా. నువ్వు పక్కనుంటే అస్సలు *బోర్* కొట్టదు. మీ బావ లక్కీమాన్. కాకపోతే నీలా ఆలోచించడం నేర్వాలి,'' అంది నవ్వుతూ చిత్ర....

నేనూ నవ్వేసాను.

''లక్కీ అంటే గుర్తొచ్చిందోయ్. వచ్చే ఆదివారం మన జూనియర్, అదే ఆ 'ఫైర్ బ్రాండ్' వందన పెళ్ళి. అందరినీ పేరుపేరునా పిలిచిందిగా! అమెరికా పెళ్ళి కొడుకంట. సర్జన్ అంట. మంచి సంబంధం, చాలా లక్కీ గర్ల్ అంటున్నారు దాని ఫ్రెండ్స్ అందరూ. షామీర్పేట్ అలంకృతా క్లబ్ లో పెళ్ళి, రిసెప్షన్ కూడా. మనం కలిసే వెళదాము,'' గుర్తు చేసింది రమణి.

''ఓకే అలాగే వెళదాము. ఈ సెలవల్లో వీలయినంత కలుద్దాము,'' అంది చిత్ర.

''నేనూ ఓకే, వందన మా ఇంటికి వచ్చి మరీ ఇన్విటేషన్ ఇచ్చింది,'' అన్నాను.

''పోతే మన సంగతికి వద్దాం. మరో యేడాదిలో నేను ఇక్కడే మెడిసిన్ చేస్తుంటాను. రమణి సరే, రెండు నెలల్లో శ్రీమతి అవుతుంది.

మరి నీల ఫ్యూచర్ ఏమిటో?" అంది నా వంక చూస్తూ.

విని మౌనంగా ఉన్నాను...

"నాకు తెలుసు..కుదిరితే పెళ్ళి, లేదా బయాలజీ మాస్టర్స్ చేసి లెక్చరర్ అవుతుంది," నిర్ధారించింది రమణి...

"ఏమైనా, మన ఈ స్నేహం ఇలా కొనసాగడానికి మనం ముగ్గురం కట్టుబడి ఉండాలి. సంతోషాలని పంచుకోకున్నా పర్వాలేదు కాని, ఏదైనా కష్టం కలిగినప్పుడు తప్పక *షేర్* చేసుకుందాము. ఒకరికొకరు సహాయపడదాము," అంది గంభీరంగా చిత్ర.

నేను, రమణి కూడా చిత్ర చేయందుకున్నాము 'ఔననట్టుగా'..

"*లెట్ అస్ గో నౌ,* పొద్దున్నే తిరుగు ప్రయాణం," చిత్ర మా చేతుల్ని పట్టుకొనే పైకి లేచింది.

"*వాట్ అ మార్వలస్ ట్రిప్!*" అంది రమణి నడుస్తూ...

"అరకులోయ అందాలు, ఈ ట్రిప్పు కూడా మరువలేని జ్ఞాపకాలే," అన్నాను.

"అక్కా, మన ట్రిప్పువి మొత్తం 999 పిక్చర్స్ తీసాము," కెమెరాతో పరుగున వచ్చి కలిసాడు వినోద్.

**

**యేడాది తరువాత...**


LIONS
L
INTERNATIONAL
MADE FOR EACH OTHE
BEAUTIFUL COUP

**ఢిల్లీ మహానగరం** లోని, 'రీగల్ లయన్స్ క్లబ్' వారి ఆవరణ కిక్కిరిసి ఉంది. మిరుమిట్లు గొలిపే జిలుగుల వెలుగులతో నిండి ఉంది ఆడిటోరియం. వారి '*ఆన్యువల్ ఫెస్టివల్*' సందర్భంగా ***'వేలంటైన్స్ డే'*** నాడు "***మేడ్ ఫర్ ఈచ్ అదర్***" కాంటెస్ట్ జరుగుతుంది.

ఆఖరి రౌండ్ కూడా ముగిసి, బ్రేక్ టైం లో మ్యూజిక్ ప్రోగ్రాం జరుగుతుంది.
ప్రతిష్టాత్మకమైన ఆ పోటీలో మాతో పాటుగా పాల్గొన్న యువ జంటలన్నీ ఎంతో ఉత్సుకతతో పోటీ ఫలితాల ప్రకటన కోసం వెయిట్ చేస్తున్నారు.

మరో ఐదు నిముషాలకి – చేతిలో కవర్ తో, క్లబ్ ప్రెసిడెంట్ - కృష్ణవంశీ గారు వేదిక పైనున్న మైక్ ముందుకొచ్చారు...

***"లేడీస్ ఎండ్ జెంటిల్ మెన్,***
***'మేడ్ ఫర్ ఈచ్ అదర్'*** అవార్డుని ఈ సారి అందుకుంటున్న అందమైన జంట, ***మిసెస్ ఎండ్ మిస్టర్, నీలవేణి ఎండ్ శ్యాంప్రసాద్ మధుర్కై,"....***

మిన్నంటే కరతాళధ్వనుల నడుమ *అనౌన్స్మెంట్* ముగించి, మా జంటని వేదిక పైకి ఆహ్వానించారు ఆయన. అవార్డుతో పాటుగా, అందరి అభినందనలను అందుకున్నాము.

అవార్డు అందుకున్న సందర్భంగా, మా వివాహం గురించి ఎందరో అడిగిన ప్రశ్నలకి ఒకేసారి మైక్ పుచ్చుకుని జవాబు చెప్పారు నా భర్త శ్యాం.

"మా వివాహమై, పదకొండు నెలలు అయింది. నీలని భార్యగా పొందడం నా అదృష్టమే. ఓ *వెడ్డింగ్ రిసెప్షన్లో* చూసాను నీలని. '*ఐ ఫెల్ హెడ్ ఓవర్ హీల్స్ ఫర్ హర్, ఇట్ వాజ్ లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఫర్ మీ*'. నీల అందచందాలు, పొడవాటి వాలు జడ, నడవడి చూసి, ప్రేమించి, ఆమెని వివాహమాడాను. ఆమె దేవుడు నాకిచ్చిన బహుమానం," ఎంతో గర్వంగా అన్నారు శ్యాం.
'రీగల్ క్లబ్' వారి '*మేడ్ ఫర్ ఈచ్ అదర్*' అవార్డు నా భర్త శ్యాంప్రసాద్ కి పట్టలేనంత ఆనందాన్నిచ్చింది.

ఆ సంబరాల్లో పాల్గొని ఇల్లు చేరేప్పటికి అర్ధరాత్రి దాటింది.
**
ఆలస్యంగా పడుకున్నా తెల్లారురఝామునే మెలుకువొచ్చేసింది. రాత్రి జరిగిన అవార్డు ఫంక్షన్ నెమరు వేసుకుంటూ క్రిందకొచ్చాను. కాఫీ ఫిల్టర్ ఆన్ చేసి, ఇంటి ముందున్న గార్డెన్ లోని గజేబోలోకి వెళ్ళి కూర్చున్నాను.
రాత్రి ఫంక్షన్ లో నా గురించి, మా పెళ్ళి గురించి, శ్యాం అందరితో అన్న మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి.

నిజమే, ఎక్కడో, వందన పెళ్ళిలో నన్ను చూసి, మధ్య తరగతి కుటుంబం నుండి అని తెలిసినా, నన్ను ఏరి కోరి వరించి పెళ్ళి చేసుకున్నారు శ్యాంప్రసాద్. ఢిల్లీలో పేరున్న సాఫ్ట్ వేర్ ఎం.ఎన్.సి మానేజింగ్ డైరెక్టర్ శ్యాం. పొడగరి, అందగాడు, సమాజంలో పేరున్న వ్యక్తి.

ఢిల్లీ వచ్చినప్పటినుండి దాదాపు ఏడాదిగా, అందరికీ ఆయన పట్ల ఉన్న గౌరవం, మక్కువ, ఆకర్షణ గమనిస్తున్నాను.

శ్యాం మంచి క్రీడాకారుడు కూడానట. కాలేజీలో బాడ్మింటన్, క్రికెట్ లో గుర్తింపు పొందారట. టెన్నిస్ క్రీడారంగాన కూడా జాతీయంగా పేరొంది, దీర్ఘకాలం టెన్నిస్ లో రాణించారట. *షోకేస్* నిండా ట్రోఫీలు, *మెడల్స్* వాటికి సంబంధించి ఎన్నో ఫోటోలు, పత్రికలు ఉన్నాయి. మామయ్యగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని శ్యాం ని మంచి *స్పోర్ట్స్* పర్సనాలిటి గా తీర్చిదిద్దారట.

వివాహమయ్యి వచ్చిన రెండు వారాలకి మా *వెడ్డింగ్ రిసెప్షన్* కూడా నేను ఊహించని రీతిలో ఓ కలలా జరిగింది. మా *రిసెప్షన్* నా జీవితాన మరువలేని ఘట్టమే. ఢిల్లీ లోని ప్రముఖులు ఎందరో విచ్చేసి అభినందనలు తెలిపారు.

వచ్చిన అతిధులు, "శ్యాం గారి *బ్రైడ్, ఇజ్ స్టన్నింగ్లీ బ్యూటిఫుల్*" అంటూ కొందరు, "శ్యాం, *యు ఆర్ లక్కీ*, ఇంత అందమైన

సంప్రదాయమైన అమ్మాయి భార్యగా దొరకడం అదృష్టమే. కంగ్రాచ్యులేషన్స్," అంటూ మరికొందరు మమ్మల్ని ఆకాశానికెత్తేశారు.

మా కుటుంబంతో పాటు రిసెప్షన్ కి వచ్చిన రమణి, ఆమె భర్త విజయ్, చిత్ర కూడా మమల్ని అభినందించి, నా అదృష్టానికి మురిసిపోయారు.

"ఆడబిడ్డ సాధింపు కాని, తోటికోడలు వేధింపు కాని లేవు నీకు. మకుటం లేని మహారాణివే. ఆ దేవుణ్ణి ఏ పూల పూజించావో? ఇలాంటి వాడు వలచి వచ్చి చేయందుకున్నాడు," అన్నవాళ్ళు కూడా లేకపోలేదు ఆ రోజున.

**

అవును మరి, నా భర్త పర్సనాలిటి అటువంటిది. స్పోర్ట్స్ హీరోగా గుర్తింపు, పలుకుబడి, పాప్యులారిటీ ఉన్న శ్యాంకి అభిమానులుండడం సర్వసాధారణం.

మాములుగా అయితే ఆయన వంటి భర్త 'పూర్వజన్మ సుకృతమే' అనవచ్చు.

కాని, మరి నేనెందుకు అంతటి ఆనందాన్ని పొందలేక పోతున్నాను?

కొద్ది రోజుల్లోనే వైవాహిక జీవితమంటే ఓ సంకోచం, భయం, వేదన నన్ను స్తబ్దుగా మార్చాయి. శ్యాం పట్ల, ఆయనతో ఏర్పడ్డ బంధం పట్ల కూడా నాలో గుబులు మొదలైంది.

నా గుండెల్ని పిండేసే నిజం, నాకు మాత్రమే తెలిసిన విషయం –

..నా భర్త శ్యాం - సౌమ్యం, సుకుమారం లేని మొరటు మనిషి... అని, పెళ్ళయ్యి యేడాదవుతున్నా, నాతో అతను ప్రవర్తించే తీరు సహించలేనిదిగా ఉందని మదనపడుతుంటాను.

స్త్రీల పట్ల సుకుమారంగా మెలగాలని తెలియనితనమా? లేక క్రీడాకారుడిగా 'క్రీడ' అనేది అతనిలో 'ఎదుటి మనిషిని చిత్తుగా ఓడించాలి' అనే వింత ప్రవృత్తిని నింపిందా? అని కూడా ఆలోచించాను.

పెళ్ళైన నెల నుంచే సరసత లోపించిన నా భర్త ప్రవర్తన భరించగలగడం ఎలాగో తెలియక అయోమయమైంది నా మనస్థితి.

**

"అమ్మాయిగారు, కాఫీ," అంటూ గాజేబోలోకి ట్రేలో కాఫీ తెచ్చింది వంట మనిషి జానకి. దాంతో నా ఆలోచనలకి కళ్ళెం పడింది.

కాస్త దూరాన్నించి అత్తయ్య కూడా నా వైపుగా రావడం చూసాను. తరచుగా పొద్దున్నే అక్కడ కూర్చుని, నేను అత్తయ్య కబుర్లు చెప్పుకుంటాము.

మాల కట్టడానికి పూలబుట్టలో రకరకాల పూలు తెచ్చుకుని నా ఎదురుగా కూర్చున్నారు.

“ఏమ్మా, సరిగ్గా నాలుగు వారాల్లో మీ పెళ్ళి రోజు. సెలెబ్రేట్ చెయ్యాలంటే, ఇప్పటినుంచి *ప్లానింగ్* మొదలెట్టాలి. కానీ, మీరంతా ఏ హంగామా వద్దన్నారుగా!

ఇంకొక్కమారు సాయంత్రం మళ్ళీ శ్యాంని కూడా అడుగుతాను. అదే జవాబైతే ఇక వదిలేస్తాను. ఆ రోజు గుడికి వెళ్ళి దేవుడికి అభిషేకం, అక్కడ ఆశ్రమంలో అన్నదానం చేయించుదాము,” అంటూ పూలబుట్ట నా ముందుంచారు.

మాల కట్టడానికి పూలని వేరు చేయసాగాను.....

పెళ్ళిరోజు ప్రస్తావన రాగానే, నా ఆలోచనలు, తిరిగి శ్యాం వైపు, నా వైవాహిక జీవితం వైపు మళ్ళాయి.....

భర్త కౌగిలిలో కరిగిపోదామని ఎదురుచూసే బదులు, తన చేష్టలతో, ఎప్పుడు ఎలా బాధ కలిగిస్తాడో అని నిత్యం వ్యధ చెందుతుంది మనసు.....

అందమైన జడ అని సవరిస్తూ, నేను అమాంతం నేలకొరిగేలా జడ పట్టి లాగిన ప్రతీసారి ఏడ్చి కుమిలిపోయాను.

ఓ రోజు, బెడ్ కాఫీ ఇచ్చి వెనుతిరిగిన నన్ను, బలంగా చేయి పట్టి లాగిన విసురికి మంచం కోడు తగిలి బాధతో విలవిల్లాడిపోయాను. నా నుదుటి మీద గాయమై, ఏడు కుట్లు పడి మాయని మచ్చ కూడా అయింది. సంఘటన జరిగి ఆరునెల్లయినా, ఇప్పటికీ బాధనిపిస్తుంది.

ఆ రోజునే మా అత్తగారికి విషయాలు చెప్పాను. "ఇది సరసమా?" అని ధైర్యం చేసి అడిగి, కన్నీరు పెట్టుకున్నాను కూడా. ఆవిడ అదిరిపోయారు. కలత చెందారు.

నా భర్త సున్నితత్వం లోపించిన శృంగార చేష్టలకు, రెండేసి రోజులు ముఖం చాటు చేసుకుని తిరిగిన తడవలు ఎన్నో... తలుచుకుంటే...మనసు వికలమై పోతుంది.

**

ఏం చేయాలి? ఎవరికి చెప్పుకోవాలి? జీవితాంతం భరించగలనా? శ్యాం మారుతారా?

నా వివాహం వల్ల సమాజంలో తమ గౌరవం పెరిగిందని మురిసిపోతుంది మా కుటుంబం. నా తమ్ముడు వినోద్ కి శ్యాం బావగారు ఓ పెద్ద హీరో. నా మనస్థితి, నా భర్త మొరటు పైఖరి గురించి నోరు మెదిపే అవకాశమే కరువైపోయింది.

అదీకాక గుట్టుగా మెలగడం అలవాటున్న నాకు ఇటువంటి ఇబ్బందికరమైన విషయాలతో బయటపడటం కూడా ఓ అనూహ్యమైన సంగతే అయింది. ఆఖరికి, నా స్నేహితురాళ్ళు చిత్ర, రమణిలతో కూడా నోరు విప్పి చెప్పుకొనే సాహసం కొరవైంది నాలో.......అని ఆలోచిస్తూ నిట్టూర్చాను...

“ఏమ్మా అంత దీర్ఘాలోచనలో ఉన్నావు... ఎంత మాలయిందో చూడు. ఇది దేవుడికి వెయ్యి. బటన్ గులాబీలు నీ కోసమే గుత్తిగా కట్టాను. అది నువ్వు పెట్టుకో,” అన్న అత్తయ్య మాటకి ఈ లోకంలోకి వచ్చాను.

**

తరువాత నెల రోజులకి, మా పెళ్ళిరోజు పొద్దున్నే, అత్తయ్య నాకోసం తీసుకున్న పట్టు చీర కట్టి తయారయ్యాను. శ్యాం, అత్తయ్య, మామయ్యలతో గుడికి వెళ్ళాను. దేవుడికి అభిషేకం చేయించాక మాచేత అన్న, వస్త్రదానాలు చేయించారు.

రెండు రోజులుగా నాకు ఒంట్లో నలతగా ఉన్న కారణం - ‘ప్రెగ్నెన్సీ’ అని కన్ఫర్మ్ అవ్వడంతో, అత్తయ్య చాలా ఆనందంగా ఉన్నారు. తన సంతోషాన్ని అమ్మావాళ్ళతో, మామయ్యతో పంచుకున్నారు. శ్యాంలోనూ ఓ కొత్త ఉత్సాహం, సంతోషం కనబడ్డాయి.

నా ప్రెగ్నెన్సీ గురించి తెలిసాక నిన్నంతా ఏదో స్తబ్దుగా అనిపించింది.
ఇవాళే, ఈ పూజ అదీ అయ్యాక మనసు తేలికయ్యింది.
గుడి నుంచి వచ్చాక శ్యాం కాసేపు ఇంట్లోనే ఉండిపోయారు. అత్తయ్య అందరికీ ఇష్టమైన వంటలు చేయించారు. కలిసి భోంచేసాము.

లంచ్ చేసి శ్యాం ఆఫీసుకి వెళ్ళిపోయాక, డైనింగ్ టేబుల్ వద్ద నేను, అత్తయ్యే మిగిలాము.

నెమ్మదిగా స్వీట్ తింటూ, నేను తల్లిని కాబోతున్న విషయం ఆలోచిస్తున్నాను. నాకూ సంతోషంగానే ఉంది.

నా మనసులోని చిరాకుల్ని, సమస్యల్ని కొద్దిగా పక్కకు నెట్టి, ఎలాగోలా జీవితాన్ని అనుకూలంగా మలుచుకోవచ్చునేమో అన్న చిన్న ఆశ కలుగుతుంది. శ్యాం కూడా కొంతైనా మారవచ్చునేమోనన్న ఆలోచనతో పాటుగా.

మౌనంగా కూర్చుండిపోయిన నన్ను గమనించారు అత్తయ్య. నా భుజం మీద చేయి వేసి, "నీవు నిస్సంకోచంగా మసులుకో. దేనికైనా నీకు నేను ఉన్నాను. నీవు క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటూ పుట్టబోయే బిడ్డ గురించి ఆలోచించు. ఏది ఎలా కావాలన్నా చేయి. అన్నిటా నీకు పూర్తి స్వేచ్ఛ. దేనికీ మొహమాట పడవద్దు," అన్నారు అత్తయ్య ఆప్యాయంగా.

"బయలుదేరు, మీ *వెడ్డింగ్ యానివర్సరీ గిఫ్ట్* కొనాడానికి రమ్మన్నాడు శ్యాం. *సెలెక్ట్* చేసేప్పుడు ఫోన్ చేస్తే, ఆఫీసునుండి వస్తాన్నాడు," అంటూ నన్ను బయలుదేర దీసారు ఆమె.

**

నా తలకి గాయమయిన సంఘటన తరువాత, శ్యాం విషయంగా, అత్తయ్య నా ఆవేదన అర్థం చేసుకొన్నట్టుగా అనిపిస్తుంది. సొంత తల్లిలా నా వెన్నంటే ఉండి, అన్నిటా సాయం చేస్తుంటారు.

అవకాశం దొరికినప్పుడల్లా ఆవిడ శ్యాంతో కబుర్లు చెబుతూ, "పెళ్లి కూడా అయింది, కాస్త దూకుడు తగ్గించి, నెమ్మది, మృదుత్వం అలవరుచుకోవాలి కన్నా," అని మెత్తగా మందలిస్తారు కూడా.

శనివారాలు పెందరాళే ఇంటికి వస్తారు శ్యాం. ప్రతి శనివారం అతనికి ఇష్టమైన పెరుగువడలు చేస్తారు అత్తయ్య. కబుర్లు వింటూ, ఒక్కోసారి నేనూ వాళ్ళ వద్ద కూర్చుంటాను.

**

ఆవడలతో పాటు, ఇవాళ ఆలూ బోండా కూడా చేసి, శ్యాం దగ్గర చేరారు అత్తయ్య. నేను డైనింగ్ టేబిల్ సర్దుతూ, ఆమె మాటలు వింటున్నాను.

కొడుకుకి ఆధ్యాత్మికం బోధిస్తూ, ఉదాహరణలిచ్చి స్త్రీలు సున్నితులని చెప్పారు.

"అసలైనా, అంతెందుకు? నీ భార్య ఎంతటి సుకుమారో తెలుసా! ఆ అమ్మాయికి తోటలో పనిచేసినా చేతులు కందిపోతున్నాయి. ఈ నాజుకు పిల్లతో నాజుగ్గానే మసులుకోవాలి," అని నవ్వేసారు.

నేను తీసుకెళ్ళిన ట్రే నుండి కాఫీ అందుకుంటూ, "అందుకే, అన్నిటికీ పనివాళ్ళని పెట్టుకోమ్మా, కష్టపడవద్దు, అని కూడా చెప్పేసాను నీలకి. ఇలా కాఫీలు అందివ్వడానికి కూడా," అంటూ శ్యాం ముందు నన్ను ఆట పట్టించారు.

ఏమైనా, శ్యాంతో ఉన్నప్పుడు, నేనే అప్రమత్తంగా మెలగడం అలవరచుకుంటున్నాను.
నా మనస్సుని నిశ్చలంగా ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నాను.

## 2

నా భర్తతో, జీవనాన్ని సంతోషమైనదిగా చేసుకోవాలని గట్టి ప్రయత్నమే ఆరంభించాను. ఎక్కడ, ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచించాను.....

అన్ని సమయాల్లో నా జడని ముందు అందిపుచ్చుకుంటారు శ్యాం.

శ్యాంకి ఇకపై ఆ అవకాశం లేకుండా చేయాలని, పొద్దున్నే జుత్తు పొట్టిగా కత్తిరించి ముడి వేసుకొన్నాను.

ఇకపై ఆ చికాకు, తలనొప్పి నాకు తప్పినట్టే......అనుకుంటూ, కిందికి వెళ్ళి అత్తయ్యకి వంటింట్లో సహాయం చేయబోయాను.

“అదేమిటి నీలా? అంత చక్కని జుట్టుని అలా కత్తిరించేసావు? అన్నారామె ఆశ్చర్యంగా, నా జుట్టు చూసి.
“పైగా ముసలావిడిలా ఆ ముడి ఏమిటి?” అన్నారు కూడా కోపంగా.
ఏమనాలో తోచక మౌనంగా ఉండిపోయాను. ఆమె అంతలా ఫీల్ అవుతారనుకోలేదు.

ఆలోచిస్తే, ‘నా యీ చేష్ట అమ్మకైనా నచ్చదు’ అనుకున్నాను.

“మరోసారి ఆ పని చేయకమ్మా, చక్కని నీ తలకట్టు, పొడవాటి నీ జడ నీకెంత అందాన్నిస్తాయో తెలుసా? అంటూ బాధపడ్డారు అత్తయ్య.....

నన్ను మొదటి సారి చూసినప్పుడు, “మీ అమ్మాయికి ఇంత వత్తైన జుత్తు, చక్కని తలకట్టు ఉండబోతాయని ముందే తెలిసి ‘నీలవేణి’ అని పేరు పెట్టారా వదినా?” అని అమ్మని అత్తయ్య అడగడం,

“లేదండీ, మా అత్తగారే ఈ మనవరాలికి నామకరణం చేశారు. ఆవిడ అత్తగారి పేరు ‘నీలవేణి’ అట,” అంటూ అమ్మ నవ్వేయడం గుర్తొచ్చింది.

**

అత్తయ్య నాకోసం ఎంతో శ్రద్ధగా వండించే తినుబండారాలు, తెప్పించే మామిడి కాయలు, ఉసిరికాయలు మినహాయించి, ఈ సమయంలో ఆహ్లాదాన్ని కలిగించేది, మనసుని మళ్ళించే ఇష్టమైన వ్యాపకం ఏముంటుందాని ఆలోచించాను.

చిన్నప్పటినుండి నాకు *పెట్స్*, *గార్డెనింగ్* చాలా ఇష్టమని గుర్తొచ్చింది. స్కూల్ కి వెళ్ళే దారిలో తప్పిపోయిన కుక్కపిల్లల్ని చేరదీసేదాన్ని. ఆ నోరులేని జీవాలు నాలో తెలియని ప్రేమని, మార్దవాన్ని నింపేవి. అప్పట్లో ఆ కుక్కపిల్లల్ని పెంచే స్తోమత లేక, పెట్స్ అంటే ఇష్టమున్న ఫ్రెండ్స్ కి వాటిని అప్పజెప్పేదాన్ని.

ఇప్పుడు ఈ ఇంటికి – ముందు, వెనకా కూడా పెద్ద ఆవరణ ఉంది. ఉన్న గార్డెన్ని కొత్త మొక్కలతో మరింత అందంగా చేయవచ్చు. కాక, కుక్కపిల్లల్ని కూడా బేషుగ్గా పెంచుకోవచ్చు కదా! అనుకున్నాను.

ఈ మధ్యనే నేను 'ఢిల్లీ యానిమల్ షెల్టర్' వారి *ఆడ్-హాక్* కమిటీ సభ్యత్వం పొందాను కూడా. శ్యాం భార్యగా ఢిల్లీలో నాకు లభించిన గౌరవపూర్వక హోదాల్లో ఇదొకటి.

*గార్డెన్ని* తీర్చి దిద్దాలని ఉందంటే అభ్యంతరాలేముండవు కాని, పెట్స్ విషయంలో అత్తయ్య అనుమతిస్తారో లేదో అడగాలనుకున్నాను.

**

మరునాడు మధ్యాహ్నం, కిచెన్ లో నాకోసమే కారెట్ జూస్ ప్రిపేర్ చేయిస్తున్న అత్తయ్య దగ్గర చేరాను. నా మనసులో మాట బయట పెట్టాను.

"నాకూ పెట్స్ అంటే ఇష్టమేనమ్మా. వెళ్ళి నీకు కావాల్సిన మంచి జాతి కుక్కల్ని రెండు కాకపోతే మూడింటిని తెచ్చుకో, మామయ్యకి కూడా ఏమీ అభ్యంతరముండదు, సరేనా," అన్నారామె.

నా ఆనందానికి అవధుల్లేవు. మా షెల్టర్ కి ఫోన్ చేసాను.

"ప్రస్తుతం మన వద్ద లేవు. ఏవైనా మంచి పప్పీస్ వచ్చినప్పుడు ఇన్ఫార్మ్ చేస్తాను,"... కొద్ది రోజులు ఆగమంది, షెల్టర్ మానేజర్.

**

నెలలు నిండుతుంటే, అత్తయ్య దగ్గరే కూర్చుంటున్నాను. ఎక్కువ సమయం ఆవిడతోనే గడుపుతున్నాను. యిద్దరం కలిసి బేబీ గది ఎలా ఉండాలో ప్లాన్స్ వేయడం, బేబీ ఫర్నిచర్ కోసం అప్పుడప్పుడు షాపింగ్ వెళ్ళడం చేస్తున్నాము.
పై అంతస్తులో, మా గదికి ఎదురుగా ఉన్న గదిని బేబీకని కేటాయించాము.

ఆరో నెల రాగానే, మెట్లెక్కడం కష్టంగా ఉందని క్రింద అంతస్తులోని గెస్ట్ రూంలోకి మారాను.
**
షెల్టర్ నుండి, రెండు చక్కని *డాషాండ్* జాతి కుక్కపిల్లల్ని తెచ్చాను. క్యాండి, మిండి అని అత్తయ్యే పేర్లు పెట్టారు. క్యాండి మగ కుక్కపిల్ల, మిండి ఆడపిల్ల. సౌమ్యంగా నడుచుకునే ఫామిలీ పెట్స్ గా ఆ జాతికి గుర్తింపు ఉంది. సైజ్ - చిన్నగానే ఉండిపోతాయట. మామయ్యకి కూడా నచ్చాయి.

ఇంటి వెనక నీడగా చల్లగా ఉండే ప్రదేశంలో, వాటికి డాగ్-హౌజ్ నిర్మించి, మెత్తని పరుపులు, ఆడుకునే బంతులు తెప్పించి అన్నీ అమర్చాను.
రోజు వాటిని వాకింగ్ చేయించడం సరదాగా ఉంది. శ్యాం కూడా ఒకోప్పుడు నాతో పాటు క్యాండి, మిండి లతో ఆడ్డం, వాక్ చేయడం సంతోషాన్నిచ్చింది. డాగ్ పార్క్ కి కూడా వెళ్ళాము.

"ఈ జాతి డాగ్స్ *రన్నర్స్* కావు. *డక్స్* లాగా నేలమీదే ఉంటాయి. పొట్టి కాళ్ళు, *హెవీ బాడీ*. కాస్త *మైల్డ్* రకమే," అన్నారు శ్యాం వాటి గురించి.

ఓ రోజు పొద్దున్నే, శ్యాం, వాటిని ఆడిస్తూ పదేపదే అవి బాధతో అరిచేలా బంతి వేసి గట్టిగా కొట్టడం చూసాక, నా సంతోషం పటాపంచలైంది.
జతగా ఉండవలసిన కుక్కపిల్లల్ని, ఆడించే నెపంతో పరస్పరం దాడికి ఉసిగొల్పుతూ, వాటిల్లో శత్రుత్వం పెంచుతున్నారు శ్యాం.
అదేమని పశ్నిస్తే,

"అలాగే *ట్రైన్* చెయ్యాలి. లేదంటే, అవి *వాచ్-డాగ్స్* అయ్యేదెలా?" అంటూ ఎదురు ప్రశ్న వేసి మొండి వాదన చేసారు. శ్యాం తో అలా వాదించి లాభం లేదని గుర్తించాను.

అత్తయ్యని సంప్రదించి, క్యాండి, మిండి లని చూసుకొని, తోట పని కూడా చేయడానికి ఇద్దరు పనివాళ్ళని పెట్టాను. రాము, జీవా. ఇద్దరూ వాచ్ మాన్ తమ్ముళ్ళు.

శ్యాంని కుక్కపిల్లలకి దూరంగానే ఉంచగలుగుతున్నాను.
**
ఏడో నెల వచ్చాక, *మార్నింగ్ సిక్నెస్* పూర్తిగా తగ్గి, బాగానే తినగలుగుతున్నాను.....

ఓ రోజు పొద్దున్నే, బ్రేక్ఫాస్ట్ అయ్యాక, అత్తయ్య తీరిగ్గా అమ్మకి ఫోన్ చేసారు.

"మీరూ ఆత్రుతగా ఉన్నారుగా వదినా! మన నీలకి ఏడవ నెల వచ్చి, తేలిగ్గానే తిరుగుతుంది. ఇప్పుడు శ్రీమంతం జరిపిద్దాం. చక్కగా ఓ నాలుగు రోజులు ఉండేలా రండి. మీరొచ్చినప్పుడు నీల డెలివరీ గురించి మాట్లాడుదాము," అంటూ ఏడవ నెల నిండేలోగా ఆ కార్యానికి ముహూర్తం పెట్టించారు అత్తయ్య.

**

సంప్రదాయంగా, మేళతాళాలతో, పెద్దవాళ్ళంతా దగ్గరుండి జరిపించారు నా శ్రీమంతం వేడుకలు.

వచ్చిన ముత్తైదువులంతా వెళ్ళాక, హాల్లో కూర్చుని అందరు కబుర్లు చెప్పుకుంటున్నారు. వింటూ, నేనూ అక్కడే ఉన్నాను....

"వదినా, మీరు నాకో మాటివ్వాలి," అన్నారు అత్తయ్య, ఉన్నట్టుండి అమ్మతో....

"ఇరువైపులా మా కుటుంబాల్లో కొన్ని తరాలుగా ఆడ సంతానమే కలగలేదు. ఆడపిల్లల ముద్దుముచ్చట్లు, ఆప్యాయతలకి నోచుకోలేదనుకుంటా.

మా వాళ్ళకి కూడా నేను దత్తపుత్రికనని మీకు తెలుసుగా!

ఇక ఇన్నాళ్ళకి గుణవంతురాలైన నీల మా ఇంటి కోడలిగా వచ్చాక మాత్రం ఆ కొరత తీరింది. సొంతబిడ్డలా కలిసిపోయింది మా కోడలు.

ఇరువైపులా చుట్టాలందరికీ నీలంటే చాలా ఇష్టం కూడా. మా కోడల్ని - మా అదృష్టంగా భావిస్తాము,'' అంటూ క్షణమాగారామె.

“మీకు సౌకర్యం లేదని కాదు. అపార్థం చేసుకోకండి. నీల ప్రసవం కూడా..ఇక్కడే కానిద్దాం వదినా... మన నీలని మొదటినుండీ చూస్తున్న డాక్టర్ చేతులమీదుగా జరగనిద్దాం... ఏమంటారు? అంతే కాదు, ఇకమీదట వీలైనంతమటుకు నీలవేణి పురుళ్ళు, వేడుకలు మీ ఆశీస్సులతో ఇక్కడే జరుపుకుందాము. మీరైనా, మేమైనా, తేడా ఏముంది చెప్పండి,'' అడిగారు ప్రాధేయపడుతూ, అత్తయ్య......

అమ్మ నవ్వుతూ మౌనంగా ఉండిపోయింది.

“అదీ కాక మనింట్లో ఏ వేడుక జరిగినా మావాళ్ళు కనీసం వందమంది బంధువులు, సప్తసముద్రాలు దాటైనా వస్తారు. చూసారుగా పెళ్ళికి ఎంతమంది వచ్చారో! మన ముచ్చట కంటే బంధువుల మర్యాదలు ఎక్కువౌతాయి కూడా! అదే పెద్ద పనైపోతుంది,'' అంటూ నవ్వేశారు అత్తయ్య.

మరో నాలుగు రోజులుండి అమ్మావాళ్ళు, తమ్ముడు వెళ్ళిపోయారు. మా క్యాండి, మిండి లు వాళ్ళకి కూడా నచ్చాయి.

**

అత్తయ్య అండదండలు, ఆప్యాయతల నడుమ నాకు తొమ్మిది నెలలు నిండాయి.

ఢిల్లీ అపోలో హాస్పిటల్లో, సెప్టెంబర్ పదిహేనున, ఉదయం ఎనిమిదింటికి *సిజేరియన్* ఆపరేషన్ అయి, పండంటి బాబుకి తల్లినయ్యాను. శ్యాం లాగా అందమైన వాడు నా బాబు.. ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నాము.

బాబు పుట్టే సమయానికి ఢిల్లీ వచ్చారు అమ్మావాళ్ళు.
పరీక్షలుండడంతో, వాళ్ళ కూడా రాలేకపోయాడు వినోద్.
ఐదు రోజులకి నేను, బాబు హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేసాము.
అమ్మకి సహాయం చేస్తూ, పసివాడి పని నేర్చుకుంటుందని శాంతమ్మని పనిలోపెట్టారు అత్తయ్య. ఆదివారాలు తప్పించి, ఆమె పొద్దుటే వచ్చి సాయంత్రం ఆరు వరకు ఉంటుందిట.

బాబుని ఎత్తుకోడానికి, శ్యాం తెగ ముచ్చటపడతారు. చేతుల్లోకి తీసుకొని మాత్రం, యిబ్బంది పడుతున్నారు. మామయ్య కూడా అదే తంతు. వారిపురు, ప్రస్తుతం ఆమడ దూరం నుండే బాబుని ముద్దులాడి వెళుతున్నారు.

**

నేనింటికొచ్చిన మూడోరోజు, బాబుని చూడ్డానికి వస్తున్న చిత్ర, రమణి లతో తమ్ముడు వినోద్ కూడా ఢిల్లీ వచ్చాడు.

వారి రాక నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.
"అక్కా, బాబుకి నా పోలికులు కూడా ఉన్నాయి కదూ," అంటూ బాబు చుట్టూనే ఉంటున్నాడు వినోద్.

**

...ఇంటి వెనక గార్డెన్ లో విరగబూసున్న పూల సువాసనలకి, ఆరుబయట గాలికి - కూర్చోవాలని, కుక్కపిల్లలతో ఆడాలని ఉంది...
బాలింతవంటూ అమ్మ, అత్తయ్య మరో రెండు రోజులు గది దాటి రావద్దన్నారు.

అమ్మ చెబుతుంటే, పిల్లల పెంపకం గురించి చాలా విషయాలు వింటున్నాము.. అత్తయ్య కూడా మాతో అవే కబుర్లు.
మా ముగ్గురి స్నేహం, మా చదువులు, పెళ్ళిళ్ళ గురించి అడిగి తెలుసుకున్నారు ఆవిడ.

రమణి వైవాహిక జీవితం సుఖంగానే ఉందని విని సంతోషించాము. డిగ్రీ అయిన రెండు నెలలకి పెళ్ళి చేసుకొని, భర్తకి బిజినెస్ లో కూడా పార్టనర్ అయ్యింది రమణి.
నా పెళ్ళికి అన్నీ తానే దగ్గరుండి అమ్మవాళ్ళకి సాయం చేసిందని గుర్తు చేసుకున్నాము నేను, అమ్మా కూడా.

“అదే వైఖరి, అదే అల్లరి..రమణి మారలేదు,”...అంది అమ్మ రమణి గురించి, నవ్వుతూ...

చిత్ర మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతుంది. సైకియాట్రిస్ట్ అవ్వాలన్న చిత్ర నిర్ణయం మారలేదు. మెడిసిన్ ఫైనల్ ఇయర్

అయ్యాక,  తన సీనియర్ ఆనంద్ ని పెళ్లి చేసుకోబోతుందిట. తరువాత పోస్ట్-గ్రాడ్యుయేషన్ కూడా చేస్తుందట.

బాబుని ఒడిలోకి తీసుకొని ముద్దులాడుతూ, "నేను మాత్రం పెళ్ళి అయిన వెంటనే బిడ్డ కోసం ప్లాన్ చేస్తా," అన్న చిత్ర  మాటలకి అందరం నవ్వుకున్నాము.

"మీ బాబు అచ్చం వాళ్ళ నాన్నలా ఉన్నాడే నీలా.  అసలు నీ పోలికే లేదనుకో, ఒక్క జుట్టు విషయం తప్పించి," అంటూ నేను ఉడుక్కుంటానేమో నని చూసింది రమణి.

"మా వారి అందాలు పోలికగా వస్తే మంచిదేగా," అంటూ నవ్వేసాను.

**

రెండోరోజున వాళ్లకి మా కుక్కపిల్లలు క్యాండి, మింది లని  చూపిద్దామని ఇంటి వెనక  కంపౌండ్ లోకి తీసుకు వెళ్ళాను.  నేను కూడా వాటిని చూసి వారం దాటింది. 'క్యాండి' కదలకుండా ఓ మూలకి పడి ఉన్నాడు.  కుడి కాలుకి బేండేజి వేసి ఉంది. రాముని పిలిచి అడిగాను.

"శ్యాం బాబుగారు కుక్కపిల్లల్ని దూరంగా ఉన్న పార్క్ కి  తీసుకెళ్ళారు మేడమ్.  మేమూ వెళ్ళాము.  పార్క్ లో చాలాసేపు ఆడించాము కూడా. ఇంటికొచ్చే ముందే, కాస్త ఎత్తైన గుట్టల  మీద  నుండి కిందకి పరిగెత్తిచ్చేసరికి  క్యాండి కాలు మెలికపడి, కదలలేకుండా అయిపోయింది. బాబుగారు వెంటనే డాక్టరు చేత  కట్టేయించారు.

తమరు తిరిగొచ్చిన ముందు రోజే మేడమ్," అంటూ విషయం బయట పెట్టాడు.

అసలంతగా పరిగెత్తలేని కుక్కపిల్లని, గుట్టలెక్కించి మరీ కిందకి తరమడం ఏమిటని నమ్మలేకపోయాను. శ్యాంలో నిర్లక్ష్యం, నిర్దయ కూడా ఉన్నాయని నా మనస్సు తడబడింది.

**

క్యాండి విషయంగా అన్యమనస్కంగానే ఉన్నా, చిత్ర కాబోయే భర్త గురించిన కబుర్లు, రమణివాళ్ళ కొత్త ఇల్లు – సంసారం - బిజినెస్ సంగతులు మాట్లాడుతూ గడుపుతున్నాను.

"పురిటికి కూడా ఇక్కడే ఉండిపోయావు. నిన్ను వదిలి ఉండలేరా శ్యాం? హైదరాబాదులో జరిగే నా పెళ్ళికి మాత్రం ఇద్దరు కలిసే రండి తల్లీ," అంటూ నవ్వేసింది చిత్ర.

"నీ పెళ్ళికి తప్పకుండా వస్తాగా! ప్రామిస్," అన్నాను.

రోజు బ్రేక్ఫాస్ట్ అయ్యాక, వినోద్ తో ఢిల్లీ తిరిగేసి, కాస్త షాపింగ్ కూడా చేస్తున్నారు.

వచ్చిన ఐదవ రోజున చిత్ర, రమణి, వినోద్ తిరుగు ప్రయాణమయ్యారు.

**

కుక్కపిల్ల క్యాండి కాలు విషయమై డాక్టర్ సలహా తీసుకొని, రాము సాయంతో నడిపించడం మొదలుపెట్టాము.

నా బాబుకి కూడా మూగజీవులపై ప్రేమ, జాలి ఉండాలని నా కోరిక.

**

బాబుకి 'సందీప్' అనే పేరు అందరికీ నచ్చింది. పసిమి ఛాయ, కొనదేరిన చక్కని ముక్కు, చిన్ని నోరు, నవ్వితే కుడి బుగ్గన *డింపిల్.* వొత్తైన ఉంగరాల క్రాఫు. ఇంటిల్లిపాదికి నిత్యం వాడి ముద్దు మురిపాల్లో గడిచిపోతుంది.

పెద్దవాళ్ళంతా వంతులేసుకుని మరీ వాడిని ఎత్తుకుని ముద్దులాడుతున్నారు.

దిష్టి చుక్కలు నానమ్మ పెడితే, నలుగు స్నానాలు అమ్మమ్మ డ్యూటీ.

"బాబు అచ్చం చిన్నప్పటి నీలని చూసినట్టే ఉన్నాడు," అంటూ అమ్మ బాబుని ముద్దులాడుతుంది.

"ఏమంటారు మీరు?" అంటూ మధ్యలో నాన్నని కూడా అడుగుతుంది..

"అదెలా సాధ్యం వదినా? బాబు అచ్చం మా శ్యాంలా కదా ఉన్నాడు," , "చూడండి వాడి చిన్నప్పటి ఫోటో ఆల్బం," అంటూ అత్తయ్య శ్యాం చిన్నప్పటి ఆల్బం అందిస్తారు.

బాబుని చూడ్డానికి ఎవరైనా వస్తే, తరుచుగా ఇంట జరిగే సంఘటన అదే. నాకు నవ్వొస్తుంది వాళ్ళు పోటీ పడే తీరు చూసి.

**

రాత్రిళ్ళు బాబు నిద్రపోవడం తక్కువే. మేలుకుని ఆడుతుంటాడు. ఒక్కోసారి కడుపు నొప్పితో బాధపడుతుంటాడు. నాకు, బాబుకి కూడా రాత్రి జాగారాలు ఎక్కువే. అందర్నీ డిస్టర్బ్ చేయకుండా తలుపులు వేసుకొని వాడిని సముదాయిస్తూ ఉండవలసి వస్తుంది.

ఆదివారాలు తానింట్లో ఉన్నప్పుడు, పగళ్ళు బాబుని తన దగ్గర ఉంచమంటారు శ్యాం.

మొదట్లో బాబుని చేతిలోకి తీసుకోడానికే సంశయించే శ్యాం, మెల్లగా అలవాటు చేసుకొంటున్నారు. శ్యాం బాబుని ముద్దులాడుతుంటే, చూడ్డానికి చాలా ముచ్చటేస్తుంది.

నా ఎదురుగా వాడిని ఆడిస్తుంటే, ఓ కలలా తోస్తుంది. అప్పుడు అతినిలో నేననుకున్న మొరటుతనం కూడా కనిపించదు. శ్యాం ఆప్యాయంగా బాబుని ఎత్తుకుంటుంటే, ఇకనుండి అతని మీద దేనికీ అలగకూడదు అనుకున్నాను.

**

ఇంటికొచ్చిన మూడు వారాలకి బారసాల జరిపించి, 'సందీప్' అని నామకరణం కూడా చేయించాక, అమ్మా వాళ్ళు తిరుగు ప్రయాణమయ్యారు.

"బాబు అన్నప్రాసనకి రావాలి మీరు మళ్ళీ" అంటూ వారిని సాగనంపారు అత్తయ్యావాళ్ళు.

“మా మనవడిని తరుచుగా చూసుకోడానికే, ఈ తాతగారి దక్షిణరైల్వే ఉద్యోగం బాగా పనికొస్తుంది.  సుఖంగా, సౌకర్యంగా ప్రయాణాలు చేస్తున్నాము,” నవ్వుతూ కారెక్కింది అమ్మ.

**

మరో రెండు నెలలకి బాబు గది తయారయ్యాక, తిరిగి,  పై అంతస్తులోకి మారాను.

‘శ్యాం, బాబుని చక్కగా ఎత్తుకుంటున్నారు, ఆడిస్తున్నారు’ అని ఆనందించినంత సేపు పట్టలేదు, అది నిజం కాదని తెలుసుకోవడానికి.

బాబు  నిద్ర పోయేప్పుడు  వాడి  చేతులు, పాదాలు లాగుతూ వాడిని నిద్ర లేపుతున్న శ్యాం ని, కొన్ని సార్లు గట్టిగా వారించాను.

“బాబుతో ఆడాలని ఉంది, వీడేమో ఎప్పుడు చూసినా నిద్ర పోతున్నాడు,” అంటారు శ్యాం.

బాబుకి కాపలా కాయడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి.  శాంతమ్మ ఉన్నా సందీప్ పనులన్నీ స్వయంగా చేసుకుంటాను.  నాకు అన్నిటా సాయం చేస్తూ,  బాబుని ఓ కంట కనిపెట్టుకొని ఉంటుందామె.

**

ఆదివారం మధ్యాహ్నం  భోజనం అయ్యాక అందరూ కాస్త నడుం వాల్చారు.

బాబుని నిద్రపుచ్చి క్రిబ్బులో వేసాను. ఎదురు గదిలో పేపర్ చదువుతున్న  శ్యాం వద్దకు వెళ్లాను.

“రాత్రంతా బాబు కడుపునొప్పితో బాధపడ్డాడు. ఇప్పుడే కాస్త నిద్ర పోతున్నాడు. నేను కిందకి వెళ్ళొచ్చేలోగా వాడు లేచినట్టు గాని, వాడి ఏడుపు గాని వినిపిస్తే, నన్ను పిలవండి. వాడిని మాత్రం అక్కడినుండి లేపొద్దు,” అని చెప్పి కిందికి వచ్చి ఇంటి వెనక సిటౌట్ లోకి వెళ్లాను.

బయట వాతావరణం చల్లగా, హాయిగా ఉంది. శుభ్రం చేయడానికి సులువుగా ఉంటుందని డాగ్-హౌజ్ చుట్టూ ఫ్లోర్ వేయించారు అత్తయ్య. మంచి గాలి, పూల సువాసనలతో ఆహ్లాదంగా ఉంటుందక్కడ.

రాము చేత క్యాండి, మిండీల *గ్రూమింగ్* చేయించి, డాగ్-హౌజ్ శుభ్రం చేయించాను.

బాబుకి పాల టైం అవడంతో అక్కడి నుండి కిచెన్ వైపు నడిచాను.

**

ఫీడింగ్ బాటిల్, శ్యాంకి ప్లేటులో ద్రాక్ష తీసుకొని పైకి వెళుతుండగా బాబు ఏడుపు వినిపించింది. పరుగున వెళ్లాను. క్రిబ్బులో ఉండవలసిన బాబు, శ్యాం గదిలో పందిరి మంచం మీద ఉన్నాడు.

కక్కటిల్లిపోతున్న బాబుని దగ్గరికి తీసుకొని పొదవి పట్టుకున్నాను. సముదాయించి పాలు పడుతూ, “బాబు ఎందుకు ఏడ్చాడు? అసలు ఎప్పుడు లేచాడు?” అని ద్రాక్ష తింటున్న శ్యాం ని అడిగాను.

“ముద్దులు పెడితే ఏడుస్తాడు. అంతా నీ పోలికే,” అంటూ పక్కకి తిరిగి, ఫోన్ డైల్ చేసి ఎవరితోనో మాట్లాడ్డం మొదలెట్టారు శ్యాం.

బాబు తల నిమురుతూ వాడి కుడి బుగ్గ మీద, కాలు పైన కూడా ఎర్రగా గాయాలు గమనించాను.
శ్యాం ముద్దు చేస్తూ గట్టిగా గిచ్చుండాలి. లేదా ముద్దెక్కువై గట్టిగా కొరికన్నా ఉండాలి. అందుకే వాడు ఉన్నట్టుండి అంతలా ఏడ్చాడు.

బాబుని నిద్ర లేవమని సతాయిస్తారే గాని మరీ ఇలా సొంత బిడ్డని, అందునా పసివాడిని గాయపరుస్తారని ఊహించలేదు. ఆయన సతాయింపు, మొరటుతనం నావరకు, నా కుక్కపిల్లల వరకే పరిమితమవుతుందని అనుకోవడం కూడా నా బుద్ధితక్కువతనమే. నాదే తప్పు.

నాలోని అసహనం పాములా బుస కొట్టింది.
కోపం, దు:ఖం ఆపుకోలేక శ్యాం తో గొడవకి దిగాను.
శ్యాం ని ఫోన్ పెట్టేయమని, నా మాటకి జవాబు చెప్పమని గొడవ చేసాను.

మా గొడవకి కిందనుంచి అత్తయ్య మామయ్య కూడా పైకి వచ్చారు. బాబుకి ముఖం మీద, కాలు మీద శ్యాం చేసిన గాయాలు చూపించి

వాళ్ళ మీద కూడా వొళ్ళు తెలియనంతగా విరుచుకు పడ్డాను. వారు కూడా అవాక్కయ్యారు.

మామయ్య కాస్త తేరుకుని, "హద్దు మీరిన ముద్దు కూడదు శ్యాం. పసివాడికి ఈ గాయాలేమిటి?" అంటూ శ్యాంని కోప్పడ్డారు. అత్తయ్య కూడా శ్యాంని గట్టిగానే మందలించారు. పసిపిల్లవాడితో ఎలా మెలగాలో తెలుసుకొని, ఇకనుంచి ఇలా అతిగా చేయవద్దని చెప్పారామె.

**

దు:ఖాన్ని, కోపాన్ని దిగమింగుకొని బాబుని అంటిపెట్టుకొని ఉంటున్నాను. ఈ అవస్థ నాకు అలివికాని సంగతిగా మారింది. బాబు విషయంలో, వాడి కన్నతండ్రి మీదే నాకు నమ్మకం లేకపోవడం నన్ను దహించి వేస్తుంది.

కొందరిలో మితిమీరిన మొరటుదనం ఉంటుందని తెలుసు. ఎక్కువగా మగపిల్లలు కొందరు చెట్లనున్న పూలని నలిపేయడం, దగ్గరకి వచ్చిన కుక్కపిల్లల్ని పొట్టలో తన్నడం లాంటివి చేస్తారని విన్నాను, చూసాను కూడా.

'శ్యాంలా నిద్రపోతున్న పసివాడిని లేపడం, ముద్దులంటూ బుగ్గలు కొరకడం కూడా ముద్దేనా? అనిపించింది. కలవరంగా ఉన్నా ఎలాగైనా మనస్సుని శాంతపరుచుకొని యధావిధిగా మసులుకోవడం అలవరుచుకోవాలి' అనుకున్నాను.

**


సందీప్ కి పది నెలలు నిండాయి. వాడి ముచ్చట్లు చెబుతూ, కొత్తగా వాడు అడుగులు వేస్తున్నాడన్నాను అమ్మతో.

వాడి నడకలు చూడాలనుందంటూ రెండు రోజుల తరువాత, అమ్మవాళ్ళు పొద్దుటే ఊరి నుంచి వచ్చారు.
రోజంతా కబుర్లు చెప్పుకుంటూ, సందీప్ తోనే గడుపుతున్నారు పెద్దవాళ్ళు...

"పోయినసారి బాబుని కింద దింపకుండా ముద్దులాడాము...ఈ సారి, వాడిని ఎత్తుకోకుండా అడుగులు వేయించి ముచ్చటపడుతున్నాము.." అంది నవ్వుతూ అమ్మ...

"వాడి అడుగుల కింద అరిసెలు వేద్దామా వదినా!" అంటూ అత్తయ్య.
"మీ ఆనవాయితీ అయితే, అలాగే వేద్దాం వదినా," అంటూ నవ్వేసింది అమ్మ.
**
సాయంత్రం ఆరు గంటల టైములో ఇంటిల్లిపాదీ శ్యాంతో సహా వెనక సిటౌట్ లో కూర్చున్నారు.

బొద్దుగా బంతిలా ఉన్న సందీప్ బుడి బుడి నడకలు చూస్తూ అందరు చప్పట్లు కొడుతున్నారు. క్యాండి, మిండి అల్లంత దూరంలో చిన్న గేటు అవతల పరుగులు పెడుతూ రాము, జీవ లతో బంతాట ఆడుతున్నాయి.



నేను లేచి వెళ్లి, అందరికీ ట్రేలల్లో ఫలహారం, కాఫీ సర్దాను. పనిమనిషి చేత పట్టించుకొని తిరిగి వచ్చేప్పటికి, అక్కడి దృశ్యం చూసి గుండెలదిరి పోయాయి. బాబుని తలక్రిందులుగా వేలాడదీసి పట్టుకొని, సిటౌట్ పొడుగునా వేగంగా నడుస్తూ వాడిని నవ్వించాలని ప్రయత్నిస్తున్నారు శ్యాం.

శ్యాం తప్ప అక్కడ ఎవరూ లేరు. అమ్మా వాళ్ళందరూ దూరాన మల్లెపందిళ్ళ దగ్గర ఉన్నారు. ఒక్క అంగలో శ్యాం వద్దకు చేరి, బాబుని గట్టిగా చుట్టేసి దగ్గరికి లాక్కున్నాను.

“ఎన్ని సార్లు చెప్పాలి మీకు, ఇల్లాంటి మొరటు ఆటలు బాబుతో ఆడవద్దని, ఇంకెలా అర్థమయ్యేలా చెప్పాలి మీకు?” అంటూ స్వరం పెంచి కన్నీళ్ళతో తల్లడిల్లితున్న నా దగ్గరికి అందరు పరిగెత్తుకొని వచ్చారు. బాబుని తీసుకొని వాడి గదిలోకి వెళ్ళిపోయాను.

**

మరునాటి వరకు బాబుని వదలకుండా గదిలోనే ఉండిపోయాను. మధ్యాహ్నం అయ్యాక, అమ్మ నన్ను భోజనానికి పిలవడానికి వచ్చింది.

నా భుజం మీద చేయి వేసి, “బాబుకి ఏమీ అవ్వలేదుగా, అంత గొడవ పడకు. కొందరు మగాళ్ళు బండగా ఆడతారు పిల్లలతో, నీ భర్త ఒక్కడే కాదు. నువ్వు కాస్త భద్రంగా చూసుకుంటూ ఉండు. అంతేగాని, మరీ

అంత గగ్గోలు పెట్టి బెంబేలెత్తిపోతే ఎలా?" అంటూ నన్ను శాంత పరచాలని చూసింది.

"బొద్దుగా ఉన్న పది నెలల వాడు బాబు. వాడిని ఆ రకంగా ఆడిస్తే? చేయి కాస్త జారితే? బాబు తల మీద పడితే? ఏమవుతుంది? అని ఆలోచిస్తే తెలుస్తుంది నా బాధ," అంటూ మాట మార్చేసాను.

**

వారం రోజులు గడిపి అమ్మావాళ్ళు వెళ్లి పోయారు.

ఆ రోజు మధ్యాహ్నం శ్యాం నేనున్న గదిలోకి వచ్చి బెడ్ కి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నారు.

"సారీ నీలూ, ఆ రోజు బాబుని సరదాగా ఆడించడానికే అలా తల క్రిందులుగా పట్టుకున్నాను తప్ప వాడు పడతాడేమో అని ఆలోచన రాలేదు.

అయినా వాడిని కూడా నీలా సుకుమారంగా పెంచితే ఎలా?

వాడు అన్నీ నేర్చుకోవాలి, అన్నీ చెయ్యాలి, నన్నసలు వాడితో ఆడనివ్వవా? ఇలా అయితే కష్టమే.

ఇంకాస్త పెద్దవాడయ్యాక నా విద్యలన్నీ నేర్పిస్తాలే," అంటూ లేచి దగ్గరగా వచ్చి నా చేయి అందుకున్నారు. "క్యాండి, మిండి, సందీప్ అందర్నీ తీసుకొని, అలా తిరిగొద్దాము పద," అంటూ నన్ను బయలుదేరదీసారు.

**

.....సందీప్ పెంపకం, కేవలం అత్తయ్య సహకారం వల్లే సజావుగా సాగుతుంది..

రెండేళ్ళ సమయం  తెలీకుండా ఇట్టే గడిచిపోయింది.

బాబుని అత్తయ్య ఆడిస్తారు. మాటలు పాటలు కూడా నేర్పుతారు.

అర్ధమయినా కాకపోయినా వాడు కూడా నానమ్మ వంక కన్నార్పకుండా చూస్తూ, నవ్వుతూ అన్నీ వింటాడు.

మామయ్య కూడా.  బాబుని వొళ్ళో పెట్టుకొని న్యూస్ పేపర్ చదువుతారు. వాడితో స్పోర్ట్స్ టి.వి చూస్తారు, ఇంటి కాంపౌండ్ లో వాకింగ్ చేస్తారు.

మూడేళ్ళ సందీప్ ముద్దుమురిపాల్లో సమయం తెలియడం లేదు. అమ్మావాళ్ళు ప్రతి యేడు, సందీప్ పుట్టినరోజు కలిసొచ్చేలా కనీసం రెండు వారాలైన వచ్చెళుతున్నారు.

చిత్ర  పెళ్ళికి, సందీప్ ని తీసుకొని హైదరాబాద్ వెళ్లాను.  అమ్మావాళ్ళు, రమణివాళ్ళతో  కలిసి ఓ రోజంతా  పెళ్ళి జరిగిన రిసార్ట్ లో ఉన్నాము. తరువాత, అమ్మ దగ్గర మరో రోజుండి, మూడోరోజు  ఢిల్లీకి తిరిగొచ్చేసాను.

**

*నవంబర్ 14- పిల్లల దినోత్సవం....*

'రీగల్ స్పోర్ట్స్ క్లబ్' వారు నవంబర్ 14 న 'చాచా నెహ్రు చిల్రెన్స్ డే' సంబరాలు చేస్తున్నారు. శ్యాం దానికి ఆర్గనైజర్. *రిక్రియేషనల్ స్పోర్ట్స్ రిసార్ట్* లో పిల్లలకి - టెన్నిస్, క్రికెట్, స్విమ్మింగ్ కాక రోజంతా పిక్నిక్ ఎరేంజ్ చేసారు.

పది గంటలకి అంతా పార్క్ లో చేరాము. *హిల్ ఏరియా* దగ్గరలో ఉన్న ఆ పార్క్ లో పిల్లలకి *మినీ మౌంటైన్ క్లైంబింగ్*, *పోనీ రైడ్స్* కూడా ఉన్నాయి.
పిల్లలంతా ఎంజాయ్ చేస్తున్నారు.
అత్తయ్యవాళ్ళు కాసేపు వాళ్ళ గేమ్స్ చూసి, లంచ్ వరకు ఉండి వెళ్ళిపోయారు.

ఆడవాళ్ళంతా చెట్ల కింద కబుర్లు చెప్పుకుంటున్నారు. వచ్చిన తండ్రులందరూ పిల్లలతో *మౌంటైన్ క్లైంబింగ్* అంటూ కాస్త దూరంగా ఉన్న హిల్స్ వైపుగా వెళుతున్నారు.
అలా వెళుతున్న శ్యాంతో పాటు కొంత దూరం మాత్రం నడిచి రెస్ట్ ఏరియా లో కూర్చున్నాను.
ఓ చేత సందీప్ ని, మరో చేత ఫ్రెండ్ కొడుకు ఆరేళ్ళ విజయ్ ని నడిపించుకు వెళుతున్నారు, శ్యాం.
సందీప్, క్షేమంగా, గాయ పడకుండా తిరిగి రావాలని కోరుతూ, గుండెలు అరచేతిలో పెట్టుకుని కూర్చున్నాను.
**

ఓ అరగంటకి, బాబుని భుజాల మీద ఎక్కించుకొని, విజయ్ చేయి పుచ్చుకొని తిరిగి వచ్చారు శ్యాం.

"వీడు తమరి లాగానే సుకుమారం, నడవలేక ఒకటే ఏడుపు. నా భుజాల మీదే స్వారి," అంటూ, సంతోషంతో కేరింతలు కొడుతున్న సందీప్ ని నాకు అందించారు.

బాబు క్షేమంగా ఉన్నందుకు ఊపిరి తీసుకున్నాను.

'ఏ దెబ్బా తగలకుండా నవ్వుకుంటూ, శ్యాంతో ఒంటరిగా బాబు' - కలా? నిజమా? అనుకున్నాను.

నిజమే అయితే, ఇంక నాకు బెంగే లేదు.

బాబుకి శ్యాం నుండి హాని కలగవచ్చన్న నా ఊహ, భయం అపోహనేమో! అన్న ఆలోచన నాకు ఎంతో ధైర్యానిచ్చింది.

**

డ్రైవింగ్ నేర్చుకున్నాక, యానిమల్ షెల్టర్ కి వెళ్ళడం, అత్తయ్యవాళ్ళని ఆదివారాలు గుళ్ళకి, యోగా సెంటర్కి తిప్పడం చేస్తున్నాను.

సందీప్ ని ఐదోయేట ఇంటికి దగ్గరిలోనే కాన్వెంట్ లో వేసాము. వాడిని స్కూల్లో డ్రాప్ చేసి, మార్కెట్ పని కూడా చేసుకొని వస్తుంటాను..

నాకంటూ కారు చేతిలోకి వచ్చాక పర్సనల్ పనులు చేసుకోవడం హాయిగా ఉంది.

“సందీప్ క్రికెట్ ఆటలో రాణిస్తాడేమో! ఇప్పుడే కరెక్ట్ వయస్సు మొదలెట్టడానికి,” అన్నారు శ్యాం ఓ రోజు పొద్దున్నే కాఫీ తాగుతూ.
“వాడికి నాకంటే బెటర్ కోచ్ ఎవరూ ఉండరు. రేపు ఆదివారం నుండే క్లబ్బులో కోచింగ్ మొదలు పెడతాను,” అన్నారు ఎంతో ఉత్సాహంగా.

సందీప్ కి క్రికెట్ నేర్పాలని ఆత్రుతగా ఉన్నారు శ్యాం. నేనే ఒప్పుకోడంలేదు.
ఐదేళ్ళ పసివాడికి అటువంటి ఆటలు వద్దని చెప్పేసాను. మరో రెండేళ్లు గడవనీమన్నాను.

“ఐదేళ్ళ వాడు నా బాట్ తో కాదుగా ఆడేది! కిడ్స్ బాట్ కూడా ఉంటుంది. అన్నిటికి భయపడితే ఎలా?” అన్నారు నిస్పృహనంగా.

అక్కడే ఉన్న అత్తయ్య కలగజేసుకున్నారు.
“అయినా శ్యాంబాబు, నువ్వు నెలలో వారం రోజులు అగ్రా *బ్రాంచ్* ఆఫీసుకి వెళ్తావు. ఇక్కడ ఉన్నా బిజీగా ఉంటావు...నీకు టైం ఎక్కడుంది? బాబుకి నీ ఇష్టప్రకారమే ఏ ఆట కావాలంటే అందులో పెడదాము. మన ఇంటి వద్ద క్లబ్బులో కూడా అన్నీ నేర్పుతారు,” అన్నారామె నవ్వుతూ కొడుకుతో...

అత్తయ్య నాకు వత్తాసు పలకడంతో, కాస్త ఊపిరి తీసుకున్నాను.
**

సందీప్ కి మరో రెండు రోజుల్లో ఐదేళ్ళు నిండుతాయి.

స్కూల్లో అన్ని యాక్టివిటీస్ లో *ఎక్సలెంట్* గా ఉన్నాడు వాడు.

సందీప్ పుట్టినరోజు, ఈ సారి గ్రాండ్ గా సెలబ్రేట్ చేయాలని అందరిని పిలుచుకొన్నాము.

అమ్మావాళ్ళు ఓ రోజు ముందే వస్తున్నారు.

**

సందీప్ పార్టీ రోజున వాతావరణం ఆహ్లాదంగా ఉంది. అమ్మావాళ్ళతో సహా అందరం తెల్లారుఝామునే లేచాము.

శ్యాం, మామయ్య ఉదయం నుంచే ఏర్పాట్లతో హడావిడిగా ఉన్నారు.

పొద్దున్నే గార్డెన్ లో *టెంట్* వేయించారు.

పదింటికల్లా, అక్కడే పిల్లలకి ముందుగా *మ్యాజిక్* షో మొదలయ్యింది.

ఓ గంట సేపు చెప్పలేనంత ఎంజాయ్ చేసారు చిన్నవాళ్ళంతా.

మ్యాజిక్ షో అయ్యాక ఆటల పోటీలు పెట్టి వాళ్ళని ఆడిస్తున్నారు శ్యాం, వినోద్.

ఇంట్లో *లంచ్* సన్నాహాల్లో మేమున్నాము.

ఉన్నట్టుండి బయట టెంట్ నుండి సందీప్ ఏడుపు వినిపించింది. వెళ్ళి చూస్తే, సందీప్ ని సముదాయిస్తూ, వాడిని ఎత్తుకోవాలని ప్రయత్నిస్తున్నాడు వినోద్.

బాబు మాత్రం కుడి చెయ్యి మోచేతి దగ్గర గట్టిగా పట్టుకొని, బాధతో కింద పడి గగ్గోలుపెట్టి ఏడుస్తున్నాడు.

నా గుండె ఆగినంత పనయ్యింది. ఒక్క పరుగున వాడి వద్దకు చేరుకున్నాను. కుడి చేయి మణికట్టు దగ్గర వంగిపోయినట్టుగా వేలాడుతుంది. సందీప్ నొప్పికి తట్టుకోలేక పోతున్నాడు.

వాడిని చేతుల్లోకి తీసుకొని కార్లో వేసుకొని డాక్టర్ దగ్గరికి బయలుదేరాను. వినోద్ నాతో పాటే కారెక్కాడు. శ్యాం, మామయ్యతో ఆత్రుతగా ఇంటి మెట్లు దిగుతూ కనిపించారు.

హాస్పిటల్లో ఎక్సరేలవీ అయ్యాక, డాక్టర్లు సందీప్ కి కుడి చేయి '*రిస్ట్ ఫ్రాక్చర్* ' అయిందని తేల్చారు. కొంత కాలం స్కూల్లో *రైట్ హాండ్* తో వర్క్ కూడా కష్టమే నన్నారు..

"ఇలా ఎలా అయింది? చెట్టు మీద నుండి పడ్డాడా?" అని అడిగారు.

అప్పుడే నాకూ తోచింది, "అవును ఎలా ఈ ప్రమాదం జరిగింది?" అని పక్కనే ఉన్న వినోద్ ని అడిగాను.

"బావ, సందీప్ తో '*ఆర్మ్ రెస్లింగ్*' చేసేప్పుడు, ఇలా జరిగింది. బాబు చేతిని తెలీకుండానే గట్టిగా వంచారేమో బావ. నొప్పితో పాపం వీడు గిల గిలా కొట్టుకుని బాగా ఏడ్చాడు కూడా. ఇలా అవుతుందని మేము

అనుకోలేదక్కా," అన్న వినోద్ మాటలకు, నా కాళ్ళ కింద భూమి జారినట్టయ్యింది. నా మనసు రగిలిపోయింది.

'నేననుకొన్న మార్పు ఆ తండ్రిలో రాకపోగా, బిడ్డ గిలగిలా కొట్టుకునేటంత బాధపెట్టి మరీ మణికట్టు ఎముక విరిచాడన్నమాట, ఆ మొరటు మనిషి' అనుకొంటూ కుర్చీలో కూలబడ్డాను.
నాలో ఆవేశం కట్టలు తెంచుకుంది.

'ఎలా? ఎలా? నా బిడ్డని కాపాడుకోవాలి? నా బిడ్డని తీసుకొని ఆ మొరటు మనిషి నుండి దూరంగా వెళ్లిపోవాలి. అంతే పారిపోవాలి' అనుకున్నాను నిశ్చయంగా.
**
సందీప్ మణికట్టు ఫ్రాక్చర్ కి క్యాస్ట్ వేయించి ఇంటికి తీసుకొని వచ్చాను. నా కన్నీరు, దు:ఖం ఆపుకోలేక, అత్తమ్మ మామయ్యా వాళ్ల గది తలుపు గట్టిగా తట్టి విసురుగా లోనికి వెళ్ళాను.

"మీ అబ్బాయి మొరటుతనం నా బిడ్డని అవిటి వాడిని చేసింది. ఇవాళ మణికట్టు, రేపు మరోటి. నేను భరించలేను అత్తయ్యా. నేను మా అమ్మావాళ్లతో వెళుతున్నాను, నన్ను క్షమించండి," అంటూ వెను తిరిగాను.

"చూడు తల్లీ, నీ కోపం నాకు అర్థమవుతుంది. కాని ఇది ఓ ఆక్సిడెంట్ తల్లీ, పిల్లలందరూ శ్యాంతో అదే ఆట అడుతున్నారట. మీ మామయ్య 'వద్దురా' అంటున్నా బాబే మొండికేసి వాళ్ళ డాడీతో ఆ ఆట ఆడి, ఇలా చేయి విరకొట్టుకున్నాడు," , "జరిగింది పొరపాటే తప్ప శ్యాం కావాలని చేసింది కాదమ్మా, మన గ్రహపాటు బాగోక ఇలాటివన్నీ మనకి జరుగుతున్నాయి," అంటూ అత్తయ్య వాపోయారు.

ఆవిడ చెప్పింది విని, ఆ గది నుండి బయట పడి, అమ్మావాళ్ళని హైదరాబాద్ కి బయలుదేర దీశాను.

నిముషాల్లో బట్టలు సర్దుకుని, సందీప్ ని తీసుకొని గది తలుపు దాటుతుండగా శ్యాం వచ్చారు. నా చేయి గట్టిగా లాగి మంచం మీద కూలేశారు.

బలవంతంగా నా ముఖం పైకెత్తి, "ఏమిటి నువ్వు చేస్తున్న పని? ఇలా పెద్దవాళ్ళ ముందు నన్నో నేరస్తుడిలా నిలబెట్టి, మీ అమ్మవాళ్ళతో వెళతావా? నీ ఉద్దేశం నాకేమీ నచ్చలేదు. పిల్లలన్న తరువాత దెబ్బలు తగలవా? అయినా నువ్వు వెళ్ళిపోతే, నీ కుక్కల్ని ఎవరు చూసుకుంటారు?
అసలు నీకు, సందీప్ కి ఆ ఊళ్ళో ఇక్కడి లాగా *కంఫర్ట్* ఉందా? కనీసం కారు కూడా లేదుగా? *డోంట్ బి క్రేజీ,*" అని ఒక్క బిగువున చెప్పాలనుకున్నదంతా చెప్పి, నా చేయి మీద పట్టు వదిలారు శ్యాం.

ఆయన మీద నాకు కోపం రెట్టింపయింది. నా మీద గాని, బాబు మీద గాని కనీసపు శ్రద్ధ కనబడలేదు ఆయన మాటల్లో.

పై పెచ్చు ఆ మాటల్లో నా కుక్కల బద్రతపై ఓ బెదిరింపు, మరో వెక్కిరింపు తోచాయి. కాక ఇది మూడో సారి తన నిర్లక్ష్యం వల్ల బాబుకి గాయాలు, భయాలు. ఈ సారైతే ఏకంగా *రిస్ట్ ఫ్రాక్చర్*.....

కన్నీళ్ళనాపుకుంటూ మా వాళ్ళతో ఢిల్లీ వదిలి ఊరు ప్రయాణమయ్యాను.

**

## 3

హైదరాబాదులో అమ్మింట చేరాను. మనసంతా గజిబిజిగా ఉంది. ....

గదిలో పైకప్పు వంక చూస్తూ పడుకొని ఉన్నాను. సందీప్ నా పక్కనే నిద్రపోతున్నాడు.

పెళ్ళై వెళ్ళిన ఈ ఆరున్నరేళ్ళల్లో, నేను ఏనాడు పుట్టింట ఇన్నిరోజులు గడపలేదు.

ఈ రాకకి దారి తీసిన సంఘటనలు మాత్రం సబబైనవి కావు. సందీప్ మణికట్టు విరిగిన నాటి జ్ఞాపకాలు నా మనసును అవిరామంగా కలిచివేస్తున్నాయి.

అత్తయ్యవాళ్ళని వదిలిపెట్టి వచ్చి, పది రోజులౌతుంది. సందీప్ చదువు అర్ధంతరంగా ఆగిపోయింది. ఆదుర్దాతో వాడిని ఓ మారు ఇక్కడ డాక్టర్

వద్దకి తీసుకెళ్ళాను. అత్తవారింట నా మీద ఆధారపడ్డ ఆ పెద్దవాళ్ళు, పనివాళ్ళు ఎలా ఉన్నారో? అన్న ఆలోచన మొదలయింది.

క్యాండి, మిండి గురించి కూడా మనసులో గుబులుగా ఉంది.

ఇన్ని రోజులయ్యాక, ఇవాళ పొద్దున్నే అత్తయ్య సెల్ కి ఫోన్ చేసాను. జవాబు లేదు. పోద్దున్నే పూజలో ఉండి ఉంటారనుకున్నాను.

మామయ్య రోజంతా బాబుతో గడిపేవారన్న సంగతి పదే పదే గుర్తుకొస్తుంది. అత్తయ్యతో, సందీప్ తోటంతా తిరిగి మొక్కలికి నీరు కూడా పెట్టేవాడు. కుక్క లతో బాల్ ఆడేవాడు.
"ప్చ్" ఏమిటో నా వింత సమస్య, అని లేచి కాఫీ కలుపుకొందామని వంటింట్లోకి వెళ్లాను.
**
కాఫీ కప్పుతో కిచెన్ నుండి బయటకి వస్తుంటే, చిత్ర, రమణి ఇంట్లోకి వస్తూ ఎదురయ్యారు. వారి రాక, మనసుకి కాస్త ఊరటనిచ్చింది.

హాల్లో అమ్మ పక్కనే కూర్చున్న సందీప్ ని చూసి, "ముద్దుగా ఉన్నాడు బాబు," అంటూ వాడి చెంపలు నిమిరింది రమణి. వాడి రిస్ట్ న ఉన్న *బేండేజ్* గమనించి, "అరే, పాపం! చేతికి ఏమయింది ఇంత చిన్నవాడికి?" అడిగింది.

"ఏదో, పుట్టిన రోజు నాటి ఆటల్లో మణికట్టు విరిగింది బాబుకి," అని త్వరగా మాట మార్చేసింది, అమ్మ.

"నువ్విక్కడే ఉన్నావని వినోద్ ద్వారా తెలిసింది. వెంటనే వచ్చాము. మా నుండి దాక్కోవడం ఏమిటి నీలూ?" అడిగింది నా వంక చూస్తూ చిత్ర.

"... వీడికి ఇలా దెబ్బ తగలిందన్న చిరాకుతో తోచక ఉండిపోయాను. ఇక ఇవాళో, రేపో పిలిచేదాన్ని," అన్నాను.

"మగపిల్లలకి ఇవన్నీ కామన్. కాకపోతే, మరీ ఇంత చిన్నవాడికి రిస్ట్ ఫ్రాక్చర్ అన్ కామన్," అంది యధాలాపంగా చిత్ర.
తమ ట్రైనింగ్ పూర్తయ్యాక, తనూ ఆనంద్ కలిసి ఎక్కడన్నా పెద్ద కార్పరేట్ హాస్పిటల్ కి పని చేయాలనుకుంటున్నారట.

పోతే, రమణిలో ఇప్పుడు పిల్లలు కావాలన్న ఆరాటం కనబడుతుంది. కాని, ఇప్పటివరకు అయితే ఏమీ విశేషం లేదట.

ముగ్గురం మాట్లాడుకుంటూ, భోంచేస్తున్నాము..
"ఇలా చెప్పాపెట్టకుండా దిగావు. ఏమిటి సంగతి. ఊరి మీద బెంగా? భర్త మీద అలకా?", "లేక విరహం ఎలా ఉంటుందో, భర్తకి తెలియాలని ఇలా వచ్చావా?" అడిగింది రమణి.

"అమ్మలా చూసుకునే అత్తగారు కదా! అందుకే పుట్టిల్లు గుర్తు రాదులే...అదటుంచితే, సందీప్ ని వదిలి వుండగలరా ఆ పెద్దవాళ్ళు?" మళ్ళీ చిత్ర.

వారి ప్రశ్నలన్నిటికీ నవ్వి ఊర్కున్నాను.

"సరే, క్యాండి, మిండి ఎలా ఉన్నాయి?" రమణి మరో ప్రశ్న..

"నేను లేనుగా! ఎలా ఉన్నాయో అని దిగులుగా ఉంది." అన్నాను జవాబుగా.

మా కబుర్లు, టీ లు అయ్యేప్పటికి సాయంత్రమయ్యింది.

"మళ్ళీ వస్తాము," అంటూ కదిలారు చిత్ర, రమణి.
సందీప్ గేటు వరకు వెళ్ళి వాళ్లకి ఫ్లయింగ్ కిస్ ఇచ్చి మరీ లోనికి వచ్చాడు.

మా వల్ల అత్తయ్యావాళ్ళకి కలిగే సుఖసంతోషాలకి, వారిని దూరం చేయకూడదని నిశ్చయించుకొన్నాను.
**
రాత్రయ్యాక, బాబుకి కథ చెబుతూ నిద్రపుచ్చాలని ప్రయత్నిస్తుంటే, అమ్మ నా గదిలోకి వచ్చింది. సందీప్ పడుకున్న వైపు మంచం మీద కూర్చుంది.
కళ్ళెత్తి చూసి, "ఏమిటమ్మా," అన్నాను.

"నీ అవస్థ చూస్తుంటే మనసు బాగోలేదమ్మా, నాన్న కూడా బాధ పడుతున్నారు. కలలోలా అంత గొప్ప సంబంధం రావడం, అంత వైభవంగా నీ పెళ్ళి జరగడంతో, నీ అదృష్టానికి పొంగిపోయాము.
అల్లుడిగారి హోదా, అందచందాలు, పరపతి చూసి మురిసిపోయాము. నువ్వే పెద్దింటి కోడలయ్యావని సంతోషించినంత సేపు పట్టలేదు.

ఇప్పుడు నీ విషయం బాగా దిగులైపోయిందమ్మా," అని కన్నీళ్ళ పర్యంతమైంది. "అసలు శ్యాంని గురించి అలాగని నమ్మలేకుండా ఉన్నాము," అంది అమ్మ.

చీకాకుతో గజిబిజిగా ఉన్న నా మనస్సుకి, అమ్మనాన్న ఇంతలా దిగులుపడుతున్నారని అనిపించి రగులుతున్న మంటలో ఆజ్యం పోసినట్టయింది.

అంతలో నాన్న కూడా గది గుమ్మం దగ్గరికి వచ్చారు.

"ఏమ్మా ఇంకా పడుకోలేదా?" అంటూ లోనికొచ్చారు.

మంచం మీద నుండి లేచి, "రండి," అన్నాను.

వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు.

"చూడమ్మా, మీ మామయ్య గారి దూరపు బంధువు, దుర్గాప్రసాద్ అని పెద్దాయనే. నీ పెళ్ళికి కూడా వచ్చాడు. మళ్ళీ మొన్న ఢిల్లీలో బాబు పుట్టినరోజునాడు కలిసాడు. పిల్లల ఆటలు చూస్తూ చాలాసేపు మాట్లాడుకున్నాము," చెప్పడం ఆపి మా వంక చూసారు నాన్న........
మేము ఆసక్తిగా వింటున్నాము.

"అల్లుడు, శ్యాంప్రసాద్ చిన్నప్పటి నుండీ కూడా గొప్ప క్రీడాకారుడట.. అలా స్పోర్ట్స్ లో ఎదుటివాడిని ఓడించి, తను గెలవడమే ధ్యేయంగా

జీవించేవారంట శ్యాం, వాళ్ళ నాన్న కూడా. అతను ఎందులోనూ ఓటమి ఎరుగడట. అతని చదువు కూడా స్పోర్ట్స్ స్కాలర్షిప్స్ తోనే అయిందట,'' క్షణమాగారు..

మౌనంగా వింటున్నాను.

''అయితే, ఏమంటారు మీరు,'' అడిగింది అమ్మ.

''చెప్పేదేమంటే, ఐదో యేడు నుండి ఆటలు, గెలుపులుగా నడిచిందట శ్యాం బాల్యం. ఆ అబ్బాయి మానసికంగా, శారీరికంగా ధృడంగా ఉండాలని ఎంతో క్రమశిక్షణగా ఉంచేవారంట కూడా,'' ఓ క్షణం ఆగి కళ్ళజోడు తీసి తుడిచి మళ్ళీ పెట్టుకున్నారు.

''అన్నీ మంచి సంగతులే చెప్పాడాయన. అయితే, మరి అల్లుడుగారు పదే పదే ఇలా నిన్ను, పిల్లాడిని బాధ పెడుతున్నాడని నీవు కుమిలిపోవడం కూడా దుర్భరమే. నువ్వు కూడా అన్నీ ఆలోచించు. ఇదేమన్నా సమిసిపోయే విషయం అయితే, నీవే తెలుసుకుంటావు. అలివి కానిదిగా ఉంటే మీ శ్రేయస్సు కోసం అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి.

కాని అది అంతా నీవు మాత్రమే నిర్ధారణ చేసుకోగలవు.

నీవూ తెలివైనదానివే. స్కాలర్షిప్పు తోనే కాలేజీకి వెళ్ళిన దానివి. ఇప్పుడైనా మాస్టర్స్ చేసి లెక్చరర్ అయ్యేలా ప్రయత్నాలు

మొదలుపెట్టడం మంచిది. అవసరం వస్తే, స్వతంత్రంగా బతకవచ్చు,"
ఆగి నా వంక చూసారు, ఓ క్షణం....

"నీకు మా సహాయం, తోడు మేము బతికున్నన్నాళ్ళు ఉంటుంది తల్లీ, మర్చిపోకు. నీ మీద పూర్తి నమ్మకముంది. కత్తి మీద సాము లాంటి ఈ పరిస్థితిని జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి.
తొందరపడనూ వద్దు. అలాగని జాప్యం చేయావద్దు...నీవెటు అడుగు వేయవలసొచ్చినా మేమూ నీ వెంటే," అన్నారు గంభీరంగా.
ఆయన మాటల్లో నాకు ఎంతో స్వాంతన, ధైర్యం తోచాయి.
**
'నా ఈ స్థితిని, శ్యాంతో ఉన్న పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. చేయి దాటుతుందనుకుంటే, నాన్నగారు అన్నట్టు మార్గాలుంటాయి. నా జీవితం పై నేనే ఎలాగైనా ఓ పట్టు సాధించాలి.
ఇకనుండి అటు పెద్దవాళ్ళని గాని, ఇటు పెద్దవాళ్ళని గాని నా విషయంగా కలవరపెట్టకూడదు' అనుకుంటూ నిద్ర లోకి జారుకున్నాను.
**
పొద్దున్నే ఆరుగంటల సమయంలో నాకు అత్తయ్య ఫోన్ చేసారు.
"అత్తయ్యా బాగున్నారా?" అడిగాను.

"అంతా బాగున్నాము, నువ్వు బాబు ఎలా ఉన్నారు?" అడిగారు.

"బాగున్నామత్తయ్యా," అన్నాను.

"చూడమ్మా నీలా, నీకు తెలుసుగా నాకు మోకాలు సర్జరీ అవసరమని. రెండు రోజుల క్రితం బాత్రూములో కాలు జారి బాగా ఇబ్బంది పడుతున్నాను. ఇక తప్పదు. ఎల్లుండి సర్జరీ చేయించుకుంటాను.
నీవు లేకుండా ఇక్కడ మాకు బాగా వెలితిగా కూడా ఉంది. అదీకాక, క్యాండి, మిండిలకి కూడా నీ అవసరం ఉంది. నీవు వస్తే బాగుంటుంది," అన్నారు అత్తయ్య.

"అత్తయ్యా, ఈ రాత్రికే బయలుదేరడానికి ప్రయత్నిస్తాను." అన్నాను.
శ్యాం మానేజర్ గుప్త గారికి ఫోన్ చేసి రాత్రి పదిన్నర ఫ్లైట్ కి నేను, బాబు తిరిగి ఢిల్లీ వెళ్ళేలా ఏర్పాటు చేయించాను.
**
నేను ఢిల్లీ చేరిన మరునాడే అత్తయ్య మోకాలు సర్జరీ చేయించాము.

నేను వెళ్ళేప్పటికి, మా రెండో డాగ్ 'మిండి' కి మాత్రం, 'హెర్నియా' వల్ల ఉదరభాగం *డిస్టెన్షన్* ఏర్పడి, సర్జరీ అయి నాలుగు రోజులుగా ఇంట్లోనే కోలుకుంటుంది.

తానెంత వారించినా, *వర్క్-ఔట్* చేయిస్తున్నానంటూ, శ్యాం డాగ్స్ ని అతిగా ప్రాయాస పెట్టడం వల్ల వచ్చిన అనర్థమేనని నా వద్ద వాపోయారు, అత్తయ్య.

శ్యాం వైఖరికి – విస్తుపోయాను. మూగజీవుల పట్ల నిర్లక్ష్యం అనుకున్నాను.. కాని, ఇప్పుడది 'క్రూరత్వం' అనిపిస్తుంది.

ఏదో ఒకటి చేసి నన్ను బాధపెట్టడమే శ్యాం ధ్యేయమా? అదే అయితే, కనుచూపు మేరలో నాకు విముక్తి ఉండబోదని అర్ధమయ్యింది.

శ్యాంతో అసలు మాట్లాడాలని లేదు. అవసరం ఉన్నప్పుడు, అవసరమైన మాటలు మాట్లాడ్డం మినహా నాకు గత్యంతరం లేకనే, ఈ ఇంట కాపురం సాగిస్తున్నాను. నా బాబు, అత్తగారు, మామయ్యగారు, నా పెంపుడు కుక్కలు, వీరందరి సంతోషమే నాకు ముఖ్యం.

**

*రిస్ట్ ఫ్రాక్చార్* ముందే, సందీప్ కి బర్తడే గిఫ్ట్ గా - *లేటెస్ట్* వర్షన్ 'సోని ప్లే స్టేషన్' అమర్చాము.

ప్లే-స్టేషన్ తో మళ్ళీ వాడు ఆడాలంటే విరిగిన చేయి బాగవ్వాలి. నిద్రలో వాడు అటు ఇటు తిరిగినా, చేతికేమన్నా అవుతుందేమోనని జాగ్రత్తగా చూసుకోవలసి రావడంతో రాత్రింబవళ్ళు వాడి వెన్నంటే ఉంటున్నాను.

**

శనివారం పొద్దున్నే ఏడయ్యింది. టి.వి లో వెంకటేశ్వర స్వామి సుప్రభాతం వస్తుంది. ఇంటి ముందు సిటౌట్ లో నీరెండకి పేపర్ చదువుతున్న మమయ్యగారికి కాఫీ ఇచ్చి వెనుతిరుగాను.

“నీలా, ఐదు నిముషాలు ఇలా కూర్చోమ్మా,” అంటూ ఆపారు మామయ్య.

అప్పుడే నిదుర లేచిన సందీప్ ని వెంట బెట్టుకొని, అక్కడికి అత్తయ్య కూడా వచ్చారు.
మోకాలు సర్జరీ అయ్యాక, అత్తయ్య పూర్తిగా కోలుకుని, చకచకా నడుస్తున్నారు కూడా.
ఇద్దరం మామయ్య ఎదురుగా కూర్చున్నాము. సందీప్ తాతగారి పక్కనే చేరాడు.

“మన ఇంటి వెనుక ఆవరణ లో, డాగ్-హౌజ్ దాటగానే మీ తులసికోట, మల్లె-జాజి పందిళ్ళు ఉన్నాయి కదా! ఆ పైన ఇంకా ఐదొందల గజాల స్థలం ఉంది. అందులో, టెన్నిస్ కోర్ట్, స్విమ్మింగ్ పూల్, బాస్కెట్బాల్ కి కూడా వేయించేద్దామని మీ అత్తయ్య కూడా అంటుంది.
అప్పట్లోనే చేయించవలసింది. ఎంతో కాలంగా ప్లాన్స్ వేయించి రెడీ పెట్టాను కాని, ఇప్పటికి దానికి టైం వచ్చింది,” అన్నారాయన, కాఫీ సిప్ చేస్తూ.

“సరిగ్గా శ్యాం పుట్టినరోజు నాటికి, తయారయ్యేలా వెంటనే పని మొదలు పెట్టించండి.. అవి తయారయ్యాక మన సందీప్ బాబు స్విమ్మింగ్, టెన్నిస్ అన్నీ ఇంటి దగ్గరే నేర్చుకోవచ్చు,” అని అత్తయ్య అంటుండగా శ్యాం వచ్చారు.

“ఏంటి ఈ సమావేశం? నన్ను పిలవలేదే?” అంటూ సందీప్ ని ముద్దు పెట్టుకొని, ఆఫీస్ కి బయలుదేరి పోయారు.

“సందీప్ ని కూడా స్పోర్ట్స్ హీరో చెయ్యాలనా మీ కోరిక? ఈ వయస్సులో మీకు అంత ఓపికుందా ఇప్పుడు?” అన్నారు అత్తయ్య, మామయ్యతో. నేను ఆలోచిస్తూ ఖాళీ కాఫీ కప్పందుకుని అక్కడి నుండి కదిలాను....

**

మామయ్యగారు చేపట్టిన నిర్మాణం, కాలయాపన లేకుండా జరుగుతుంది. ఆధునీకరణతో పాటు, ఎక్కడికక్కడ సేఫ్టీ గేట్లు పెట్టిస్తూ, అన్ని జాగ్రత్తలతో దగ్గరుండి పనులు చేయిస్తున్నారు మామయ్య. పనిలో పనిగా *గ్రౌండ్ ఫ్లోర్* లో నేను ఉపయోగించే రూం ని *ఎక్స్టెండ్* చేసి, విశాలంగా, అధునాతనంగా ఉండేలా *రీమాడల్* చేయిస్తున్నారు.

ఇప్పుడది ‘కిడ్స్’ రూం అన్నారు అత్తయ్య.

దానికి వెనుకగా సర్వెంట్ క్వార్టర్స్ కి, ఇంకో వైపుగా మరో ‘గెస్ట్’ రూం కి పునాదులు వేసి ఆ పని కూడా మొదలు పెట్టించారు.

**

ప్లాన్ ప్రకారం, ఆరు నెలలకి మమయ్యగారి స్పోర్ట్స్ *అరేనా* అందంగా పూర్తయింది..

శ్యాం ముప్పైఆరవ పుట్టినరోజు - పూల్ పార్టీగా ఎరేంజ్ చేశాము. పార్టీకి వచ్చిన చిన్నా, పెద్దా అందరు బాగా ఎంజాయ్ చేశారు.

తన  పుట్టినరోజుకి, అంత మంచి పార్టీ ఎరేంజ్ చేసినందుకు, అందరి ఎదురుగా శ్యాం నాకు, అత్తయ్యకి, మామయ్యకి ధన్యవాదాలు చెప్పారు.
**
ప్రతి రెండో ఆదివారం ఫ్రెండ్స్ ని పిలుచుకొని టెన్నిస్ ఆడుతారు శ్యాం. సందీప్ గేటు ఇవతల కూర్చుని చూస్తుంటాడు.
టెన్నిస్ కోర్ట్స్ లో ఎవరన్నా ఆడుతుంటే, క్యాండి మిండీల క్యూడా సందడే.

మళ్ళీ వారానికి, శ్యాం ఆర్డర్ చేసిన ‘టెన్నిస్ బాల్ షూటర్’ వచ్చింది. *పార్ట్నర్* లేకపోయినా ఆడుకునే వీలు కోసం  శ్యాం తెప్పించుకున్నారు. రెండొందల షాట్స్, నిర్దేశించిన వేగంతో షూట్ చేసే ఆ మిషన్ చాల నచ్చింది సందీప్ కి.

శ్యాం ఆట అయ్యాక, ఆ బాల్స్ ని కలెక్ట్ చేసి మళ్ళీ ఆ మెషిన్ లో వేయడం వాడికి సరదా.  నేను దగ్గరున్నపుడు మాత్రమే వాడ్ని అలా టెన్నిస్  బాల్స్ ని కలెక్ట్ చేయనిస్తాను.
**
నాన్నకి ఫ్లూ-జ్వరం సోకి ఓ సారి, ఇంకేదో కారణంతో మరో సారి – రెండు సార్లూ ఢిల్లీ ట్రిప్ మానేసుకున్నారు.  అమ్మావాళ్ళని చూడక అప్పుడే రెండో యేడు...
‘ఈ యేడన్నా తప్పక వాళ్ళని రమ్మని చెప్పాలి’ అనుకున్నాను.

మరునాడు లంచ్ చేస్తూ, అత్తయ్యతో ఆ విషయమే  ప్రస్తావిస్తే,

"అవును, మన మీద అలగలేదు కదా, మీ వాళ్ళు!" అన్నారామె నవ్వుతూ.

"శివాజీ అన్నయ్యని,  మా రాజ్యం వదిన గారిని చూసి నిజంగానే రెండేళ్ళవుతుంది. ... మీ తమ్ముడికి కూడా వేసవి సెలవలుగా! తప్పక రమ్మందాం అమ్మావాళ్ళని," అంటూ భోజనం అయ్యాక, అమ్మకి ఫోన్ చేసారు అత్తయ్య.

**

మళ్ళీ  వారానికి ఢిల్లీ వచ్చారు అమ్మావాళ్ళు.

"అంతా సవ్యంగానే ఉందా? అని అమ్మ ఆరా తీసింది.

నన్ను దగ్గరికి పిలిచి, ప్రత్యేకించి నా క్షేమసమాచారాలు కనుక్కున్నారు నాన్న.

"నీ బిడ్డ సహా నీవు క్షేమంగా, హాయిగా ఉన్నావనే భావిస్తున్నాము. మాకూ సంతోషమే." అన్నారాయన.

రెండు వారాలు సరదాగా గడిపి వెళ్ళారు.  వినోద్ సమ్మర్ జాబ్ వల్ల రాలేదు.

**

పెరిగే వయస్సులో *రిస్ట్ ఫ్రాక్చర్*  అయితే, *గ్రోత్ ప్లేట్స్* దెబ్బ తిని, పెరుగుదల మీద ప్రభావం ఉంటుందని *ఆర్టికల్స్* చదివాను.  డాక్టర్ని అడిగి తెలుసుకున్నాను కూడా. అందుకే, ఆ దెబ్బ వల్లే సందీప్ ఉండాల్సినంత ఎత్తుగా, ఆరోగ్యంగా లేడనిపిస్తుంది.

యేడేళ్ళకి, వాడు మరీ బలంగా లేకపోయినా, జాప్యం చేయకుండా, వారానికి రెండుసార్లు ఇంటి వద్దనే టెన్నిస్, స్విమ్మింగ్ నేర్చుకునేలా *ట్రైనర్స్* ని ఏర్పాటు చేసాను. పైగా సమ్మర్లో స్పోర్ట్స్ ఓ మంచి వ్యాపకమే అవుతుంది వాడికి.

శ్రద్ధగా ఆట నేర్చుకుంటున్నాడు సందీప్.

క్లాస్ అవగానే ప్రతి సారి "డాడి లాగా అడుతున్నానా లేదా నానమ్మా?" అని అడుగుతుంటాడు. డాడీలా బాల్ షూటర్ తో ఆడతానంటాడు.

ఇంకాస్త *ఓల్డర్* అయ్యాక, *షాట్* కూడా *స్ట్రాంగ్రర్* అయ్యాకే బాల్-షూటర్ తో ఆడాలన్నాడు ట్రైనర్, వాడితో.

సందీప్, ఆ సంగతిగా వాళ్ళ డాడీకి *కంప్లైన్* కూడా చేసాడు.

"*యు ఆర్ మై సన్.* నీలో ఓ గొప్ప స్పోర్ట్స్ మాన్ ఉండే ఉంటాడు. అతి వేగంగా వచ్చే టెన్నిస్ బాల్స్ ని ఎలా తిప్పి కొట్టాలో నేర్పిస్తానులే నీకు, నేనున్నాగా," అన్నారు శ్యాం వాడితో.

"వాడింకా చిన్న వాడు. ఆట రానివాడు. బాల్ షూటర్ తో ప్రాక్టిస్ చేసేంత లెవెల్ రానివ్వండి. తొందరేమీ లేదు," అన్నాను అక్కడే ఉన్న నేను. టెన్నిస్ ప్రాక్టిస్ నెపంతో బాబుకి మళ్ళీ ఏమి ఉపద్రవం రానుందో? అని నా గుండెల్లో రాయి పడింది.

సమయం చూసి, అత్తయ్యకి అన్నీ వివరించాను. ఇదివరలో సంఘటనలు గుర్తు చేసాను.

"ఇప్పుడిప్పుడే ఆట నేర్చుకుంటున్నాడు సందీప్. డాడీ తోనో, లేక బాల్ షూటర్ తోనో ఆడే సత్తా ఉందా వాడికి? మీరు కలగ జేసుకొని ఇటువంటివి జరగకుండా చూడాలి. బాబుకి దెబ్బలు తగలకుండా చూసుకునే బాధ్యత నాతో పాటు మీకూ ఉంది," అని ఆమెకి గుర్తు చేసాను.

**

నేను శ్యాం తో సఖ్యతగా లేననీ, ముక్తసరిగా మాట్లాడుతానని, ఆయనకి నా మీద పీకల వరకు కోపమే. ఇలా సఖ్యత లేని నన్నెందుకు ఉపేక్షిస్తున్నారో! అని తోచక భయం వేస్తుంది ఒక్కోసారి నాకు.

నా అత్తవారింట ఓ కోడలిగా, శ్యాంకి ఓ భార్యగా ఎన్నో బాధ్యతలని, కొన్ని నా ఇష్టం లేకున్నా, కష్టమైనా... సక్రమంగానే నిర్వహిస్తున్నాను. ఒక్కోసారి దుర్భరమనిపించినా మనుగడ సాగిస్తున్నాను.....

సందీప్ ని తీసుకొని, అత్తయ్యతో చిన్మయ మిషన్ కి, ఇప్పుడు నేనూ వెళ్తున్నాను. అక్కడ గడిపే రెండు గంటల సమయం మనసుకి, నా మనోగతికి కూడా ఎంతో శాంతినిచ్చేవే.

అక్కడ నేర్చుకున్న ఎన్నో విషయాలని పాటిస్తూ, నా జీవన మార్గాన్ని సులువు చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాను.

నాలో పెరుగుతున్న ఈ నిర్లిప్తత, నా రోజువారి జీవనంలోకి తొంగి చూడకుండా నిబ్బరంగానే ఉండగలుగుతున్నాను.

**

క్లాస్ ఫస్ట్ వచ్చి, థర్డ్ స్టాండర్డ్ కి ప్రొమోట్ అయ్యాడు సందీప్...స్పోర్ట్స్ అన్నా అంతే ఆసక్తి...

డాడీ లాగా తన ఫ్రెండ్స్ కూడా ఇంటికి వచ్చి తనతో ఆడాలని గొడవ చేయడం మొదలెట్టాడు వాడు. అత్తయ్యకి, శ్యాం కి తెలియజేసి, ఇంటి చుట్టు పక్కల నుండి, మాకు తెలిసిన సందీప్ క్లాస్ మేట్స్, ఫ్రెండ్స్ పేరెంట్స్ తో మాట్లాడాను.

శనివారం మధ్యాహ్నాలు, మా ఇంట రెండు గంటల సేపు ఆడుకొని, పిల్లలంతా సరదాగా గడిపేలా ఏర్పాటు చేసాను.

**

ప్రతి శనివారం పొద్దుటి నుండే హడావిడిగా బాస్కెట్ బాల్ కోర్ట్స్ చుట్టూ శుభ్రం చేయించి, క్యాండి మిండి లని రాముల చేత *గ్రూమ్* చేయించే బాధ్యత సహా తన మీద వేసుకున్నాడు సందీప్.

వాడి ఆదుర్దా, ఆటల్లో వాడి ఆసక్తి చూసి అత్తయ్యకి ముచ్చటగా ఉంది. 'అచ్చం శ్యాం చిన్నప్పటిలా' అంటూ తన కొడుకు బాల్యం గుర్తు చేసుకుంటారామె.

అత్తయ్య రెండవ మోకాలు సర్జరీ కూడా చేయించేసాము. వారం పాటు చేతి కర్ర సాయంతో నడిచాక కోలుకున్నారు. శనివారాలు పిల్లల ఆటలప్పుడు సూపర్వైజ్ చేస్తుంటారు...

మొత్తం ఎనిమిదిమంది పిల్లలు లంచ్ అయ్యాక ఆసక్తిగా వస్తున్నారు. చుట్టుపక్కల ఇళ్ళల్లోని వారే కాబట్టి, ఆటలయ్యాక మాత్రం డ్రైవర్ చేత వాళ్ళని ఇళ్ళ వద్ద డ్రాప్ చేయిస్తాను.

**

పొద్దున్నే మామూలుగా పెందరాళే లేచాను...నిస్సత్తువుగా అనిపించింది.
కాఫీ తాగుతూ టేబిల్ వద్ద కూర్చుండిపోయాను.

"...ఏమలా నీరసంగా ఉన్నావు? కాసేపు పోయి పడుకోమ్మా. ఆగ్రా నుండి ఇవాళ రాత్రికో, రేపు పొద్దున్నో గాని రాలేనని శ్యాం ఫోన్ చేసాడు. వంట నేను చేయిస్తాను," అన్నారు అత్తయ్య.

అక్కడినుండి లేచివెళ్ళి ఎంతసేపు పడుకుండి పోయినో కూడా తెలియదు... కొద్దిసేపుగా మాత్రం, శనివారం అని గుర్తు చేస్తూ, నన్ను లేవమని గొడవ చేస్తున్నాడు సందీప్.

పైకి లేవగానే కడుపులో తిప్పేసింది. పరుగున వాష్ రూంకి వెళ్ళి వామిట్ చేసాక, కాస్త తేలికయ్యింది.

ఎలాగో ఓపిక చేసుకొని సందీప్ ని తయారు చేసి, కూడా కిందకి వచ్చాను. పిల్లలకి గార్డెన్ లో అన్ని ఏర్పాట్లు చేసి, అత్తయ్యతో పాటు వెనకాల సిటౌట్ లో కూర్చున్నాను.

టెన్నిస్ నేర్చుకోవడం మొదలుపెట్టిన యేడాదికి, సందీప్ ఆట ఇంప్రూవ్ అయిందని నిన్న ట్రైనర్ అనడంతో, చాలా హ్యాపీగా ఉన్నాడు వాడు. వాళ్ళ డాడీ తోనో, డాడీలా బాల్ షూటర్ తోనో ఆడేందుకు ఎదురు చూస్తున్నాడు.

పువ్వులు కోసి నాలుగు రోజులయిందని గుర్తొచ్చి, లేచి వెళ్లి మల్లెలు తీస్తుంటే మళ్ళీ తల తిప్పేయడం మొదలైంది. కోసిన పువ్వులు అతయ్య చేతికిచ్చి పక్కనే చతికిలపడ్డాను.

“ఏమ్మా నీలా, ఇంకా అలాగే నీరసంగా ఉన్నావే… వంట్లో బాగోలేదా? అడిగారు అత్తయ్య. “పడుకున్నావు కదా అని నిన్ను లేపకుండా దగ్గరుండి, సందీప్ లంచ్ నేనే తినిపించేసాను,” అన్నారామె.

“లేదత్తయ్యా, కొద్ది రోజులుగా చెప్పాలనే అనుకున్నాను. నాకు మళ్ళీ ప్రెగ్నెన్సీ అనుకుంటా. దానివల్లే కాస్త నలతగాఉంది,” అన్నాను నీరసంగా.

అత్తయ్య ముఖం సంతోషంతో విప్పారింది.

“ఎన్నాళ్ళగానో ఈ మంచి వార్త కోసమే చూస్తున్నాను, అలా నీరసంగా చెబుతావేమ్మా? అంటూ ఆవిడ సంతోషాన్ని పంచుకోను శ్యాంకి ఫోన్ చేస్తే ఆయన దొరకలేదు.

నా వైపు తిరిగి, “చూడు నీలా, నేనుంటాలే ఇక్కడ పిల్లల కోసం. వాళ్ళని ఆడించి, తినిపించి, అన్నీ చూసుకుంటాను.
ఇద్దరు పనివాళ్ళు, జానకి కూడా ఉన్నారుగా. నువ్వు కాసేపు వెళ్ళి నడుం వాల్చు,” అంటూ నన్ను బలవంతంగా లోనికి పంపారు.

**

ఎంత సేపు పడుకొన్నానో! కళ్ళు తెరిచి చూస్తే, టైమ్ సాయంత్రం ఆరు గంటలయ్యింది. ఒళ్ళు తెలియకుండా అడ్డం పడ్డానన్న మాట.
ఈ పాటికి సందీప్ స్నేహితులంతా ఇళ్ళకి వెళ్లిపోయుంటారు.

లేచి చన్నీళ్ళతో మొహం కడుక్కొని గది నుండి బయటకి వస్తుంటే, సందీప్ కేకలు వినబడుతున్నాయి. చీర సరిచేసుకొని అటుగా వెళుతుంటే, సందీప్ అరుపులు, ఏడుపు వినిపించాయి.

“జానకీ, వెళ్లి అమ్మని తీసుకురావే,” అంటున్నారు అత్తయ్య.

“ఏరా శ్యాం, ఇందాకటి వరకు బాబుతో అక్కడే ఉన్నావుగా! వాడే ఆడుకుంటాడు అని నాకు చెప్పి మరీ లోనికెళ్ళావుగా!..



ఈ ఐదు నిముషాల్లోనే ఏమయిందిరా? వాడంతలా ఏడుస్తున్నాడే?" ఆవిడ మాటలు మరింత బిగ్గరగా ఆదుర్దాగా వినబడుతున్నాయి..

టెన్నిస్ కోర్ట్స్ వద్దకు పరుగుపెట్టాను. కోర్ట్స్ లో బాల్ షూటర్ ఇంకా టెన్నిస్ బాల్స్ ని గుప్పిస్తూనే ఉంది. శ్యాం, సందీప్ కోర్ట్స్ బయట ఉన్నారు.

"ఏమయింది? నా బాబుని మళ్ళీ ఏం చేసారు?" అంటూ, సందీప్ భుజాల మీదున్న శ్యాం చేతులు లాగేసాను.

సందీప్ ని ఎత్తుకొని, కాస్త దూరంలో ఉన్న కుర్చీలో కుదేసి, రక్తం కారుతున్న వాడి ముఖాన్ని చూశాను. నోట్లోంచి రక్తం, ఎడం పక్క కణత కమిలిపోయి బాల్ గట్టిగా తగిలిన దెబ్బ. వాడిని అలా చూసి తట్టుకోలేక పోయాను. కడుపు తరుక్కుపోయింది.

యేడుస్తున్న వాడిని ఎలా వోదార్చాలో తోచక, వాడిని గుండెలకి హత్తుకుని, నేనూ కన్నీళ్ల పర్యంతమయ్యాను.

"దెబ్బేమన్నా తగిలుంటే మన డాక్టర్ని పిలవండి," అంటూ దగ్గరగా వచ్చిన అత్తయ్య, సందీప్ ముఖం మీద దెబ్బలు చూసి భయపడినట్టుగా ఆగిపోయారు.

“చక్కగా అడుకుంటున్నాడని అనుకున్నానే! అప్పటివరకు శ్యాం వాడితోనే ఉన్నాడుగా. మరేమయిందో, ఏమిటో! పాపం బిడ్డకి ఎంత గాయం, ఎంత బాధ,” అంటూ బాబు వంక చూస్తూ గొడవ పడిపోతున్నారామె.

శ్యాం వచ్చి బాబుని ఎత్తుకోబోయారు.

“మీరు చేసింది చాలు శ్యాం, వాడిని ఇలా ఆడించవద్దని చెప్పినా మీరు వినరుగా, నా బిడ్డ జోలికి ఇక రాకండి,” అంటూ దు:ఖాన్ని ఆపుకుంటూ, డ్రైవర్ సాయంతో, బాబుని తీసుకొని కారెక్కాను.

“నీవు కూడా వెళ్ళరా శ్యాం, నీలకి అసలే వొంట్లో బాగోలేదు, నాన్నని వెంట తీసుకొని వెంటనే వెళ్ళు,” అంటూ వెనుక నుండి అత్తయ్యగారి గొంతు వినబడింది.

కారు నడుపుతూ, సందీప్ బాబు పరిస్థితికి నొచ్చుకున్నాడు డ్రైవర్.

“ఇలా జరగడం దురదృష్టం మేడమ్. శ్యాం సార్ మధ్యాహ్నం మూడింటికే ఇంటికి వచ్చారు. పిల్లలతో ఆడుతూ సార్ టెన్నిస్ కోర్ట్స్ లోనే చాలా సేపు ఉన్నారండి. సార్ తో పిల్లలు ఉషారుగా ఆడారు మేడమ్. పెద్దమ్మగారు కూడా అక్కడే కూర్చుని ఉన్నారు,” అతను చెప్పేది మౌనంగానే వింటున్నాను.

“ఐదు దాటాక, సందీప్ బాబు ఫ్రెండ్స్ ని ఎవరి ఇళ్ళ దగ్గర వాళ్ళని విడిచి వచ్చి, కారు క్లీన్ చేస్తుండగా బాబు ఏడుపు వినిపించి అటు పరిగెత్తాను మేడమ్,” చెప్పుక్కు పోతున్నాడు డ్రైవర్.

“అక్కడ టెన్నిస్ కోర్ట్స్ లోపల సందీప్ బాబు ఆ మెషీన్ నుండి విసురుగా తన పైకి వస్తున్న బంతుల్ని తిరిగి కొట్టలేక అల్లాడిపోతున్నాడు. ఇంతలో, శ్యాం బాబు పరుగున వచ్చి సందీప్ బాబుని కోర్ట్స్ బయటికి తెచ్చారు. అప్పుడే మీరూ వచ్చారు,” అని ముగించాడు.

అంటే నేను లోనికి వెళ్లి నిద్రకు పడ్డ కాసేపటికి శ్యాం వచ్చారన్నమాట. మొత్తానికి సందీప్ ని కోర్ట్స్ లో ఉంచి షూటర్ స్విచ్ శ్యాం కదా వెయ్యాలి. కావాలనే అలా చేశారా? ఔనన్న మాటేగా.
లేదంటే, దగ్గరుండి, ఆడించాలి కాని, మొదటిసారి బాల్ షూటర్ తో చిన్నవాణ్ణి ఒంటరిగా వదిలి వెళ్లడం ఏమిటి?.....

అక్కడే ఉన్నా, అసలు జరిగిందేదీ అత్తయ్యకి తెలియదు.
నాకు మాత్రం సందీప్ పట్ల, శ్యాం అలక్ష్యం అర్ధమయ్యి మనసు స్తంభించి పోయాయి.

‘ఇటువంటి ఖాతరు లేని మనిషికా, నేను మరొక బిడ్డను కనివ్వబోయేది? పసివాడినొక్కణ్ణి కాపాడుకోలేక పోతున్నానే? సందీప్ విషయంగా నా అభిప్రాయాలు తెలిసుండీ, ఎంతటి నిర్లక్ష్యం?

భగవంతుడా నాకు నిష్కృతి లేదా?' అని గట్టిగా తల పట్టుకున్నాను.

హాస్పిటల్ రావడంతో బాబుతో బధ్రంగా కారు దిగి వడిగా లోనికి వెళ్లాను.

**

***అపోలో హాస్పిటల్, పీడియాట్రిక్ వార్డ్***

ఎమెర్జెన్సీ డాక్టర్లు సందీప్ ముఖం మీద గాయం శుభ్రం చేసాక, వాడిని పరీక్షించి, నోటిలో రెండు పళ్ళు ఊడాయని, చిగుళ్ళు కణతలు బాగా ఒరుసుకు పోయాయనీ నిర్ధారించారు.

తలనొప్పి అని వాడు చెప్పడంతో, ముఖం మీది వాపు తగ్గాక కళ్ళు పరీక్ష చేయించాలని రిపోర్ట్ ఇచ్చారు.

లక్కీగా మొదటినుండీ సందీప్ ని చూసే పీడియాట్రిషన్ కూడా సమయానికి అందుబాటులోకి వచ్చారు. బాబు రిపోర్ట్స్ ఆయనే చూడ్డం కాస్త ఊరటనిచ్చింది.

శ్యాం, మామయ్య నాతో పాటు *వెయిటింగ్* రూం లోనే ఉన్నారు.

కాసేపటికి డాక్టర్ పిలిపిస్తే, లోపలికి వెళ్ళి ఎదురుగా కూర్చున్నాము.

నా వంక చూసారాయన. "ఏమిటమ్మా, ఇలా ఇన్ని సార్లు తీవ్రంగా దెబ్బలు తగలడం బాబుకి? బిడ్డని జాగ్రత్తగా చుసుకోవాలి కదా! మీకు అంతగా టైం లేకపోతే, పనివాళ్ళని పెట్టవచ్చు కదా! బాబు *చార్ట్* ప్రకారం ఇంతకు మునుపు *రిస్ట్ ఫ్రాక్చర్* కూడా అయింది. అది నాకు గుర్తే.

ఇప్పుడు కణత మీద తగిలింది గట్టి దెబ్బ కాబట్టి, చూపు కూడా *ఎఫెక్ట్* అవ్వచ్చు. ఏమైనా కంటి *ఎక్జాం* అయ్యాక తెలుస్తుంది,'' అన్న డాక్టర్ మాటలు వింటూ జీవచ్ఛవంలా అయిపోయాను.

అసలు దెబ్బలెలా తగిలాయి అని అడిగారు.

''సందీప్ సరదా పడుతుంటే, టెన్నిస్ బాల్ షూటర్ ఆన్ చేసి, షాట్స్ రిటర్న్ చేయడం చూపించాకే, నేను ఓ ఐదు నిమిషాలు ఇంట్లోకి వెళ్లాను. బాబుకి, షూటర్ వేగం హెచ్చయియుండవచ్చు.
దాంతో, బాల్స్ ని తిప్పి కొట్టలేక అటువంటి తీవ్ర గాయాలకి గురయ్యాడు. వాడి అరుపులకి నేను వెళ్లేలోగానే, బాబుకి ఇలా తగిలాయి,'' శ్యాం తానే స్వయంగా జరిగిన సంఘటన టేరీజువేసి డాక్టరుకి వివరించారు.

''చూడండి శ్యాంప్రసాద్, బాబుకి ఐదేళ్లప్పుడు రిస్ట్ ఫ్రాక్చర్ అయిన కారణం, ఇప్పుడు *బాల్ షూటర్* తో ఇలా *ఇంజ్యూర్* అవ్వడం, మీ మీద *బాడ్* గా *రిఫ్లెక్ట్* అవుతుంది....పైగా వాడంతట వాడు చేసుకున్నవి కావు. మీ కుటుంబం నాకు బాగా పరిచయం.
నో, *జస్ట్ ఫ్రెండ్లీ అడ్వైజ్.* బాబు *ఫిజికల్* గా *స్ట్రాంగ్* కూడా కాదాయె! ఎనిమిదేళ్ళకి – ఆరేళ్ళ వాడిలా ఉన్నాడు. *హి ఇజ్ బిట్ వీక్ ఫర్ హిజ్ ఏజ్* కదా!... బాబుని ఇకనుండి పెద్దవాళ్ళతో గాని, పెద్దవాళ్ళ ఆటలు గాని ఆడనీయకండి,'' అన్నారు డాక్టర్ గారు గంభీరంగా...

"ఇప్పుడు చేయవలసింది చేసి, మెడిసిన్స్ రాసాను.  కరెక్ట్ గా అవి వాడి, బాబుని నాలుగు రోజుల్లో తీసుకురండి.  అవసరం ఉంటే నా సెల్ కి ఫోన్ చెయ్యండి.
"*హి విల్ బి రెడీ టు గో హోం నౌ*,", "వెళ్ళి బాబుని ఇంటికి తీసుకు వెళ్ళండి," అంటూ ప్రిస్క్రిప్షన్ కాగితం టేబుల్ పైనుంచారు.

వింటున్న నాకు శ్యాం పీక నులిమి చంపేయాలన్నంత కోపం వచ్చింది. డాక్టర్ రాసిన మందుల కాగితం తీసుకొని, బాబు కోసం ఎమెర్జెన్సీ రూం వైపు వెళ్లాను.

శ్యాం నా వెనువెంటే వచ్చారు. "నేను బిల్ కట్టి, మందులు తీసుకొస్తాను," అంటూ నా చేతిలోని ప్రిస్క్రిప్షన్ ఇమ్మన్నారు. నేనివ్వనన్నా, నా చేతినుండి బలవంతంగా తీసుకొన్నారు.

ఈ పరిస్థితుల నుండి, నన్ను నేను ఎలా విడదీసుకోవాలి? పిల్లల భవిష్యత్తు ఏమిటి?  ఏదో ఓ మార్గం దొరకపుచ్చుకోవాలి.  ఇది నా బిడ్డల కోసం నా ఒంటరి పోరాటమే.
అన్నీ తెలిసినా అత్తయ్య చేయగలిగిందేమీ ఉండదు...ఆవిడ పెద్దావిడ. కాక శ్యాం తల్లి,  పైగా ఈ విషయంగా ఆమె అవగాహన పరిధి కూడా స్వల్పమైనదే.
**

సందీప్ కి డెంటిస్ట్, కళ్ళ డాక్టర్ ల వద్ద నెల రోజుల పాటు పరీక్షలు, కాన్సల్ట్స్ పూర్తయ్యాయి. దెబ్బ తగిలి ఊడిన పళ్ళ వల్ల నష్టం లేక పోయినా ఎడం వైపు చిగుళ్ళు బాగా దెబ్బ తిన్నాయట. తిరిగి రాబోయే పళ్ళ విషయంలో వేచి చూడాలనన్నారు.

కణతల మీద దెబ్బ గట్టిగా తగలడం వల్ల, ఎడమ కంటి చూపు మందగించిందట. వాడి తల నొప్పులుకి మాత్రం కళ్ళద్దాలు వెంటనే వేయించాలని రిపోర్టులిచ్చారు.

పండంటి నా బాబుకి వచ్చిన ఈ దౌర్భాగ్యం నన్ను మానసికంగా, శారీరకంగా క్రుంగదీసింది. జీవితం మీద విరక్తి ఏర్పడింది.

ఇటువంటి పరిస్థితిలో ఉన్న నేను, కడుపున ఉన్న మరో బిడ్డని శ్రద్ధగా మోసి, జన్మనిచ్చి- పెంచే ఓపిక, యోగ్యత నాకు లేవు అనిపించింది.

ఎందాకని నేను నా బిడ్డలని విచక్షణాజ్ఞానం లేని తండ్రి నుండి కాపాడుకోగలను? సాధ్యమయ్యేనా? ఆలోచనలతో బుర్ర వేడెక్కింది.

నా పడక, నివాసం, సందీప్ గదిలోకి పూర్తిగా మార్చేశాను.

**

సందీప్ ముఖం మీద దెబ్బలు మాని మామూలుగా అవడానికి, రెండు నెలలు పట్టింది. గాయాలకి, స్కిన్ కి వాడిన క్రీమ్స్ కూడా ఇక మానేయవచ్చన్నారు డాక్టర్లు. వాడికి కళ్ళద్దాలు మాత్రం మరికొంత కాలమైనా వాడాలన్నారు. వాడి కంటిచూపు మెరుగయ్యేనో లేదో అని

వర్రీ గా  ఉంటుంది.  దీనికంతటికీ కారణమైన శ్యాం మీద చాలా కోపంగా ఉంటుంది...

నా మనస్తాపాన్ని నా భర్త దుర్మార్గుడుకి తెలియజేయడం ఎలా అని ఆలోచిస్తున్నాను.

ఓ రోజు పొద్దున్నే శ్యాం ఆఫీసుకి తయారవుతుండగా, తన గదిలోకి వెళ్లాను.  అద్దం ముందున్న శ్యాం వెనుతిరిగి చూసాడు.

"ఏమి సంగతి?  చాలా కాలం తరువాత నా ముఖం చూడాలనిపించిందా? రా కూర్చో," అంటూ నా వైపు రాబోయాడు.

"ఆగండి",  నేను చెప్పేది వినవలసిన అవసరం, మీకు నాకు కూడా ఉంది.  మీరే కూర్చోండి," అని నేను వాకిలి పక్కనే ఉన్న మోడా మీద కూర్చున్నాను.  శ్యాం నా పైఖరికి కాస్త విస్తుపోయి దూరంగా బెడ్ మీద కూర్చున్నాడు.

"నా మీద గాని, నా బిడ్డ మీద గాని, మీరు చేయి వేయాలన్న ఆలోచన మానుకోండి. ఇక మనమధ్య ఎటువంటి సంబంధము నాకిష్టం లేదు. మీ లోని మొరటుతనం బిడ్డని అవిటివాడిని చేసింది.

నాకు తెలిసి, కావాలనే పదేపదే నిర్లక్ష్యంగా మీరు మన  బిడ్డకి, నా పెంపుడు కుక్కలికి, భౌతికంగా హాని కలిగిస్తున్నారు.  ఇక ముందు కూడా చేస్తారని నాకు తెలుసు.'' అని శ్యాం వంక చూసాను.

నా వంకే చూస్తున్న అతని కళ్ళు కోపంగా ఉన్నాయి.  ఈ సారి ధైర్యంగా శ్యాం ని సూటిగా చూస్తూనే,

''ఇక కడుపులో ఉన్న ఈ బిడ్డకి జన్మ నివ్వడం కూడా నాకు ఇష్టం లేదు. మీరు ఏమి చేయదలచినా నా ఈ నిర్ణయాల్లో మార్పు ఉండబోదు. మా మీద జులుం సాధించాలని చూస్తే నేను సహించను. ఇక మీ ఇష్టం,'' అని చెప్పి గబా గబా ఆ గది నుండి వెళ్లి పోయాను.

**

సందీప్ ని స్కూల్ కి రెడీ చేస్తుంటే నా సెల్ మోగింది.  కాల్ రిసీవ్ చేసాను.

''హలో, నేనే చిత్రని, ఎలా ఉన్నావు? నేనిప్పుడు ఢిల్లీలోనే ఉన్నాను. నీకు ఎంతో దూరంలో కూడా కాదు," అంటున్న చిత్ర మాట విని కాస్త ఆశ్చర్యపోయాను.

"మా ఇద్దరికీ, ఢిల్లీ అపోలో హాస్పిటల్లో *రెసిడెంట్ సైకియాట్రిస్ట్స్* గా జాబ్స్ వచ్చాయి.  ఈ ఆదివారం నీకు 'ఓకే' అంటే మిమ్మల్ని  కలవడానికి వస్తాము,'' అటునుండి చాల ఉత్సాహంగా అంది చిత్ర.

“తప్పకుండా రండి చిత్రా,” అన్నాను. నాకూ సంతోషంగా అనిపించింది.
**
ఆదివారం పొద్దున్న పదింటికి సందీప్ కి గిఫ్ట్, ఫ్రూట్ బాస్కెట్ తీసుకొని వచ్చారు చిత్ర, ఆనంద్.
చిత్ర భర్త ఆనంద్ ని నేను పెళ్ళప్పుడు చూశాను.
శ్యాం, ఆయన్ని కలవడం మాత్రం మొదటిసారే.
వాళ్ళతో కాసేపు మాట్లాడి, లంచ్ చేసాక, పనుందంటూ శ్యాం బయటకి వెళ్లారు. శ్యాం ముభావంగా ఉన్నారనిపించింది నాకు.

అత్తయ్య, మామయ్య వచ్చిన అతిధులతో చాలా సేపు సరదాగా మాట్లాడుతూ గడిపారు. “అంకుల్, ఆంటీ” అంటూ వాళ్ళ తోనే ఉన్నాడు సందీప్. వాళ్లకి తన స్విమ్మింగ్ పూల్, బాస్కెట్బాల్, టెన్నిస్ కోర్ట్స్ చూపించాడు. క్యాండి, మిండి లని పరిచయం చేసాడు.

“అంకుల్, నేను మా డాడీ లాగా బాగా టెన్నిస్ ఆడగలను. మీరు ఆడతారా?” ఆనంద్ ని వీడకుండా కబుర్లు చెబుతూ ఉండిపోయాడు వాడు. ఆనంద్ కూ్కడా పిల్లలంటే ఇష్టమని తెలుస్తుంది.
నాకు ఆనంద్ పట్ల సద్భావనే కలిగింది.

సంకోచించకుండా బాబుని ఆనంద్ కి దగ్గరగా వెళ్ళనివ్వడం నాకే కొత్తగా ఉంది.

శ్యాం వల్ల కలిగే ఆపదల దృష్ట్యానే కదా, నేను సందీప్ పట్ల ప్రొటెక్టివ్ గా ఉంటున్నాను...అని నాకు నేను, సమాధానం చెప్పుకున్నాను.

సందీప్ తో కాసేపు బాస్కెట్బాల్ ఆడుతూ పూల్ వద్ద ఉండిపోయారు ఆనంద్.
నేనూ, చిత్ర టీ తాగుతూ ఇంటి వెనుక సిటౌట్ లో కూర్చున్నాము.

“సరే ఇప్పుడు చెప్పు, మునపటంత సంతోషంగా లేవెందుకు? ఏమవుతుంది?, హాయిగా ఉన్నావని, నాకు అనిపించడం లేదు,” అంది చిత్ర నన్ను చూస్తూ.

‘అంతలా బయటికి కనబడి పోతున్నానా?’ అని ఇబ్బందిగా అనిపించింది. ‘ఏమని చెబుతాను? ఎలా చెబుతాను? అనుకున్నాను.

క్షణమాగి, “ఏంలేదు చిత్రా, నాకిప్పుడు మళ్ళీ ప్రెగ్నెన్సీ. వొంట్లో బాగోవడం లేదు. సందీప్ పనులన్నీ నేనే చూసుకోవాలి.
యాతనగా ఉంది. శ్యాం తన కంపెనీ పనితో యమబిజీగా ఉంటారు.
ఈ సమయంలో మరో బిడ్డని కనాలని గాని, పెంచి పెద్ద చేయాలని గాని నాకు లేదు. ఓపిక లేదనుకో,” అంటూ నవ్వేసాను.

“ఏమిటి? బిడ్డ వద్దనుకుంటున్నావా? నేననుకున్న దాని కంటే నీకు ఎక్కువే చిక్కులు చింతలు ఉన్నట్టున్నాయే?” చిత్ర అంటుండగానే సందీప్, ఆనంద్ మా వైపుగా వచ్చారు.

“మమ్మీ, ఆనంద్ అంకుల్ కి నాతో బాస్కెట్బాల్, టెన్నిస్ ఆడ్డానికి టైం ఉంటుందంట. ఎవ్రీ వీక్ రమ్మని అడగనా మమ్మీ?” నా వద్దకు వచ్చి, అడిగాడు సందీప్...

“సందీప్ తో ఆడ్డానికి, వాళ్ళ డాడీకి అస్సలు టైం ఉండదంటగా! అందుకే, ఎప్పుడన్నా వచ్చి ఆడతానని చెప్పాను,” నవ్వుతూ ఆనంద్.

“మీ వాడు చిన్నగానే ఉన్నాడు గాని, బాగా ఫాస్ట్. *బాస్కెట్బాల్* నా కంటే బాగా ఆడి నన్ను ఓడించాడు...అయినా ఇంత *స్లిమ్ముగా* ఎలా ఉన్నాడు? వాడిని డైట్ మీద ఉంచారా నీలా గారు?” ఆనంద్ నవ్వుతూనే అన్నా, ఆ మాటలు నా గుండెల్ని పిండేసాయి.
వాడి మణికట్టు విరిగిన విషయం మొదలుకొని వాడికి తగిలిన దెబ్బలన్నీ జ్ఞాపకం వచ్చాయి.

“నీలమ్మా, మేము వెళ్లిరామా మరి?” అంటూ కదిలింది చిత్ర. వీలు చేసుకొని మళ్ళీ కలుస్తామంటూ అందరికీ చెప్పి వెళ్ళారు ఆనంద్.
**

# 4

రాత్రి తొమ్మిదిన్నరకి బాబుకి బెడ్ స్టోరి చదువుతుండగా చిత్ర ఫోన్ చేసింది.

"ఇప్పుడు చెప్పమ్మా నీలమ్మ, సంగతి ఏంటి? బిడ్డ వద్దు అనుకోడానికి కారణమేంటి?" ఉన్న చనువు కొద్దీ అడిగింది.

"మన రమణికేమో సంతానం కలగక *డిప్రెషన్* లో ఉంది, మరి నువ్వేమో ఇలా. సంగతి తెలిస్తే సలహా ఇవ్వగలను నీ శ్రేయోభిలాషిగా. సో, చెప్పవే," అంది ఆదుర్దాగా.

మెల్లగా లేచి బాల్కనీలోకి నడిచాను.

"చెప్పానుగా, సందీప్ ని చూసుకోడానికే నాకు సమయం చాలదు. *యానిమల్ షెల్టర్* పని కూడా చూస్తాను. అలిసిపోయాను. అదీగాక, మా ఆయనకి, నాకు మధ్య పెద్దగా పొంతన కూడా లేదులే. నేనిప్పుడున్న పరిస్థితిలో మరో బిడ్డ అంటే, నాకు ఆసక్తిగా లేదు, అంతకంటే విషయమేమీ లేదు," అన్నాను.

"బిడ్డని వద్దనుకున్నంత మాత్రాన నీ చింతలు, బాధ్యతలు పోవు. పైగా ఆ బిడ్డే నీ జీవితంలోకి మార్పు తెస్తుందేమో! ఆలోచించుకో.

మీ సంపద, పరపతి అనుభవించడానికి కడుపున పుట్టిన పిల్లలుంటే మంచిదేగా! చక్కగా పెంచి, వారిని వృద్ధిలోకి తెచ్చి, వారి సుఖ

సంతోషాలని పంచుకో...సరేనా?", "నీకెప్పుడు ఏది కావాలన్నా, మాట్లాడాలన్నా ఫోన్ చేయి. టైం చేసుకొని నేను వచ్చి వాలిపోతాను, నీవు బాగోవడమే ముఖ్యం. ఇక పడుకో," అని ఫోన్ పెట్టేసింది చిత్ర.

చిన్నప్పటి నుండి చిత్ర అంతే, ఎదుటివారు సంతోషంగా ఉన్నారా లేదా అని కనిపెట్టగలిగేది. సహాయం చేయాలని చూసేది. అందుకే డాక్టర్ అవ్వాలని అనుకొనేది.
తల్లితండ్రులని కార్ ఆక్సిడెంట్లో పోగొట్టుకున్న చిత్ర, పదేళ్లప్పుడే కేరళ నుండి మేనమామ దగ్గరికి వచ్చేసింది. బాగా ఆస్తిపరురాలని చెప్పుకునేవారు చిత్ర గురించి. మా ఇంటికి నాలుగిళ్ళవతల పెద్ద భవంతిలో వాళ్ళ మేనమామ దగ్గర పెరిగింది.
చాల దయ గల మనస్సు, మంచి ఆలోచనకల అమ్మాయి. నాకు పదో యేట పరిచయమైన చిత్ర, స్నేహమంటే ప్రాణం పెట్టే శ్రేయోభిలాషి.

ఆకస్మాత్తుగా, ఇన్నాళ్ల తరువాత, నీలి నీడలు కమ్ముకున్న నా జీవితంలోకి నా ప్రాణస్నేహితురాలు అడుగు పెట్టాలని చూస్తుంది. నాకు చేయూత నిస్తానంటుంది.

బిడ్డని వదిలించుకోవాలని నాకూ లేదు.
నా పరిస్థితి అటువంటిది. గర్భం ఉంచుకోవాలా లేదా అన్న విషయంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలి. చిత్ర చెప్పింది కూడా ఆలోచిస్తూ నిద్రలోకి జారాను.

**

చిత్ర, ఆనంద్ ప్రతి ఆదివారం వస్తున్నారు. అత్తయ్య, మామయ్యలకి వారిద్దరు అంటే ఇష్టం ఏర్పడ్డంతో, వాళ్ళని ఆప్తుల్లా భావించడం మొదలుపెట్టారు. శ్యాంది అందరితో, మాట్లాడి సరదాగానే ఉండే నైజం కాబట్టి, ఇంట్లో ఉంటే మాత్రం ఆనంద్ తో మాట్లాడుతూ, బాగానే ఉంటున్నారు.

ఇద్దరికీ కుదిరితే ఎప్పుడన్నా టెన్నిస్ ఆడుతున్నారు కూడా. నాకూ చిత్ర రాకతో జీవితంలో ఓ స్నేహం, ఆప్యాయత, ఓ ఆలంబన దొరికినట్టయింది. ఇక సందీప్ సంతోషానికి అంతే లేదు. ఆదివారం అంటే 'అంటీ, అంకుల్' తో ఆనందాల రోజు వాడికి.

హాస్పిటల్ కి దగ్గరగా ఉన్న గేటెడ్ కాంప్లెక్స్ లో అపార్ట్మెంట్ కొన్నారు వాళ్ళు.

వారి గృహప్రవేశం మా అత్తయ్య, మామయ్యల ఆధ్వర్యంలోనే జరగాలన్నారు.

ఆ రోజు పూజకి మేమంతా కాస్త ముందుగానే చిత్ర కొత్తింటికి చేరాము. హాస్పిటల్ నుండి ఆనంద్ చిత్రల కొలీగ్స్ కుటుంబాలు కొందరొచ్చారు. ప్రయాణం చేయలేక చిత్ర మామయ్య, లండన్ లో సెటిల్ అయిన ఆనంద్ వాళ్ళ అన్నయ్య రాలేకపోయారు. మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారుట.

పూజయ్యాక, ప్రసాదం తీసుకొని, పని ఉండడంతో శ్యాం వెళ్ళిపోయ్యారు.

భోజనాలయ్యాక మిగతా అతిధులతో పాటు అత్తయ్యావాళ్ళు కూడా ఇంటికి వెళ్ళిపోగా, క్లబ్-హౌజ్ ఆవరణలో 'కిడ్స్-వరల్డ్' చూపించడానికి సందీప్ ని తీసుకెళ్ళారు ఆనంద్.

"కిచెన్ క్లీన్ చేద్దామా?" అని పైకి లేవబోయాను.
"నీవేమి చేయద్దు, వచ్చి కాసేపు కూర్చో," అని చేయి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టేసింది చిత్ర.
'సంతోషం, నీవు బిడ్డని వద్దనుకోవడం లేదని నాకు అర్ధమయింది,", "మీ ఆయనకి, నీకు మధ్యన పొంతన లేకపోవడం సంగతి నువ్వు చెప్పు," అని క్షణమాగి నా వంక చూసింది.

"బయటకి ఆయన అన్ని విధాల అర్హుడైన భర్తలాగానే అనిపిస్తున్నాడు. కానీ, మీ ఇద్దరి వైఖరి గమనిస్తే, మీ మధ్య ఓ స్నేహం కాని, ఓ సంభాషణ కాని ఉన్నట్టుగా నేను చూడలేదు.
విషయమేమిటో చెప్పు నీల, నేను నీ ఫ్రెండ్ నే కాదు, ఒక డాక్టర్ని కూడా, అందునా సైకియాట్రిస్టుని. నీకు సాయం చేయగలను," అని గడ్డం పట్టుకుంది.

నేను ఫక్కున నవ్వేసాను, " ఏమి లేదులేవే తల్లీ. శ్యాం ఒత్తి మొరటు మనిషి, నాతోనే కాదు, మా పెట్స్ తో, సందీప్ తో, అందరితో అలాగే ఉంటాడు. అందుకే నాకు శ్యాం తో గొడవ. సరేనా?" అని తేల్చేస్తూ మంచి నీళ్ళు కావాలంటూ లేచాను.

“ఓహో, మన కాలేజీ రోజుల్లో ‘మొరటోడు’ సినిమాలో లాగానా?” అని చిత్ర అనగానే, ఇద్దరం నవ్వుకున్నాము.

అంతలో ఆనంద్, సందీప్ వచ్చేసారు. నేను లేకుండా, బాబుని అలా మరొకరి వెంట పంపించడం ఇదే మొదటి సారి. నా బిడ్డ బధ్రత విషయంలో, వేరొకర్ని నమ్మగలిగి నందుకు హాయిగా అనిపించింది.

సాయంత్రం ఆరయ్యాక సందీప్ కి పార్లర్ లో ఐస్క్రీం తినిపించి మమ్మల్ని ఇంట వదిలారు చిత్ర, ఆనంద్.

**

ఈ సారి ప్రెగ్నెన్సీకి కూడా కష్టం లేకుండా అత్తయ్య నన్ను శ్రద్ధగా చూసుకుంటున్నారు. నాకు నాలుగో నెల వచ్చింది.

చిత్ర వాళ్ళు ఢిల్లీ వచ్చి రెండు నెల్లయ్యింది.

చిత్ర, ఆనంద్ మా కుటుంబానికి సన్నిహితులయ్యారు. సందీప్ కి సొంత తండ్రి తో కూడా లేని స్నేహం, సాన్నిహిత్యం ఆనంద్ అంకుల్ తో కుదిరింది.

**

ఎప్పటిలా ఆదివారం *రొటీన్* మెన్యూ కాకుండా, ఈవేళ తానే మార్కెట్ నుండి కూరలు తెచ్చి, అత్తయ్య చేత వండించారు శ్యాం. ఏదో విశేషం ఉంటుందనుకున్నాను....

చిత్ర, ఆనంద్ లతో కబుర్లు చెప్పుకుంటూ, అందరం లంచ్ చేస్తుండగా,

“ఆమ్మా, నేను తెచ్చిన స్వీట్స్ కూడా సర్వ్ చేయి మాకు,” అన్నారు శ్యాం...

మా అందరిని ఉద్దేశించి, “...ముందుగా ఓ అనౌన్స్మెంట్...
ఈ ఇయర్, వరల్డ్ టాప్-ట్వంటీ సాఫ్ట్వేర్ కంపనీలతో పోటాపోటీగా నిలిచింది, మా కంపెని. ఢిల్లీ స్టేట్ లో నంబర్ వన్ గా అనౌన్స్ చేసారు....
వచ్చే ఆదివారం లయన్స్ క్లబ్ వారి *బాల్రూం* లో కంపెనీ డిన్నర్ ఎరేంజ్ చేసాము...ప్రైవేట్ ఎఫైర్. మనము, మా కంపెని స్టాఫ్....
*సో*, చిత్ర – ఆనంద్, మీకు నా ప్రత్యేక ఆహ్వానం. *ప్లీజ్ జాయిన్ అస్*, *నెక్స్ట్ సండే ఫర్ అ సెలెబ్రేషన్ డిన్నర్*,” అన్నారు శ్యాం సంతోషంగా...

“నీలవేణి ఇంట అడుగు పెట్టాక శ్యాం బిజినెస్, రాబడి పదింతలు పెరిగాయి. ...అంతా మా కోడలి అదృష్టం,” అంటూ, ఆ అభివృద్ధికి కారణం నాకాపాదించారు మామయ్య...

“*వితౌట్ ఎనీ డౌట్*,”.... అన్నారు శ్యాం...

“సిటీ బిజినెస్ *సర్కిల్స్* లో, శ్యాం పట్టిందల్లా బంగారమవుతుందని చెప్పుకుంటారు...,” అన్నారు ఆనంద్ కాంప్లిమెంట్ గా.

‘నా చేయి పట్టుకుని నాతో ఏడడుగులు నడిచాక మాత్రం, నా జీవితంలో అశాంతిని నింపారు మీ ..శ్యాం...’ అనుకున్నాను.
**

శ్యాం బయటకి కనబరిచే మృదుత్వం, నాపట్ల ఎందుకు చూపించరో నాకు అర్ధమే అవదు. నా ప్రమేయం లేకుండా, నా అయిష్టాన్ని పట్టించుకోకుండా, భర్తగా నా పై తన అధికారం చెలాయిస్తూనే ఉన్నారు. కొనసాగుతున్న మా దాంపత్య జీవితం కూడా, 'సంసారం' అన్న ముసుగు వేసిన నరకకూపం.

....శ్యాం నన్ను తాకిన ప్రతిసారి నా అణువణువు అయిష్టతతో ఎదురుతిరుగుతుంది.

ఎలా నాకు నిష్కృతి లభించేనో అన్నదే నా ఆలోచన. ఇకపైన అతని చేరువగా మెలిగే సందర్భమే రాకుండా జాగ్రత్త పడాలని నిర్ణయించుకున్నాను.

భూదేవంత ఓర్పునివ్వమని ఆ దేవుణ్ణి ప్రార్ధిస్తుంటాను....

నా కొడుకుని పెంచి, పెద్ద చేసి వృద్ధిలోకి తేవడమే నాకు మిగిలిన సంతోషం.

అన్ని దెబ్బల నుండి కోలుకుని ఇటు ఆటల్లో, అటు చదువుల్లోనే కాకుండా, చిన్మయ మిషన్ వారి 'బాలవిహార్' ప్రోగ్రాం లో కూడా ఆసక్తిగా పాల్గొంటున్నాడు సందీప్. భగవద్గీత శ్లోకాలు కూడా చక్కగా వల్లిస్తాడు. తెలియని అర్ధాలు చెప్పడానికి అత్తయ్య ఉండనే ఉన్నారు...

**

*ఢిల్లీ సిటీ హాల్ – 'ఢిల్లీ చాంబర్ ఆఫ్ కామర్స్ - ఐ.టి శాఖ' వారి సన్మాన సభ....*

***"..భారతదేశంలోనే ఉత్తమ ఐ.టి సంస్థ నిర్వాహకుడు, శ్రీ శ్యాం ప్రసాద్ మధురై ని ఘనంగా సన్మానిస్తున్న ఈ సందర్భంలో, విచ్చేసిన మీ అందరికీ వందనాలు..." అన్న సంస్థ సెక్రెటరీ వ్యాఖ్యతో సభ ఆరంభమైంది.***

కరతాళధ్వనులతో మారుమ్రోగింది హాల్....

"పదేళ్ళ క్రితం 'ఐర్లాండ్ గ్లోబల్ కార్పోరేషన్' సహకారంతో స్థాపించబడ్డ ఐ.టి సంస్థని 'శ్యాం బిజినెస్ సొల్యూషన్స్' గా వృద్ధి పరిచారు - శ్యాంప్రసాద్ మధురై. అతని ఆధీనంలోనే సంస్థ అంచెలంచెలుగా ఎదిగి, ఐదేళ్ళగా ఢిల్లీ మహా నగరంలో ఆర్ధికంగా, వ్యవస్థాపికంగా మొదటి స్థానం సంపాదించింది.

ఆ సంస్థ నిర్వాహకుడిగా ఐదో సారి అవార్డు అందుకోబోతున్న ఈ *డైనమిక్ ఆంత్రప్రెన్యూర్* కి ప్రభుత్వ ఐ.టి శాఖ తరఫున కూడా అభినందనలు," అని శ్యాం ని కొనియాడుతూ, అవార్డు అందించారు ఐ.టి శాఖామాత్యులు.

"*పేరెంట్స్ ఆఫ్* - శ్యామ్ ప్రసాద్ - మిస్టర్. నారాయణ్ మధురై అండ్ మిసెస్ శ్రీదేవి నారయణ్," అంటూ ప్రేక్షకుల్లో ఉన్న అత్తయ్య మామయ్య గార్లని ప్రత్యేకంగా గుర్తించారు ఆర్గనైజర్స్.

'ఐర్లాండ్ గ్లోబల్ కార్పోరేషన్' బోర్డ్ మెంబర్, చార్లెస్ డిక్సన్ కూడా సభకు రావడం విశేషం. ఆయన తమ సంస్థ తరఫున శ్యాం కి '*అవార్డ్ ఆఫ్ ఎక్సెలెన్స్*' ప్రదానం చేసారు.

శ్యాం గౌరవార్ధం ఏర్పాటు చేసిన సభకి మాతోపాటు చిత్ర, ఆనంద్ కూడా వచ్చారు. సందీప్ కి చాలా ఉత్సాహంగా, డాడి అంటే రెట్టింపు గర్వంగా ఉంది. హ్యాపీగా అంతటా తానే అయి తిరిగాడు.

"సిల్క్ సూట్ లో చాలా హ్యాండ్సమ్ గా ఉన్నావు సందీప్," అని చిత్ర, "డాడి కంటే నువ్వే హీరోలా ఉన్నావు," అంటూ మామయ్య తెగ పొగిడేశారు వాడ్ని.
సభ అవగానే కుటుంబం అంతా కలిసి డిన్నర్ కి తాజ్ కి వెళ్ళాము.

"నాకు మీరు అన్న లాంటి వారు శ్యాం, చాలా గర్వంగా ఉంది," అంటూ చిత్ర అభినందించింది.
ఆనంద్ కూడా అక్కడ మ్యూజిక్ బ్యాండ్ తో కలిసి శ్యాం కోసం, ప్రత్యేకంగా ఓ చక్కని పాట పాడి శుభాకాంక్షలు తెలిపారు. ఆనంద్ బాగా పాడతారని ఈ వేళే తెలిసింది.

**
తాజ్ లో డిన్నర్ అయ్యాక ఇల్లు చేరేప్పటికి, రాత్రి పదకొండయింది.

లేట్ అయినా హోంవర్క్ చేస్తూ కూర్చున్నాడు సందీప్.
*'వాటర్ ఫర్ ఎలిఫెంట్స్'* నవల చదువుతూ, వాడి గదిలోనే నేనూ నడుం వాల్చాను.
అర్ధరాత్రి దాటాక, పడక చేరిన సందీప్, రెండే నిముషాల్లో గురక పెట్టడం మొదలుపెట్టాడు.
'బెడ్ మీద చేరడమే ఆలస్యం, మొద్దునిద్రకి పడతాడు వీడు' అనుకుంటూ, .. చదువుతున్న నవల మూసి స్టాండ్ మీద పెట్టాను....

దాహమనిపించి, గేమ్ రూంలో ఉన్న ఫ్రిజ్ లోని నీళ్ళ కోసం వెళ్లాను. షెల్ఫ్ నుండి బుక్స్ తీసుకుంటున్న శ్యాం ని గమనించనే లేదు. నీళ్ళబాటిల్ ఉంచి వెనుతిరిగేలోగా గబుక్కున దగ్గరిగా వచ్చాడు. ఉలిక్కిపడి, వడిగా అక్కడినుండి వెళ్ళబోయాను.
యేదోక నెపంతో కొద్దికాలంగా దూరంగా ఉండగలిగిన నేను, ఇలా చిక్కినందుకు ఏడుపోచ్చింది.

రెండుచేతులతో, గట్టిగా నన్ను వాటేసి అదిమి పట్టుకున్నాడు. ఆ ఉడుంపట్టు విడిపించుకోడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. నా నోరు మూసేసి, తన గది లోకి బలవంతంగా లాక్కుని వెళ్ళాడు. తలుపు గడియ వేసాక గాని నా నోటి మీది చేయి తీయలేదు.

తప్పుకొని తలుపు వైపు అడుగు వేయగానే మళ్ళీ నన్ను అడ్డుకున్నాడు. అరిస్తే, అత్తయ్య మామయ్యా, సందీప్ అంతా లేస్తారు. ఎలా? ఏం చేయాలి? అనుకుంటుండగా నన్ను గిర్రున తన వైపుకి తిప్పుకున్నాడు. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. కోపంగా ఉన్నాడు.

“ఎంత కాలం నీ మొండితనం నీలా? వేవిళ్ళు, కోపాలు, పోట్లాటలు ఇక చాలు. నా సంతోషంలో కూడా పాలు పంచుకోవా? ఈ రోజు నిన్ను వదిలేది లేదు,” అంటూ నా జుట్టు పట్టుకొని బలవంతంగా మంచం వైపు నడిపించాడు. నా నవనాడులు చచ్చిపోయాయి, ఎప్పటిలా లొంగదీసుకోబోయాడు.

మొదటిసారిగా బలంగా ప్రతిఘటించాను, పెనుగులాడాను. నా నడుం మీద ఉన్న శ్యాం అరచేతిని నారెండు చేతులతో మెలిపెట్టి వెనక్కి వంచాను. ఒక్కసారిగా నా మీద పట్టు వదిలాడు.

వెనుతిరిగి వాకిలి వైపు విసురుగా పరిగెట్టబోయిన నాకు, చీర కుచ్చెళ్లు అడ్డం పడి వాకిలి పక్కనే ఉన్న *హార్డ్ వుడ్* అల్మారా అంతే గట్టిగా తగిలింది.

అంతటి దెబ్బ తగిలిన కుదుపుకి కడుపులో తిప్పేయడం కూడా తెలుస్తుంది. తల, శరీరం మొద్దుబారిపోయాయి. నా శక్తి నంతా ఒడ్డినా, నా భర్త పైశాచికానికి బలైపోయింది నా వ్యక్తిత్వం. స్పృహ కోల్పోవడం వరకు గుర్తుంది.

**

కళ్ళు తెరవడం కష్టంగా ఉంది. ప్రయత్నిస్తే కాసేపటికి కొంచెంగా తెరవగలిగాను. మసగ్గా ఉంది. పడుకొని ఉన్నానే? టైం ఎంతయిందో? లేవాలని ప్రయత్నిస్తే, వొళ్ళు గుదిబండలా కదలడం లేదు. హాస్పిటల్లో ఉన్నానని అర్థమయ్యింది.
చేతులకి స్ట్రాపు వేసి సెలైన్ బాటిల్ కి కనెక్ట్ చేసి ఉంది. ఓ చేత్తో మొద్దుబారి నట్టనిపిస్తున్న నా ముఖాన్ని తడిమితే, పెదవులు పగిలి చిట్లినట్టుగా, కణతల మీద బాగా దెబ్బ తగిలి వాచినట్టుగా నొప్పిగా అనిపించింది. నుదిటి మీద బ్యాండేజీ వేసుంది.

కడుపు కూడా బాగా నొప్పెడుతుంది. ఏమైఉంటుంది? అనుకోగానే, నిన్న రాత్రి జరిగిన సంఘటన, నా మీద జరిగిన అత్యాచారం గుర్తుకొచ్చింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. కోపంతో కణతలు అదిరాయి.

సందీప్ ఎక్కడ? ఏమయ్యాడు? నా వెన్నెముక లోనుండి వణుకు మొదలయ్యింది. "ఎవరు అక్కడ? నర్స్, నర్స్," అని గట్టిగా అరుస్తున్నా నా గొంతు నాకే వినబడలేదు.
అసహనంగా కళ్ళు మూసుకున్నాను. దూరంగా చిత్ర గొంతు వినబడింది, ఆదుర్దాగా వాకిలి వైపు చూసాను. మరో డాక్టర్ తో కలిసి చిత్ర లోనికి వచ్చింది. వెంట ఓ నర్స్ కూడా.

"ఎలా ఉంది? ఇప్పుడు?" అంటూ చిత్ర నా దగ్గరగా వచ్చింది.

డాక్టర్ మాలిని, నా పల్స్ చెక్ చేసి, నర్స్ కి ఏవో సూచనలు ఇచ్చింది. నన్ను ఎక్జామిన్ చేసి, "చూడమ్మా, ఇప్పటికి నువ్వు ఓకే. బ్లీడింగ్ అయితే తగ్గింది. అయినా ఇంకో రెండు రోజులు వేచి చూస్తే కాని నీ గర్భం సురక్షితంగా కొనసాగుతుందో లేదో నిర్ధారించలేము.

నువ్వు రిలాక్స్ అవ్వాలి. మెట్లు ఎక్కేప్పుడు, దిగేప్పుడు జాగ్రత్తగా ఉండాలమ్మా, కడుపుతో ఉండీ అలా అర్ధరాత్రి చీకట్లో మెట్లు దిగడాలు చేయకూడదు.

అంతటి దెబ్బలకి ఇంకా నువ్వు పర్వాలేదనే చెప్పాలి. రెస్ట్ తీసుకో," అని నా చేయి తట్టి, చిత్రకి చెప్పి వెళ్ళిపోయింది డాక్టర్.

"సందీప్ ఎక్కడ? వాడిని వెంటనే చూడాలి, నేనిక్కడికి ఎప్పుడు వచ్చాను? ఎలా?" అని అడిగాను చిత్రని. నా గొంతు నాకే ఎక్కడో బావిలోలా వినిపిస్తుంది.

చిత్ర నా తల మీద చేయి వేసి నిమురుతూ, "నీలమ్మా, కడుపుతో ఉండీ, అసలు మెట్ల మీద అంత దూకుడుగా పరుగు పెట్టడం ఏమిటి? లైట్స్ కూడా వేసుకోలేదట. ఎంత ప్రమాదం తప్పిందో!

వేళకి శ్యాం అక్కడే ఉండబట్టి, నయమైంది. పడింది చెక్కరైలింగ్ మీద కాబట్టి సరిపోయింది. లేదంటే, దెబ్బలు మరింత తీవ్రంగా ఉండేవేమో," అంటుండగా చిత్ర సెల్ మోగింది.

చిత్ర చెయ్యి పట్టి వారించాను, 'ఫోన్ అలా ఉంచి ముందు నాకు ఒక కాగితం కలం ఇమ్మని, మాట్లాడలేను కాబట్టి కాగితం మీద రాస్తాను' అని సైగ చేసాను.

''సందీప్ ని వెంటనే చూడాలి. నేను ఇక్కడినుండి ఇంటికి వెళ్ళేంత మటుకు, వాడిని నీ ఇంట్లో, నీ దగ్గరే ఉండనివ్వు. వాడిని, మా ఇంట్లో ఎవ్వరూ చూసుకోలేరు.

నేనొచ్చేంత మటుకు క్యాండి, మిండీలని వాకింగ్ తీసుకొని వెళ్లే అవసరం లేదని జీవన్ కి చెప్పు. నువ్వు మాత్రం నన్ను వీలయినంత త్వరగా ఇంటికి పంపే ఏర్పాటు చెయ్యి. నన్ను అర్థం చేసుకో చిత్ర, నేను చాల క్లిష్ట పరిస్థితిలో ఉన్నాను,'' అని రాసి కన్నీళ్ళతో కాగితం చిత్రకి అందించాను.

చిత్ర చదివి గంభీరంగా అయిపోయింది. ''ఒక్క గంటలో నేను వెళ్లి వాడిని తెస్తాను, నువ్వు చెప్పినట్టే అన్నీ చేస్తాను, నువ్వు బెంగపెట్టుకోకు, త్వరలో నీ ముందుంటాను,'' అని నర్స్ చేత నాకు ఇంజెక్షన్ ఇప్పించి, వెళ్ళింది చిత్ర.

**

''మమ్మీ మమ్మీ'' అంటూ సందీప్ నన్ను తట్టి లేపుతున్నట్టయింది. కలలోలా మగతగా కళ్ళు తెరిచాను, కల కాదు, నిజంగానే సందీప్ తన చేతులతో నన్ను తడుతున్నాడు. వాడి వెనుక చిత్ర. సందీప్ ని

చూసిన నా ఆనందభాష్పాలే చిత్రకి కృతజ్ఞతలు.  నా పాలిట దేవతలా అనిపించింది.

సందీప్ ని  రెండు రోజులు తన దగ్గరే ఉంచుకుంటానని చిత్ర  అంటే అత్తయ్య కూడా సరేనన్నారంట.  క్యాండి, మిండి కూడా బాగున్నాయిట. అత్తయ్యే స్వయంగా వాటిని జాగ్రత్తగా చూసుకుంటానని కూడా అన్నారట.  ఇంకాసేపట్లో అత్తయ్య, శ్యాం, మామయ్య, హాస్పిటల్ కి వస్తారట.

చిత్ర  మాట్లాడుతుండగానే  డా. మాలిని, నర్స్ వచ్చారు.
"చాల లక్కీ నువ్వు నీల. నీ అల్ట్రాసౌండ్, బ్లడ్ రిపోర్ట్ అన్నీ క్లియర్ గా ఉన్నాయి.  ఈ క్షణం నుంచి బెడ్ రెస్ట్ తీసుకొని ఆరోగ్యం బధ్రంగా చూసుకుంటే, నీ బిడ్డ చక్కగానే ఆరోగ్యంగా పుడుతుంది.  నిన్ను రేపు పొద్దునే యింటికి పంపేయగలను," అంది ఆవిడ.

అక్కడే ఉన్న సందీప్ ని చూసి, "నీ కొడుకా? ముద్దుగా ఉన్నాడు," అని వాడి తల మీద జుట్టు చెదరగొడుతూ, "నీకింత జుట్టు ఎందుకురా?," నవ్వేసింది డా. మాలిని.
"మళ్ళీ రేపు చూస్తానమ్మా," అని చిత్రకి చెప్పి వెళ్ళిపోయింది.

కాసేపటికి అత్తయ్య, మామయ్య, శ్యాం వచ్చారు.  ఎదురుగా కూర్చున్నారు.

కాసేపు మాట్లాడి నాకు ధైర్యం చెప్పారు అత్తయ్య.

"నేను చిత్ర ఆంటీతో సినిమాకి వెళ్తున్నా. బాగా లేట్ అయితే మాత్రం రేపే వస్తా, నానమ్మ," అంటూ వాళ్ళ నానమ్మకి, డాడీకి చెప్పాడు సందీప్. నాకు దూరం నుంచే 'బై' చెప్పి, చిత్రతో వెళ్లాడు.

అత్తయ్యవాళ్ళు ఉన్నంతసేపూ, నేను నోరు మెదప లేదు.
హాస్పిటల్లో, నాకు తెలివి వచ్చినప్పటి నుండి, అలోచించాను.

కొద్దికాలంగా శ్యాంకి వీలయినంత దూరంగా మసులుకో గలిగాను. ఫలితంగా ఇలా నా పట్ల దౌర్జన్యంగా ప్రవర్తించాడు.
నా భర్త కేవలం దుర్మార్గుడే కాదు. తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకునే అతి తెలివితేటలు కూడా ఉన్న వాడని ఇప్పుడు అర్ధమయ్యింది.

ఆ రాత్రి, గాయపడి అపస్మారక స్థితిలో ఉండుంటాను. తన ఉన్మాదం తగ్గాక, నా పరిస్థితి గమనించి, భయం వేసుంటుంది నా భర్త కిరాతకుడుకి.

అర్ధరాత్రి సమయంలో ఎప్పుడో, నేను చీకట్లో గబగబా మెట్లు దిగుతూ పడిపోయానని, అందరిని నమ్మించి, నన్ను తెచ్చి హాస్పిటల్లో చేర్పించాడన్నమాట. అసలా మనిషిని ఎలా, ఏం చేయాలి? ఈ ఊబి నుండి బయట పడలేనేమో! నా చుట్టూ ఉచ్చు బిగుస్తుంది అనిపించి

బాధతో తల ముక్కలై పోయింది. నర్స్ ని పిలిచి తలపోటుకి మందిమ్మని అడిగాను.

**

హాస్పిటల్ నుండి వచ్చేసి వారం అవుతుంది.

సందీప్ కి టెన్నిస్ కోర్ట్స్ లో గాయాలయినప్పటి నుండి వాడి వద్దనే ఉంటూన్న నేను, ఇక ఇంచుమించు బెడ్ రెస్ట్ తీసుకోవలసి రావడంతో, నివాసాన్ని కిందంతస్తులోని 'కిడ్స్' రూంకి మార్చాను.

అక్కడి నుండి వెనక టెన్నిస్ కోర్ట్స్, తోట, డాగ్-హౌజ్ అన్నీ మంచి వ్యూలో ఉంటాయి. తలుపు మూస్తే ఇంటితో సంబంధం లేనంత నిశబ్దంగా ఉంటుంది ఆ గది.

**

వీలుచేసుకొని శెలవుపెట్టి, నన్ను చూడ్డానికి నాన్నా అమ్మా, వినోద్ వచ్చారు. వినోద్ కోసం ఇక్కడ కాలేజీల సమాచారం, ఎడ్మిషన్ గురించి వివరాలు తీసి పెడతానన్నారుట శ్యాం. వాడు చాలా సంతోషంగా ఉన్నాడు.

ఢిల్లీలోని కొన్ని కాలేజీ *కాంపస్* లు విజిట్ చేసి, చూసి వస్తున్నాడు.

తరుచుగా ఆనంద్, చిత్ర కాసేపు వచ్చి పోతున్నారు. ఆ సమయంలో శ్యాం ఇంట్లో ఉంటే మాత్రం చక్కగా కబుర్లు చెప్పి, బైట నుంచి ఫుడ్ ఆర్డర్ చేసి, వాళ్ళతో కలిసి భోంచేసి, సరదాగా గడుపుతారు. చిత్ర కూడా 'అన్నయ్యా' అంటూ శ్యాం తో కలుపుగోలుగా ఉంటుంది.

అత్తయ్యకి, మామయ్యకి, తన వృత్తి లోని ఆసక్తికరమైన సంఘటనలు, కొందరు మానసిక రుగ్మతతో ఎంతటి విపరీత ధోరణులు పోతారో చెబుతుంటారు ఆనంద్. ప్రతిసారి పెద్దవాళ్ళతో కాసేపు గడిపే వెళతారు వాళ్ళు.

అమ్మానాన్నలకి కూడా చిత్ర వాళ్ళతో మంచి కలక్షేపంగా ఉంది.

**

ఇంటికి వెళ్ళే ముందు, ఓ రోజు అమ్మ దగ్గర కూర్చుంది చిత్ర.

మాటల మధ్యలో, "ఏమిటి చిత్రా, మా నీలు అజాగ్రత్తగా మెట్ల మీదనుండి ఈ పడటమేమిటి? ఇంత దెబ్బలేమిటి? అయినా లోపల బిడ్డ బాగానే ఉందన్నారా? పర్వాలేదంటావా నువ్వు?" అంది కాస్త వ్యధగా.

చిత్ర నా వంక చూసింది.

"అంతా బాగానే ఉందమ్మా. నన్ను నమ్మ. చిత్ర ఆ నాలుగు రోజులు నన్ను వెన్నంటే ఉందిగా," అన్నాను.

"అవునాంటీ, ఇప్పుడు మాత్రం అంతా యదాతథం. బాగున్నట్టే లెక్క. కాబట్టి మీరు గాభరా పడవద్దు. ఇక ఈవిడ మెట్ల మీద నుండి పడటం అంటారా? అంత అజాగ్రత్త ఏమిటో ఆవిడకే తెలియాలి. అదీ ఇటువంటి సమయంలో. నేనూ అదే ప్రశ్న వేసాను," అంది గంభీరంగా చిత్ర.

**

ఎప్పుడు ఢిల్లీ వచ్చినా, ఉన్నన్ని రోజులు, మామయ్యతో కలిసి నాన్నగారు లయన్స్ క్లబ్ వారి సీనియర్ సెంటర్ కి వెళుతుంటారు.

ఈ సారి 'ఆధ్యాత్మిక చింతన' మీద నాన్నగారి లెక్చర్ కూడా ఏర్పాటు చేసారు మామయ్య.

అమ్మతో అత్తయ్యకి బాగా సఖ్యత. ఈ సారి కూడా పొద్దుటే పనులు ముగించేసి, శాంతమ్మకి, జానకికి బాధ్యతలు ఇచ్చి, మూడేసి గంటలు చిన్మయ మిషన్ కి, ఆధ్యాత్మిక లెక్చర్స్ కి వెళుతున్నారు.

**

ఆదివారం పొద్దున్న పదయ్యింది. వెనకాల గార్డెన్ లోకి వెళ్ళి, తెప్పించిన పూలమొక్కల్ని ప్రూన్ చేయించి, కొన్నింటిని భూమిలో నాటించి, లోనికి వచ్చాను.

అమ్మ, అత్తయ్య, శ్యాంతో సహా పెద్దగా మాట్లాడుకుంటున్నారు. ఆనంద్, చిత్ర కూడా వచ్చినట్టున్నారు. అంతా కలిసి, నాలుగు రోజుల్లో రాబోయే సందీప్ పుట్టినరోజు గురించి మాట్లాడుకుంటున్నారని అర్ధమయ్యింది. వాడికి ఎనిమిదేళ్ళు నిండుతాయి. ఘనంగా సెలెబ్రేట్ చేయాలనే ఉంది. అటుగా వెళ్ళి, వారిని పలకరించి, కాస్త ఎడంగా కూర్చున్నాను.

ఆనంద్ నాకు దగ్గరగా కుర్చీ లాక్కుంటూ, "నీలా, నీవు ప్రస్తుతం రెస్ట్ తీసుకోవాలి కదా! ఈ సారి సందీప్ పుట్టినరోజు మా క్లబ్ హౌజ్ లో

సెలెబ్రేట్ చేద్దాము. బాబు ఫ్రెండ్స్ లిస్టు, వారినందరిని పిలిచే పని కూడా చిత్రకి ఇప్పుడే ఇచ్చేయమ్మా.
కాంప్లెక్స్ లో 'కిడ్స్ వరల్డ్' ఉందిగా! నేను, శ్యాం కలిసి పిల్లల్ని మానేజ్ చేస్తాము." అన్నారు.

సందీప్ సంతోషానికి అవధులు లేవు.
"మమ్మీ, ఐ లవ్ యు, నువ్వు సరే అను, మమ్మీ ప్లీజ్, ఓకే నా? చెప్పు," అంటూ ఊపిరాడ నివ్వకుండా గొడవ చేస్తున్నాడు.

పూర్వపు బర్తడే సంఘటనలు, కళ్ళ ముందు గిర్రున తిరిగాయి. ముచ్చెమటలు పోశాయి. అందరి వంక ఓ సారి చూశాను. నాన్నా, వినోద్, కూడా నా దగ్గరగా కుర్చీలు తెచ్చుకొని కూర్చునారు.

"మేమంతా ఉంటాం అక్కా, క్లబ్ హౌజ్ కాబట్టి సరదాగా ఉంటుంది. నీవు హాయిగా ఓ పక్కన కూర్చుని చూడవచ్చు, సరేనా? సందీప్ బర్తడే పార్టీ అయ్యాకే నేను హైదరాబాద్ వెళతాను." అన్నాడు వినోద్.

ఆనంద్ వంక చూసాను, "సరే అన్నయ్యా, అలాగే చేద్దాం. కానీ పిల్లలకి ఎటువంటి *కాంటాక్ట్ గేమ్స్* వద్దు. వాళ్ళు కూర్చుని ఎంజాయ్ చేసేవి, క్లౌన్ షో కావాలంటే ఎరేంజ్ చేద్దాము. వీడి ఫ్రెండ్స్ ఓ పది మంది పిల్లలుండవచ్చు. ఆ కాల్స్ నేనే చేస్తా లెండి," అన్నాను సందీప్ ఉత్సాహాన్ని దృష్టిలో పెట్టుకొని.

“మా ఆఫీస్ నుండి కొన్ని ఫామిలీస్ ని నేను ఇన్వైట్ చేస్తాను. వీలైతే, ఆ టైంలో మనకి టెన్నిస్ కోర్ట్స్ ఓపెన్ ఉండేలా చూడు ఆనంద్,” అంటూ శ్యాం కూడా మా వైపు నడిచాడు.

“ఈ పార్టీ సందడితో, నీల మరీ స్ట్రైన్ అవ్వకుండా ఉంటేనే మంచిది. ఇప్పుడు బాగానే ఉంది కాని రెస్టుగా ఉండాలిగా! నిన్ననే ఐదువ నెల వచ్చింది,” అన్నారత్తయ్య.

“నేను కాసేపు పడుకుంటాను,” అని అక్కడినుండి లేచి నా గదిలోకి వచ్చాను.

నా వెనకే వచ్చిన చిత్ర, “మరిప్పుడు నీకు వొంట్లో బాగున్నట్టేనా? మనసు తేలికయిందా?” అడిగింది బెడ్ మీద కూర్చుంటూ.

**

“నేను బాగానే ఉన్నాను, నీ సంగతి చెప్పు, ఓ పాపనో బాబునో నీ వెప్పుడు కంటావు? చదువులు అయ్యాయి, ఉద్యోగాలు వచ్చాయి, ఆనంద్ కి పిల్లలంటే ఇష్టమని తెలుసు, ఇంక తమరిదా ఆలస్యం?” అంటూ వెను తిరిగి చూస్తే, తల వంచుకొని ముభావంగా అయిపోయిన చిత్ర కనబడింది.

తరచి తరచి “ఎందుకలా ఉన్నావే,” అని అడిగితే, చెమర్చిన కళ్ళతో కిటికీ బయటికి చూస్తూ, బాధతో నోరు విప్పింది.

పెళ్ళైన నాలుగేళ్ళ వరకు తనకి ప్రెగ్నెన్సీ రాకపోతే, పరీక్షలు చేయించారట. తనకి '*ఎండోమీట్రియోసిస్*' అనే కండీషన్ ఉందని, అదొక గర్భకోశ వ్యాధి అని, దానివల్లనే తను తల్లిని కాలేక పోతున్నానని చెప్పింది. కాకపోతే గత రెండేళ్లగా అంచెలంచెలగా ట్రీట్మెంట్ తీసుకుంటున్నానని కూడా చెప్పుకొచ్చింది.

"టైం పట్టినా, తప్పకుండా నేను తల్లినౌతానని నమ్మకం నాకుంది. ఆనంద్ ఎంతో ఓర్పుతో నన్ను ప్రేమగా చూసుకుంటారు. చాలా సపోర్టివ్ గా కూడా ఉంటారు. పిల్లలంటే ఆయనకీ ఎంతో ఇష్టం. సందీప్ ని సొంత బిడ్డలా ఇష్టపడతారు, చూశావుగా?" అంటూ మనసుని తేలిక చేసుకొంది చిత్ర.

"పద పద, నీ కోసం అత్తయ్య చేత మల్లెలు, జాజుల మాల కట్టిస్తాను, నీకు మునుముందు జీవితంలో అన్నీ చక్కగానే అవుతాయి," అంటూ లేచి, చిత్రని గార్డెన్ లోకి తీసుకొని వెళ్లాను.

**

చిత్రకి పిల్లలు పుట్టక పోవడం గురించి ఆలోచిస్తున్నాను రోజంతా. అందుకే నేను బిడ్డని వద్దనుకుంటున్నానని అన్నప్పుడు చిత్ర బాధపడింది. నాకు నచ్చజెప్పి నా మనసు మార్చాలని ప్రయత్నించింది.

పాపం ఆనంద్ కి పిల్లలంటే ఉన్న ఇష్టం చూస్తుంటే, వాళ్లకి సంతానం కలగకపోవడం దురదృష్టకరమే. ఒక్కోరి జీవితంలో ఒక్కో అశాంతేమో అనుకున్నాను. ఏమైనా చిత్రకి కూడా సంతానం కలగాలని ఆశిస్తాను.

**

సందీప్ పుట్టినరోజు రానే వచ్చింది. పోద్దున్నే పది గంటలకల్లా ముందుగా సాయిబాబా గుడికి వెళ్ళాము.

అక్కడ దేవుడు దర్శనం అయ్యాక, దారిలోని అనాధాశ్రమంలో పది నిముషాలు ఆగాము. సందీప్ చేత అక్కడ అనాధ పిల్లలకి, బట్టలు బొమ్మలు ఇప్పించి, లంచ్ టైంకి అందరం చిత్ర వాళ్ళ కాంప్లెక్స్ చేరాము.

**

క్లబ్ హౌజ్ ఎంతో అధునాతంగా, సౌకర్యంగా ఉంది.

'*కిడ్స్ వరల్డ్*' - అక్కడి కాంప్లెక్స్ లోని పిల్లలకి ఓ స్పోర్ట్స్ ఏరియా. దానిలో ఓ ప్రక్కన పచ్చని రబ్బర్ టర్ఫ్ వేసిన *గాల్ఫ్* గేమ్ ఏర్పాటు, అవతల క్రికెట్ ఫీల్డ్ ఉన్నాయి. మధ్యలో ప్లే- గ్రౌండ్, టెన్నిస్ కోర్ట్స్.

ఎదురుగా 'రోజ్ విల్లా' పేరుతో పార్టీ హాల్. అందుండి సన్నగా ఎం.ఎస్. సుబ్బలక్ష్మి సంగీతం వినబడుతుంది. అక్కడ సీటింగ్ ఎరేంజ్ చేస్తున్నారు.

"అటు కాదు, ఇటు రామ్మా నీలమ్మ, సందీప్ పార్టీ ఇక్కడ," అంటూ పిలిచింది చిత్ర. అందరం అటుగా మరో హాల్లోకి వెళ్ళాము.

**

పెద్ద పండుగలా జరిగింది సందీప్  పుట్టిన రోజు.  ప్రతి చిన్న విషయం ఎంతో శ్రద్ధగా నిర్వహించారు ఆనంద్, చిత్ర.

పైనాపిల్ కేక్ కట్ చేసి, లంచ్ అయ్యాక పిల్లలంతా ప్లే-గ్రౌండ్ కి బయలుదేరారు.

సందీప్ చేయి పట్టుకుని వడివడిగా వెళుతున్న వినోద్ ని పిలిచి, సందీప్ వెంటే ఉండి, ఆడించమని చెప్పాను.  మేనేజర్ గుప్తా గారితో పాటు, ఇవాళ జీవ, రాము కూడా పిల్లల వెంటే ఉన్నారు...

“చెప్పు, ఎందుకు నీకంత భయం? బాబుని కనీసం శ్యాంతో కూడా ఎక్కడికీ  వెళ్ళనివ్వవు,” అని అడిగింది నాతో పాటు వాళ్ళ వెనకే నడుస్తూన్న చిత్ర.

పిల్లలంతా *గాల్ఫ్-కోర్స్* లోకి వెళ్ళాక, అక్కడే బయట కుర్చీల్లో కూర్చున్నాము.

చిత్ర అడిగిన ప్రశ్నకు జవాబుగా ఆమె వైపు తిరిగాను.

“మరేం లేదు చిత్రా, శ్యాంతో ఆడినప్పుడల్లా,  బాబుకి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. అందుకే  బాబు తన వెంట ఉన్నా శ్యాం సరిగ్గా చూసుకోరని భయం, అంతే,” అంటుండగానే  వెనుక నుంచి ఎవరో సుతారంగా చేతులతో నా కళ్ళు మూశారు.

“ఎవరో చెప్పుకోండి,” అంటూ బాగా పరిచయమున్న గొంతేగా!

తెలిసిపోయినా ఒక్కసారిగా ఆశ్చర్యపోయాను. చేతులు తడిమాను, గాజులు, ఉంగరాలు, ఇంకా మంచి గంధం సువాసనలతో పాటు సన్న జాజుల గుబాళింపు.

“ఇంకెవరూ? నా ప్రియనేస్తం రమణి కాదా?” అని అన్నాను ఉత్సాహంగా.
“అయితే నిన్ను సర్ప్రైజ్ చేయలేక పోయామా మేము?” అన్నారు రమణి, చిత్ర ఒకేసారి.

“అలా కాదే, నీ గాజులు, ఉంగరాలు, సెంట్ సువాసనలు వేరే చెప్పాలా?”, “చాలా సంతోషంగా ఉంది నిన్ను చూడ్డం, మీ వారు కూడా వచ్చారా?” అనడిగాను.

“లేదమ్మా, నేను ఒక్కత్తినే వచ్చాను. ఆయన రాలేనంత బిజీ. నీకు ప్రత్యేక శుభాకాంక్షలు చెప్పమన్నారు విజయ్.......
చిత్ర ఇదంతా ప్లాన్ చేస్తుందని తెలుసు, మరోసారి అమ్మవి కాబోతున్నావనీ తెలుసు,” అంటూ నా వంక నిశితంగా చూసింది.

“ముదురాకుపచ్చ  జరీ చీరలో, నీ బొట్టు, నీ జుట్టు, అచ్చం పార్వతి దేవిలా ఉన్నావు, పైగా కాస్త వొళ్ళు చేసావేమో,  అందాల అమ్మంటే నువ్వే ,” అంటూ ఆగకుండా పొగిడేస్తుంది నన్ను రమణి.

“ఏయ్, దానికి దిష్టి పెట్టకు,” అంటూ చిత్ర అందుకొంది.  ముగ్గురం నవ్వుకున్నాము.

“పిల్లలు కాసేపు ఆడతారు గానీ, పద మనం వెళదాం. రమణి కూడా అందర్నీ మీట్ అవుతుంది,” అంటూ అక్కడినుండి కదిలిన చిత్రతో, మాట్లాడుకుంటూ క్లబ్ హౌజ్ వైపు నడిచాము.

**

కొద్ది నిముషాల్లో, ‘రోజ్ విల్లా’ ఫంక్షన్ హాలు ముందున్నామని, మాటల్లో పడి గమనించనే లేదు.

ఒక్కసారిగా కేరింతలు, చప్పట్లు వినబడ్డాయి.... చూస్తే, అమ్మ, అత్తయ్య మరి కొందరితో కలిసి చేతుల్లో హారతలు పట్టుకొని మరీ మాకు స్వాగతం పలుకుతూ ఎదురొచ్చారు.

శ్యాం, ఆనంద్, నాన్నగారు, మామయ్య కూడా కాస్త ఎడంగా నిలబడి ఉన్నారు.  దూరం నుండే వారు రమణి ని పలకరించారు.

రమణి, చిత్ర నన్ను నడిపించుకుని లోపలి వరకు తీసుకువెళ్ళారు.

**



అంతా కలిసి నా 'శ్రీమంతం' నిర్వహించారు. పద్ధతిగా, గాజులు వేయించారు. అమ్మ, అత్తయ్య, మిగతా పెద్దవాళ్ళ నుండి ఆశీర్వాదాలు కూడా అయ్యాయి.

అతిముఖ్యమైన అంశం అంటూ, శ్యాం చేత అక్షతలు వేయించి, మెడలో నల్ల పూసలు, పూలుదండ వేయించారు.

ఎంతో శ్రావ్యంగా సాగిపోతున్న మధురాలాపనలో అపశ్రుతి దొర్లినట్టుగా అనిపించింది, ఈ అతిముఖ్యమైన అంశం మాత్రమే. పెళ్ళైన రోజు నుంచి, నా జీవితంలో అశాంతి నింపి, నాకు, నా బిడ్డలకి అపాయాలు కల్పిస్తూ, పైశాచికంగా నాపై అత్యాచారం చేసే ఈ పెద్ద మనిషి శ్యాంకి, కనువిప్పు కలిగేలా దేవుడే బుద్ధి చెప్పాలి అనుకుంటూ, కోపంతో మౌనంగా అయిపోయాను.

**

సందీప్ పుట్టినరోజు వేడుకలయ్యాక, అలసిపోయి ఇల్లు చేరాము.
ఆ రాత్రి చిత్ర దగ్గరే ఉండి, మరునాడు ఇంటికి వచ్చింది రమణి.
రమణి ఢిల్లీ వచ్చినందుకు, అందరూ సంతోషం వెలిబుచ్చారు.

సందీప్ ని దగ్గరికి పిలిచి, "అరేయ్ హీరో, నీ బర్తడే పార్టీ కోసమే హైదరాబాద్ నుండి వచ్చాను, నాకో *హగ్, ఓ ఫ్లైయింగ్ కిస్* కావాలి," అంటూ మొహాన పడుతున్న వాడి జుట్టు పైకి తీసింది రమణి.

"మొత్తానికి, మీ ముగ్గురు తరుచుగా ఇలా కలవడం బాగుందమ్మా," అన్నారు నాన్న.

రెండు రోజులు మా ఇంట సరదాగా గడిపాక, మూడో రోజు అమ్మావాళ్ళు, రమణి అంతా తిరిగి హైదరాబాద్ వెళ్ళిపోయారు.

**

సందీప్ ని జెనరల్ చెకప్ కి, డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళ్లాను.

70% ఎదుగుదల *బ్రాకెట్* లో ఉన్నాడని చెప్పారు.

ఎడమ కన్ను 40% మాత్రమే చూపు *క్లారిటీ* ఉందనీ, కుడి కన్ను 100% క్లారిటీ ఉండడం వల్ల బాబుకి పెద్దగా ఇబ్బంది అనిపించక పోవచ్చని, ఎడమ కంటి దృష్టి మెల్లగా మెరుగయ్యే అవకాశం ఉందనీ, రిపోర్ట్ ఇచ్చారు.

సందీప్ పెరుగుదల విషయంలో మునుపటి '*గ్రోత్ ప్లేట్ ఫ్రాక్చర్*' దృష్టిలో పెట్టుకొని పిల్లల *బోన్/గ్రోత్* స్పెషలిస్ట్ ని చూడమని చెప్పారు. ఆ డాక్టర్లని చూసి, వాళ్ళ సూచనల ప్రకారం, సందీప్ పెరుగుదలకి తోడ్పడే ఆహార, హెల్త్ సప్లిమెంట్స్ విషయాలన్నీ పాటిస్తున్నాను.

స్విమ్మింగ్ అన్ని విధాల సందీప్ కి మంచి స్పోర్ట్ కాబట్టి దాన్ని కంటిన్యూ చేయించమన్నారు.

అత్తయ్యకి, మామయ్యకి సందీప్ విషయం వివరించాను. బాబుకి తగిలిన దెబ్బల వల్లే ఈ రోజు వాడి కంటి చూపుకి, వాడి పెరుగుదలకి కూడా

ఆటంకం  కలిగిందని, ఆ దెబ్బలకి కారణం బాబు తండ్రి శ్యాం అని కూడా వాళ్ళతో అన్నాను.

**

రోజ్-విల్లాలో శ్రీమంతం జరిగి, అప్పుడే దగ్గరదగ్గర నాలుగు నెలలవుతుంది.

ఒక్కింత ఆయాసం తప్పించి, అంతా బాగానే ఉన్నాను.

చెకప్ కి వెళ్ళినప్పుడు, కాస్త ముందే డెలివరీ అవ్వచ్చని అన్నారు డాక్టర్.  'అలా చూసుకున్నా, ఓ పది రోజులే టైం నా డెలివరీకి' అనుకున్నాను.

**

తెల్లారితే సంక్రాంతి అనగా, నాకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి.

సందీప్ పుట్టిన హాస్పిటల్లోనే, అందమైన పాపకి తల్లినయ్యాను. బంగారపు బొమ్మలా ఉందని శ్యాం సహా అందరూ పొంగిపోయారు.

చిత్ర, ఆనంద్ ల సంతోషాలకి అవధులు లేవు.  పాప తమ *గాడ్-చైల్డ్* అంది చిత్ర.  నాకూ వారి ఆప్యాయత కొండంత బలానిచ్చింది.

హాస్పిటల్ కి వచ్చినప్పుడల్లా  పాపని పొదవి పట్టుకుని కూర్చుంటారు శ్యాం. 'సంక్రాంతి లక్ష్మి'  పుట్టిందంటూ హాస్పిటల్లో అందరికి స్వీట్స్ పంచారు.

**



ఐదవ రోజు పాపతో ఇంటికి వచ్చాను. సి-సెక్షన్ అవడం వల్ల ఓ వారంరోజులు నాతో నర్స్ కూడా ఉండాలని డాక్టర్ ఆదేశించారు. *గ్రౌండ్ ఫ్లోర్* లో ఇప్పుడున్న గదిలోనే పాపకి *క్రిబ్* ఏర్పాటు చేయించాను.

పాపతో సాయంగా ఉంటుందని శాంతమ్మని మళ్ళీ కొలువులో పెట్టారు అత్తయ్య.

సందీప్ ని వెన్నంటే ఉంటూ, వాడి పనులు చేయడానికి విశాల అనే మరో ఆయాని పెట్టాము. *ఫుల్-టైం* వాడిని కంటికి రెప్పలా చూసుకోవడమే తన పనని బేషరతుగా సూచించాను. నా గది వెనకాలే ఉన్న *క్వార్టర్స్* లో విశాల ఉంటుంది.

పాపని ఎత్తుకోవాలన్నా, ఆడుకోవాలన్నా, నా ఎదుటే గడపేలా ఇంటిల్లిపాదికీ అలవాటు చేసాను.....
అమ్మావాళ్ళకి ప్రయాణాల ప్రయాసలు తగ్గించాలని, కొంచెం ఆగి ఒకేసారి పాప నామకరణమప్పుడు రమ్మన్నాను.

"నీకు వొంట్లో తేలికయ్యాకే, పాప నామకరణం మూడో నెలలో అయినా పెట్టుకోవచ్చు. తొందరేమీ లేదు," అన్నారు అత్తయ్య.

ఆరువారాలకి పూర్తిగా కోలుకున్నాను. కార్ డ్రైవింగ్ కూడా చేసుకోమంది డాక్టర్.

**

సాయంత్రం డిన్నర్ దగ్గర  పాప నామకరణం గురించి మాట వచ్చింది. ఇదే మంచి సమయం అనుకొన్నాను.

"చిత్ర, ఆనంద్ ఈ కుటుంబానికి  సన్నిహితులు,  నాకు చాల కావల్సిన వారు. ఆనంద్ ని అన్నయ్యలా భావిస్తున్నాను. పాపకి నామకరణం చేసే అవకాశం వాళ్ళిద్దరికి కల్పించాలని నా మనసులోని కోరిక," అంటూ అత్తయ్య వంక చూసాను.

ఐదు నిముషాలైనా, ఆ ముగ్గురిలో ఎవరు ఏమీ అనలేదు.

"ఏమంటారు? మీకు ఇష్టం లేకపోతే, సరే, మానేస్తాను. ఏదో ఒకటి చెప్పండి," అన్నాను.

"దాని దేముంది? నీ కిష్టమైతే అలాగే కానీ," అన్నారు శ్యాం.
"మీకేమన్నా అభ్యంతరమా?" అన్నాడు శ్యాం అత్తయ్యవాళ్ళతో.
అంత ఉత్సాహంగా కాకపోయినా,  "అలాగేనమ్మా, మాదేముంది! మీ ఇద్ధరూ సరేననుకుంటే, మాకేమీ పర్వాలేదు," అంది అత్తయ్య.

భోజనాలయ్యాక, నా గది లోని బాత్రూంలో కాళ్ళు  చేతులు కడుక్కొని, పాపని చేతుల్లోకి తీసుకొని, ఎదురుగా సోఫాలో కూర్చున్నారు శ్యాం.

పాపని ముద్దులాడుతూ, "అచ్చంగా నీలా అందంగా ఉంది పాప, ఏం పేరు అనుకుంటున్నావు మన పాపకి?" అంటూ నాతో మాట కలపాలని ప్రయత్నిస్తున్నారు. నేను పాప బట్టలు మడతలు వేస్తున్నాను.

"మీ ఇష్టమైన పేరుంటే చెప్పండి," అన్నాను ముక్తసరిగా.
అక్కడినుంచే, "అమ్మా, అమ్మా" అంటూ అత్తయ్యని పిలిచారు శ్యాం.
అత్తయ్య వెంటనే వచ్చారు.
"ఇలా వచ్చి కుర్చోమ్మా, పాపకి ఏం పేరు పెడదాము? నువ్వు చెప్పు," అడిగారు.

కాసేపు ఆ పేరు ఈ పేరు అనుకొని, ఇద్దరు వాదులాడుకున్నారు.
ఐదు నిముషాలకి, "నాకు, 'వేద' అనే పేరు బాగుంది, 'వేద ప్రసాద్ మధురై'. ఎలా ఉంది?" శ్యాం అడిగారు.

అప్పుడే గదిలోకి వస్తున్న మామయ్య, పేరు విని,
"నీలా, మరి నీకు నచ్చిందా పేరు?" అనడిగారు.
తడుముకోకుండా వెంటనే, "బాగుంది, అ పేరు పాపకి," అన్నాను.

చిత్ర ఆనంద్ ల చేతులమీదుగా పాప నామకరణం జరగడాన్ని ఒప్పుకోడం, గదిలోకి వచ్చి పాప పేరు గురించి మాట్లాడ్డం, నాతో సఖ్యతకి శ్యాం చేస్తున్న ప్రయత్నమేనని అర్ధమయ్యింది.

శ్యాంకి తన ప్రవర్తన సరైనది కాదని జ్ఞానోదయం అయియుండవచ్చా? అనిపించింది ఓ క్షణం....

'నాదెంతటి అత్యాశ?' నవ్వుకున్నాను మరుక్షణం..

'నా మనస్సు ఏనాడో ముక్కలైంది, కనీసం మనుగడకి అవసరమైన సరళత్వం లేని భర్తతో ఎలా పొంతన కుదుర్తుంది? లేదంటే జీవితంలోని ఎన్నో అందాలు, ఆనందాలు పరస్పరం పంచుకోవాల్సిన మనిషి కదా! నా ఖర్మ! అనుకొని నిట్టూర్చాను.

**

## 5

రాత్రి భోజనాలయ్యి, పాపని పడక మీద చేర్చాక, చిత్ర నుండి ఫోన్ వచ్చింది..

"నీలమ్మా, రేపు పొద్దున్నే మీ ఇంటికి వస్తాను. నిన్ను పికప్ చేసుకొని, నేను నిర్వహిస్తున్న 'స్త్రీ – మానోవికాసం' సెమినార్ కి వెళదాము. వీలు చేసుకొని నువ్వు నాతో తప్పక రావాలి. పాపని చూసుకోను విశాల, ఆయమ్మ కూడా ఉన్నారుగా! మూడింటికల్లా ఇంటికి వచ్చేయచ్చు," అంది చిత్ర.

ఓ క్షణం ఆలోచించాను. ఆసక్తికరంగానే అనిపించింది. పైగా నన్ను ప్రత్యేకంగా చిత్ర రమ్మంటుంది.

"అలాగే, *సౌండ్స్ ఇంటరెస్టింగ్.* పొద్దున్నే సందీప్ స్కూల్ కి వెళతాడు. నువ్వన్నట్టు పాపని అత్తయ్య, శాంతమ్మ చూస్తారు. టైం చెప్పు, తయారయి ఉంటాను," అన్నాను.

**

పొద్దున్నే చిత్ర వచ్చినప్పుడు, అత్తయ్య ముందు గదిలోనే ఉన్నారు.

"నువ్వు, ఆనంద్ - పాపకి నామకరణం చేయాలని మా అందరి కోరిక," అన్నాను చిత్రతో.

ఎగిరి గంతేసి, ఆనంద్ కి ఫోన్ చేసి చెప్పింది.

కాఫీ తాగేసి, అత్తయ్యకి చెప్పి చిత్రతో సెమినార్ కి బయలుదేరాను.

**

'రాష్ట్ర స్త్రీ-సంక్షేమ సంస్థ భవనం' లోని ఓ మీటింగ్ హాల్లో ఇరవైమంది స్త్రీలు సమావేశమయ్యారు. ఓ పక్కగా టేబిల్ మీద టీ - కాఫీ - ఫ్రూట్ పెట్టున్నాయి.

మేమెళ్లిన పావుగంటకు సమావేశం మొదలైంది.....

డాక్టర్. చిత్ర ఆనంద్ గా తనని పరిచయం చేసుకుంది చిత్ర.....

"***మీరంతా ఒకొక్కరు పది నిముషాలు తీసుకొని, ప్రస్తుతం మీ జీవితంలోని సమస్య - దాని వల్ల మానసికంగా మీలో కలిగే అలజడులు, ఇక్కడున్న మా అందరితో పంచుకోండి. సంకోచ పడవద్దు. మిమ్మల్ని ఇక్కడ విమర్శించేవారు ఉండరు. నిజానికి, మీకు సహాయ పడడానికి,***

***మీ సమస్యని ఎదుర్కొనే ధైర్యం మీలో కలగించడానికి స్త్రీ సంక్షేమ సంస్థ ప్రతినిధిలు, సిబ్బంది, నిపుణులు అందుబాటులో ఉంటారు.***

***ఓ మనస్తత్వవేత్తగా మీ సమస్యలని తప్పక నేను పరిశీలించి సహాయం చేయగలను***," అంటూ అక్కడ చేరిన వారిని ఉద్దేశించి, చర్చకి నాంది పలికింది చిత్ర.

తరువాతి గంటన్నర సేపు మాట్లాడిన పదిమంది - ఒకొక్కరుగా, తమ ఇంట సంసారం అనే ముసుగులో తామెంత క్షోభ పడుతున్నది వివరించారు. కొందరు కన్నీళ్ళ పర్యంతమయ్యారు కూడా.

కలలోనైనా ఊహించని సమస్యలతో మానసికంగా క్రుంగిపోతున్న యువతుల జీవితాల్లోకి తొంగి చూసి, వారి వ్యధలు అర్ధం చేసుకుని, వారి సమస్యలకి అద్దం పట్టిన ఆ కార్యక్రమం ఓ కనువిప్పే అనాలి...

ఆఖరున, స్త్రీ సంక్షేమ కార్యదర్శి, అందరికి కొంత సమాచారం అందించింది.

***..బాధితులు తమ సమస్యలని కూలంకుషంగా ప్రస్తావించి, పరిష్కార దిశగా నడిచేందుకు, డాక్టర్. చిత్ర ఆనంద్ ని సంప్రదించవచ్చని, బాధిత స్త్రీలకు సాంఘిక, ఆర్ధిక సహాయం కూడా సంస్థ వారు అందిస్తారని.*** ఆ సమాచార సారాంశం.

కార్యక్రమం ముగిసాక, ఇంటి దారి పట్టాము.

కారులో కూడా ఆలోచిస్తూ స్తబ్దుగా ఉండిపోయాను.

"ఏయ్ నీలు, ఆలోచిస్తున్నావా? సెమినార్ లో మాట్లాడిన యువతుల గురించే కదూ! అన్ని సమస్యలకి పరిష్కారాలు ఉంటాయి. సరయిన పరిష్కార మార్గాన్ని ఎంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలి. ఇలాంటి వారికి చేయూత నివ్వడానికే డాక్టరుగా నేను చేసే ప్రయత్నం," అంది చిత్ర.

"నేనూ ఈమధ్యనే ఇక్కడ ఈ *వాలంటరీ* సర్వీస్ మొదలు పెట్టాను. ఇవాళక్కడ మాట్లాడిన వారిలో కొందరో, అందరో, సహాయానికి నా వద్దకు వస్తారు," అంటూ మా ఇంటిముందు కారాపింది.

"ఈ కార్యక్రమంతో, ఇవాళ మరో ప్రపంచమే చూశాను," అంటూ కారు దిగాను.

"మన ప్రపంచంలో మాత్రం త్వరలో పాప నామకరణం ఉంది. చాలా *ఎగ్జైటెడ్* గా ఉంది. ఇవాల్టికి రెస్ట్ తీసుకో. బై," సాగిపోయింది చిత్ర కారు.

**

సెమినార్ వారు అందించిన హాండ్ బుక్ లో స్త్రీ సంక్షేమానికి సంబంధించిన *వెబ్సైట్స్, లింక్స్* లిస్టు ఉంది. ఎటువంటి సమాచారానికైనా, కంప్యూటర్ వాడుక తెలిసిన వాళ్ళని *ఇంటర్నెట్* వాడమని ప్రోత్సహిస్తున్నారు.

కొన్నాళ్ళుగా అనుకుంటున్నదే అయినా, ఈ సెమినార్ తరువాత, తప్పకుండా వెంటనే పర్సనల్ ల్యాప్టాప్ కంప్యూటర్ కావాలనిపిస్తుంది. కంప్యూటర్ నాకు కొత్తేమీ కాదు. దాని వాడకంలో ఇప్పటి వరకు అయితే, ఆసక్తి లేదు. ఆఫీసురూంలో ఉన్న ఒక డెస్కాప్, ల్యాప్టాప్ శ్యాం వాడుతారు.

మానేజర్ గుప్తగారికి ఫోన్ చేసి నా వ్యక్తిగత వాడుకకి ల్యాప్టాప్ కావాలని చెప్పాను. కావాల్సిన ఆప్లికేషన్స్ కూడా చెప్పాను. సందీప్ రూంలోనూ ఓ డెస్క్ టాప్ సెటప్ చేయడానికి ఏర్పాటు చేయమన్నాను.

**

పాప పుట్టాక, వొళ్ళు తేలికవ్వడానికి రెండు పూటలా నడవడం మొదలుపెట్టాను. బరువు తగ్గడానికి అమ్మ అప్పుడప్పుడు ఫోన్లో ఎన్నో చిట్కాలు చెబుతుంది. తేనె నిమ్మరసం తాగమంది. అదీ ఇదీ అన్నీ చేయడం మొదలు పెట్టాను.

ఓ పదిహేను రోజులుగా నా ఆహారంలో వచ్చిన మార్పు చూసి అత్తయ్య మాత్రం కోప్పడ్డారు.

"ఏమిటిది నీలు? అస్సలు తినడం మానేసావు. నీవేమి వొళ్ళు చేసావని, కడుపు మాడుస్తున్నావు? ఇప్పటికీ నాజుగ్గానే ఉన్నావు. బలమైన తిండి తినకపోతే, అందం చందం లేకుండా పోతుంది.

కాబట్టి, నువ్వు మంచి ఆహారం తీసుకొని, ఆరోగ్యంగా ఉంటేనే, నా మనవలు కూడా బాగుంటారు," అన్నారు పళ్ళరసం గ్లాసు నా ముందుంచుతూ.

**

రాత్రి, పాపని నిద్రపుచ్చుతుంటే నా గదిలోకి వచ్చారు అత్తయ్య.

"చూడమ్మా, పాపకి మూడో నెల వచ్చింది. ఓ వారంలో అన్ని విధాలా పాప నామకరణంకి మంచి ముహూర్తం ఉంది. మీ అమ్మ కూడా ఇక ఆగవద్దు, చేద్దామంటున్నారు. నువ్వు 'సరే' అంటే, చిత్ర వాళ్ళకి చెప్పి, ఏర్పాట్లు, పిలుపులు మొదలు పెడదాము," అన్నారు అత్తయ్య.

"అలాగే అత్తయ్యా, నాకు ఓకే. పనులు మొదలు పెడదాము," అన్నాను.

పాప ఎలాగు నిద్ర పోకుండా ఆడుతూనే ఉందని, దాన్ని విశాలకి అప్పజెప్పాను. కాసేపు అత్తయ్యతో కలిసి గెస్ట్ లిస్టు, వెంటనే మొదలు పెట్టవలసిన పనులు, పిండివంటల లిస్టు తయారుచేసాను.

**

శ్యాం ఆఫీసుకి, బాబు స్కూల్ కి వెళ్ళాక, గజేబో లో కాఫీ తాగుతూ, ఫోన్ లో రమణితో మాట్లాడుతున్నాను. అత్తయ్య హడావిడిగా నా వద్దకు వచ్చారు. ఫోన్ పెట్టేసి ఏమయిందని అడిగాను.

“సుభద్ర అని, దూరపు బంధువు. మీ మామయ్యకి అక్క వరసవుతుంది. ఈ మధ్యనే కొడుకు వాసు వద్దకి, ఇక్కడ ఢిల్లీకి వచ్చిందట. అకస్మాత్తుగా జబ్బుపడి రాత్రి ఆసుపత్రిలో చేరి, ఇందాకనే గుండెపోటుతో చనిపోయిందట.

మేమే వాళ్ళకి పెద్దవాళ్ళం. దగ్గరివాళ్ళం. అక్కడికే బయలుదేరి వెళుతున్నాము. మరి ఈ రోజు మనం చేయాలనుకున్న పనులు నువ్వు చేసేయమ్మా. మన ఫంక్షన్ కి ఎక్కువ టైం లేదు.. మేము రాత్రికి వచ్చేస్తాములే,” అంటూ అంతే హడావిడిగా వెళ్ళారామె.

‘ఓ సారి కలిసాను వాసుని, అని గుర్తు చేసుకున్నాను...

**

నాలుగు రోజుల్లో ఫంక్షన్. బాగా తెలిసిన వాళ్లనే ఆహ్వానించాము. అమ్మావాళ్ళు నామకరణం ముందు రోజు వస్తున్నారు. శలవు మీద ఊరు వెళ్ళిన విశాల కూడా ఎల్లుండి కల్లా వచ్చేస్తుంది.

పిండివంటలు, పచ్చళ్ళకి సామాను తెచ్చుకోమని జానకిని సూపర్ మార్కెట్ కి పంపాను.

జీవ, రాము చేత ముందు హాల్ నుండి బూజులు దులపడాలు మొదలు పెట్టించాను.

కేటరింగ్ వాళ్ళతో ఫైనలైజ్ చేయడానికి, వాళ్ళని రమ్మన్నాను.

అత్తయ్య అన్నీ రాసి పెట్టినా, ఆమె ఇంట్లో లేకపోవడం టెన్షన్ గానే ఉంది.

**

సాయంత్రానికి, అనుకున్న పనులు పూర్తి చేసి, పిల్లల డిన్నర్లు కూడా అయ్యేప్పటికి బాగా పొద్దుపోయింది.

అత్తయ్యావాళ్ళ కోసం ఎదురుచూస్తూ ముందుగది సర్దుతుండగా, అత్తయ్య నుండి ఫోన్. "చుట్టాలు కొందరు బయట ఊళ్ళ నుండి కూడా వచ్చారు. ఇక్కడ మేమే అన్నీ చూసి సలహాలు ఇవ్వాలి. గందరగోళ పరిస్థితిగా ఉంది. సుభద్రమ్మ 'మృతదేహాన్ని' ఇప్పటికి ఇంటికి చేర్చగలిగారు.
మేము రాత్రికి ఇక్కడే ఉండవలసి వస్తుంది. కొన్ని ఏర్పాట్లపై మాట్లాడి రేపు పొద్దున్నే వచ్చేస్తాము నీలా. నీవు, పిల్లలు జాగ్రత్త," అని ఫోన్ పెట్టేసారు అత్తయ్య.
**
పది నిముషాల్లో, ప్లే-స్టేషన్ ఆఫ్ చేసి పడుకోమని సందీప్ కి చెప్పి, పాపకి పాలు పడుతుండగా, శ్యాం వచ్చిన అలికిడయ్యింది. టేబిల్ మీద సర్దున్న భోజనం తినేసి నా గదిలోకి వచ్చారు.

అంతా నిశబ్దంగా ఉండడంతో, "పాప నిద్ర పోతుందా?" అని దాని తల నిమిరి, వెను తిరిగి పైకి తన గదిలోకి వెళ్ళిపోయారు.

సందీప్ కూడా తలుపు వేసుకొని గాఢ నిద్రలో ఉన్నాడని చూసి,... ఇంటి వెనక్కి వెళ్లాను.

వాచ్మన్ ని పిలిచి అత్తయ్యావాళ్ళు తెల్లరుఝామునే రావచ్చునని చెప్పాను.

మామూలుగా అయితే, ఈ పనులన్నీ అత్తయ్యో, మామయ్యో చేసుకుంటారు.

ఇంటిముందు తలుపులు కూడా వేసుకొని, వెనుతిరిగి నా గదిలోకి వస్తుండగా, ఎప్పుడు కిందకి వచ్చారో, శ్యాం మెట్ల నానుకొని నా దారికి అడ్డంగా చేతులు కట్టుకొని నిలబడి ఉన్నారు. పులినోట చిక్కనున్న లేడిపిల్లలా కుంచించుకు పోయాను.

అయినా ధైర్యంగా శ్యాంని దాటి గది వైపు వడిగా అడుగులేయబోయాను. తనని దాటుతుండగా, నా చేయందుకుంటే విడిపించుకున్నాను. వెంటనే జడ పట్టి విసురుగా లాగాడు. పడకుండా నన్ను ఈడ్చిన చేతినే ఆసరాగా నిలదొక్కుకున్నాను.
రెండు చేతులతో అమాంతం నన్ను ఎత్తి పదడుగుల దూరాన ఉన్న లివింగ్ రూం వరకు తీసుకెళ్ళి సోఫా మీద కుదేసాడు. పోయిన సారి ప్రతిఘటించినందువల్ల జరిగిన అనర్ధం కళ్ళ ముందు తిరిగింది.

ఇటువంటి పైశాచిక ప్రవర్తన్ని తన ప్రవృత్తిగా, ఓ అలవాటుగా మార్చుకుంటాడు శ్యాం అని ఊహించలేకపోయాను....

ఇంటి ముందు వాచ్మెన్, ఇంటి వెనకాల రాము, జీవన్. చుట్టూతా మనుషులు, మేల్కొనే ఉన్నారు. నేను అరిచినా, తిట్టినా బతుకు అప్రతిష్టపాలే. నోరు మెదపకున్నా, నా శక్తి కొద్దీ పెనుగులాడాను. లేచి పరుగెత్తబోయాను.

మళ్ళీ నా జుట్టు లంకించుకొని ఇంకా విసురుగా లాగడంతో నా కాలు కాఫీ టేబిల్ కి తగిలి అమాంతం సోఫాలోకే ఒరిగాను. పైశాచికంగా నన్ను లొంగదీసుకున్నాడు నా భర్త రాక్షసుడు. కన్నీళ్ళతో, అవమానంతో స్పృహ పోతున్నట్టుగా అనిపించింది.
...కనురెప్పలు బరువుగా మూసుకుపోతున్నాయి.
**
పాప ఏడుపుతో, ఈ లోకంలోకి వచ్చాను. అస్తవ్యస్తంగా ఉన్న నన్ను నేను కూడదీసుకొని, పైకి లేచి నా గదిలోకి పరుగెత్తాను. కుడికాలు, పాదం విపరీతమైన నొప్పిగా ఉంది. గోడ మీద క్లాక్ వంక చూసాను. టైం పన్నెండయ్యింది. లైట్ వేసి, పక్కమీద వాలి పాపని జోకొడుతూ కాలు వంక చూసుకొన్నాను. బొటను వేలు బాగా చితికి, రక్తసిక్తమైంది.

పాపని సముదాయించి, స్నానం చేసి లివింగ్ రూంలోకి వచ్చి చూస్తే, అక్కడక్కడ - సోఫా నుండి నా గది వరకు, నేను నడిచినంత మేరా దెబ్బ తగిలిన నా కాలి నుండి అంటిన అవే మరకలు. ఆ మేరకు శుభ్రం చేసి, నా కాలికి మందు వేసి కట్టు కట్టి పక్కమీదకి ఒరిగిపోయాను. అలిసిపోయిన మనస్సు, శరీరం నిద్రలోకి జారుకున్నాయి.

**

తెల్లారుఝామున ఉలిక్కిపడి  లేచాను,  పాపకి పాల టైం అయింది. పైకి లేవబోతే,  కాలు కదలనివ్వలేదు.  లాగేస్తుంది.  కూడదీసుకొని మెల్లగా లేచి వెళ్లి,  పాలు కలిపి తెచ్చి పాపకి పట్టిస్తూ, ఆలోచనలో పడ్డాను.

మేడిపండు లాంటి నా జీవితం భరించలేనట్టుగా అయిపోయింది.  నాలో ఇక ఆ ఓపిక, భయం నశిస్తున్నాయి. అసహనం, తెగింపు చోటుచేసుకుంటున్నాయి.

ఒక్క నిముషం చాలు శ్యాం అనే రాక్షసుడి నుండి విముక్తి పొందడానికి. ఆ విముక్తిలో, నా ఈ మేడిపండు జీవితం మాత్రం, సమాజంలో, లోకం దృష్టిలో శిధిలమై పోవడం ఖాయం.  దానితో పాటు  పుట్టింటి పరువు, మెట్టినింటి పరువు, పిల్లల జీవితం అన్నీ త్రిశంకు స్వర్గమే అవుతాయా?
"ఏమో!....... లేక......  అలా అని అనుకోడం కేవలం నా నిస్సహాయత, సంశయమూనా?
ఏమైనా, ఏదైనా ఓ మార్గం, శాశ్వత పరిష్కారం మాత్రం కావాలి.  పాప నామకరణం అయ్యాక ఏదో ఒకటి చేస్తాను ....లేకపోతే నేనో పిచ్చిదాన్నవుతానేమో! అల్లా అయితే, అప్పుడైనా నా పిల్లలకి పనికి రాను, వారి బాగోగులు ఎవరు చూస్తారు?....

అయినా ఇంతదూరం రానివ్వడం నాదే పొరపాటేమో,  ఆయనలోని రాక్షసత్వాన్ని ఉపేక్షించకుండా ఏదో ఒకరకంగా మొదట్లోనే

పరిష్కరించుకోవలసింది. సఖ్యతగా, ప్రేమగా చూసుకోవాల్సిన భార్యని - శారీరకంగా, మానసికంగా హింసించి, గాయ పరచడం ఎంత హేయమైనదో - సహించి, మౌనం వహించడం కూడా అంతే తప్పు.

**

కిచెన్ లో అయిన అలికిడికి ఉలిక్కిపడ్డాను. ఐదున్నరకే వంటింట్లో ఎవరై ఉండొచ్చు? మెల్లగా లేచి కదిలేప్పటికి, అత్తయ్య నా గది ముందుకి వచ్చారు. చీకటిగా ఉండడంతో, నేను నిద్ర లేచానా లేదా అని చూస్తున్నారు ఆమె.

"లేచానత్తయ్యా, రండి లోపలికి," అనడంతో చేతిలో టీ కప్పుతో, వచ్చి పాప దగ్గర కాసేపు కూర్చున్నారు. వాళ్ళ చుట్టాల విషయాలు చెప్పి, తాము తెల్లారుజామున రావడంతో, నన్ను లేపలేదన్నారు.

టీ తాగడం ముగించి, కప్పు తీసుకొని వెనుతిరిగారు.

**

నా కాలి గాయం గురించి, ఎవరికీ తెలియకుండా నామకరణం పనుల్లో మునిగిపోదాం అనుకున్న నాకు చుక్కెదురయ్యింది. పాదం నొప్పే కాదు బాగా వాపు వచ్చేయడంతో, కదలలేక, నడవలేక అయిపోయింది నా స్థితి.

అత్తయ్యకి, పనివాళ్లకి తెలిసిపోయింది. అత్తగారు హడావిడి చేసేసారు. ఆనంద్, చిత్రల వరకు వెళ్ళింది విషయం. తెలిసిన ఒక గంటకే పరుగున వచ్చారు వారు.

అసలేమయింది? ఎలా తగిలింది? అంటూ అడిగేవారే అందరూ.

నిజాన్ని కప్పిపుచ్చవలసి రావడం నా వంతయింది.

"ఏమీ లేదు. సాయంత్రం లివింగ్ రూంలో కాఫీ టేబిల్, సోఫాలు ఇవతలకి లాగించి కాస్త బూజులవీ దులిపి సర్దించాను. కాఫీ టేబిల్ మాత్రం దారికడ్డంగా ఉంచేసారనుకుంటా.

అత్తయ్యవాళ్ళు ఇంట్లో లేరుగా! అందుకే, నా వంతుగా, రాత్రయ్యాక ఇంటి వెనక నుంచి గేట్ వరకు, ఓ రౌండ్ వేసాను.

వాచ్మన్ కి చెప్పి ముందు వాకిట్లో నుండి లోనికి వస్తుంటే పాప ఏడుపు వినిపించింది. చీకట్లో చూసుకోకుండా లోపలికి పరుగు పెట్టడంతో, దారికి అడ్డంగా ఉన్న టేబిల్ గట్టిగా తగిలింది.

ప్రాణాలు పోయాయనుకోండి. కట్టు కడితే పోతుందిలే అనుకున్నాను. ఇలా అవుతుందని, అనుకోలేదు," అంటూ బాధగా నవ్వేసాను.

నర్స్ ఇంటికి వచ్చి *టెటెనస్* ఇంజెక్షన్ చేసింది. *ఇంఫెక్ట్* అవ్వకుండా డాక్టర్ రాసిన మందులు మొదలుబెట్టాను. చిత్ర దగ్గరుండి కాలి బొటనువేలు క్లీన్ చేసి బ్యాండేజీ కట్టించింది. టీ తాగుతూ పక్కనే కూర్చుంది.

"ఏమిటీ విచిత్రపు దెబ్బలు కొట్టుకోవడం? నాకు తెలిసి నువ్వు ఎప్పుడూ అజాగ్రత్తగా లేవే? ఇలా పదేపదే దెబ్బలేమిటి? నాకేమీ అర్థం అవ్వలేదు," అని నా వైపు నిశితంగా చూసింది.

“ఏదైనా ప్రత్యేక విషయముందా నీలమ్మా నీ అజాగ్రత్త  యాక్సిడెంట్ ల వెనుక?” అనేసింది చిత్ర.

“ఏముందే? నే చెప్పిందే విషయం, జరిగిన యదార్థం,”  అని మాట మార్చేసాను.

నామకరణం గురించి ప్రస్తావించి, ఆ కార్యక్రమం అంతా ప్లాన్ చేసాము. అరవై మంది వరకు అతిధులు ఉంటారని అత్తయ్య అన్నారు. ఆవిడ అతిధులకి ఇవ్వవలసిన జాకెట్టు బట్టలు, మిటాయిలు, కానుకల గురించి ప్రస్తావించారు.

ఆనంద్ చిత్రల  ఆనందానికైతే  అంతే లేదు.  ఇంట్లో వాళ్లందరికి కొత్తబట్టలు తనే తీసుకుంటాన్నారు ఆనంద్.  ఆ రోజు, హాస్పిటల్ నుంచి తమకి పిలుపులు లేకుండా, ఇద్దరూ *కవరేజ్* తీసుకొన్నారు.
భోజనాలకి మేము చేయించేవి కాక, ఏవో స్పెషల్ ఐటమ్స్ ఎక్స్ట్రాగా *కేటరింగ్* చేయిస్తాన్నారు.
**
నామకరణం రోజు రానే వచ్చింది.   నా కాలు పర్వాలేదు. నడవగలుగుతున్నాను.  అమ్మావాళ్ళు రాత్రి వచ్చారు.

ఇంటిల్లిపాదీ పొద్దున్నే లేచాము. శ్యాం, మామయ్యతో కలిసి ఇంటిముందు లాన్ లో టెంట్ వేయించే ఏర్పాట్లు చూస్తున్నారు.

పెద్దవాళ్ళు, హాల్లో పూజకి  తయారు చేస్తుంటే, మేము పిల్లల్ని తయారు చేసాము.

క్యాండి, మిండి సహా అంతా టైం కి రెడీ అయ్యాము.

ఆనంద్, చిత్ర చక్కగా తయారయ్యి తొమ్మిదికల్లా వచ్చేసారు.

**

పదిన్నరకి పూజ మొదలు పెట్టించారు అత్తయ్య.  పూజ జరిగినంత సేపూ, చిత్ర, ఆనంద్ ల వెనకే కూర్చున్నారు శ్యాం.  పంతులుగారికి అప్పుడప్పుడు కావలసినవి అందిస్తూ,  తటస్థంగానే,  అన్నిటా శ్రద్ధగా పాల్గొన్నారు.

శ్యాం ని అలా చూస్తుంటే, నా మనసులో బాధతో పాటు జాలి కూడా కలిగింది.

'నా పట్ల, సందీప్ పట్ల అతని ప్రవర్తన – సమాధానం లేని ఓ ప్రశ్నేనా! అనుకున్నాను......

**

వస్తున్న అతిధులతో మెల్లగా కిక్కిరిసింది మధ్య హాలంతా.

అనుకున్న  ప్రకారం పాపకి  'వేద'  అని పేరు పెట్టాము.

పూజయ్యాక, పెద్దవాళ్ళ ఆశీర్వాదాల తంతు ముగిసేప్పటికి ఒంటిగంటయ్యింది.

పాపని పట్టుకుని హాలు మధ్యలో కూర్చున్నారు, శ్యాం. పాప, పూర్తిగా తన పోలికే నంటూ పక్క నున్న ఫ్రెండ్స్ తో సంతోషంగా గర్వంగా మాట్లాడుతూ, మధ్యమధ్యలో పాపని నవ్వించాలని చూస్తున్నారు.

**

సందీప్ తో సహా తతిమ్మా మగవారంతా అతిథుల భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

శ్యాం కి, అతని స్నేహితులకి, కప్పుల్లో పరమాన్న ప్రసాదం అందించి, పాపని భద్రంగా పట్టుకోమని హెచ్చరించి వెనుతిరిగాను.

ప్రసాదాలు పంచడం, కానుకలు-తాంబూలాలు సర్దడం, వంటకాలు జారవేయడంలో, మేము మునిగి తేలుతున్నాము. సాయానికి ఎందరున్నా హడావిడిగానే ఉంది.

మధ్యలో ఓ సారి హాల్లో ఉన్న శ్యాం దిశగా చూసాను. తన వొళ్ళో కూర్చుని, చుట్టూ కలయజూస్తున్న పాపని పలకరిస్తూ, కుడిచేత్తో అప్పుడప్పుడు పరమాన్నం తింటున్నారు, శ్యాం.

**

మరి కాసేపటికి, ఒకళ్ళిద్దరు అతిధులు, ఇంటివాళ్ళం తప్ప అంతా వెళ్ళిపోయారు. మా భోజనాలే మిగిలాయి.

అంతా సవ్యంగానే జరిగిందిలే అని ఊపిరి తీసుకుని, అత్తయ్యకి సాయం చేయబోయాను.

“వేండ వేండ, చిన్న పొన్ను, పరమాన్నం  వేండ, అయ్యో,“ అంటూ బిగ్గరగా, మా వీధిలోనే ఉండే తాయారు మామీ గొంతు వినబడింది.
‘వద్దు వద్దు, పసిపిల్లకి పరమాన్నం పెట్టవద్దు’ అంటుందామె అని అర్ధమయ్యింది....
తిరిగి చూస్తే పదడుగుల దూరంలో ఉన్న శ్యాం వైపుగా పరుగులా నడుస్తుంది ఆమె.
గబక్కున అటుగా చూస్తే,  పాపకి నోటి దగ్గరగా, శ్యాం చేతిలో పరమాన్నం చెంచా. శ్యాం చేతుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతూన్న పాప. నా కళ్ళని నమ్మలేక ఒక్క అంగలో అక్కడ చేరాను.

పాప ఊపిరందక కాళ్ళు చేతులు కొట్టుకుంటూ, కిక్కురు మనడం లేదు. ముఖం ఎర్రగా అయిపోయి, పొలమారుతుంది.  పాలు, నీళ్ళు తప్ప మరేమెరుగని పసిదానికి పరమాన్నం తినిపించారన్నమాట.. గొంతుకడ్డం పడి, పసిది ఊపిరందక అల్లాడిపోతుంది......

శ్యాం చేతిలో చెంచా విసిరేసి, పాపని లాక్కున్నాను.

“ఎన్న శ్యాం బాబు, పసిపిల్లకు పరమాన్నం ఎప్పిడి పెడతారు,” వెనకనుండి తాయారుమామీ.

“చిత్ర, ఆనంద్, పాపని చూడండి, పాపని చూడండి,” అంటూ పాపతో గేటు వైపు పరిగెత్తుతున్న నన్ను ఆనంద్ అడ్డుకొన్నారు.  పాపని నా

చేతుల్లోంచి లాక్కుని, వెనుతిరిగి, ఇంట్లోకి దూసుకెళ్లిన ఆనంద్ ని వెంబడించాను.

వాళ్ళిద్దరూ పాపని తీసుకొని నా గదిలోకి వెళ్లారు. వారిని వెంబడించిన నన్ను గది బయటకి తోసి తలుపులు వేసింది చిత్ర. గది వెలుపల నేను, తలుపుల పైన గట్టిగా కొడుతున్నాను.

“పాపా, పాపా నా పాప,” అంటూ ఏడుస్తూ, తలుపు ముందు చతికిల పడ్డాను.

వెనుక నుండి, నా తలపై చేయి వేసిన అత్తయ్య కాళ్ళను చుట్టేసి, “చూసారా? మీ అబ్బాయి, ఏం పని అత్తయ్య? పసి పిల్లకి పరమాన్నం తినిపిస్తారా?” ఆవేశంతో వణికిపోతున్న నన్ను, అమ్మ ఓ వైపు నుండి, అత్తయ్య మరో వైపు నుండి ఆపాలని ప్రయత్నిస్తున్నారు.

మళ్ళీ తలుపు కొట్టాను. భళ్ళున తలుపులు తెరుచు కున్నాయి. ఆనంద్ చేతుల్లో, విప్పారిన కళ్ళ నిండా నీళ్ళతో ఏడుపు లంకించుకున్న పాప.

పాపని నాకందించి, “లోపలికి వెళ్ళు నీల, పాప బాగానే ఉంది ఇప్పుడు, ఏం పర్వాలేదు,” అంటూ నా గది నుండి బయటికి నడిచారు ఆనంద్.



పాపని హత్తుకొని, ఏడుస్తూనే ఉన్నాను. చిత్ర సముదాయించినా, నా దు:ఖం తగ్గలేదు. చిత్ర ఏదో చెబుతుంది, "పాప బాగానే ఉంది, కాస్త పరమాన్నం గొంతులోకి పోయి ఉక్కిబిక్కిరయ్యింది. ఇక ఏమీ పర్వాలేదు," అంటూ కర్టన్లు తెరిచి కిటికీ రెక్కలు తీసింది.

చల్లని గాలితో పాటు వెలుతురు గదిలో పరుచుకుంది.

నా పాప బతికే ఉంది. అంతే చాలు. నిద్రపోతున్న పాపని *క్రిబ్* లో పడుకో బెట్టి, చిత్ర వైపు తిరిగాను. "శ్యాం ఇలాటి పనులే చేస్తాడు చిత్రా," అంటుండగానే, తలుపు ముందు అలికిడి. ఆనంద్, శ్యాం లోనికి వచ్చారు, సందీప్ సహా.

"పాప పడుకుందా?" అడిగారు ఆనంద్.
ముభావంగా ఉన్న నన్ను చూసి, వారిలో ఎవ్వరూ ఏమనలేదు.
కాసేపటికి, "ఏం అన్నయ్యా, ఇద్దరి పిల్లల తండ్రివయ్యావు, పాలు తాగే పసిపిల్లకి పరమాన్నం పెట్టడం లాంటివి చేయకూడదని తెలియక పోతే ఎలా?" అంది చిత్ర, శ్యాంతో.

"అందుకే, శ్యాంకి చెపుతున్నాను, పిల్లలతో ఎక్కువ సమయం గడపితేనే అన్ని విషయాలు అర్ధమవుతాయని," అన్నారు ఆనంద్.

"లేదు చిత్రా, అస్సలు పాపకి అలా పొలమారతదని అనుకోలేదు," అన్నాడు శ్యాం.

“పాప ఇక నిద్ర పోతుందేమో! బయటకి వెళ్లి కూర్చుందామా అన్నయ్యా,” అంటూ వారిద్దరిని బయటికి నడిపించింది చిత్ర.

**

అడ్డాల్లో బిడ్డకి పరమాన్నం పెడితే పొలమారతదని అనుకోలేదట ఆ ఉత్తమ తండ్రి. పాపిష్టి వాడిలా అయ్యాడు శ్యాం. నా మనసులో అతనికి కనీసపు మర్యాద లేదు. నలుగురిలో ఉన్నప్పుడు, శ్యాం ప్రతి చేష్ట నాకు ఓ నాటకంలా అనిపిస్తుంది.

పాప నిదుర పోయాక, సందీప్ చేయి పట్టుకుని, గది బయటికి నడిచాను. అమ్మ లేచి ఎదురు వచ్చింది. బయటివారంతా వెళ్లి పోయినట్టున్నారు. పొద్దుటినుండి, ఉపవాసం ఉన్నానేమో, నీరసంగా తల నొప్పిగా ఉంది.

ఇంట్లో వారెవ్వరూ కూడా భోంచేసినట్టు లేరు. నన్ను తినమని వడ్డించింది అమ్మ. నాతో పాటు అందరూ భోజనానికి కూర్చున్నారు.

పసిపిల్లల గురించి తెలియక పాపకి పరమాన్నం పెట్టేశారంటూ శ్యాం పట్ల అంతా సానుభూతి చూపిస్తుంటే నాకు వొళ్ళు మండిపోయింది. మౌనంగా ఏదో తినేసి అక్కడి నుండి లేచాను.

చిత్ర, ఆనంద్ లతో పాటు ఇంటి వెనక సిట్-ఔట్ లోకి నడిచాను. కాసేపటికి ఇంటిల్లిపాదీ వచ్చి మాతో చల్లని గాలికి కూర్చున్నారు.

సందీప్, వినోద్ బాస్కెట్బాల్ ఆడతామని అటుగా వెళ్ళారు.

జరిగిన సంఘటన అమ్మా నాన్నగారికి ఆందోళన కలిగించిందని, వాడిన వారి ముఖాలే చెబుతున్నాయి. వారి అనుమానం, వ్యధ అర్థమయ్యి, వాళ్ళ దగ్గరగా కూర్చుని కాసేపు నేనే వారికి ధైర్యం చెప్పాను. నేను అన్నీ చూసుకుంటానని భరోసా పలికాను.

**

పాప రాత్రంతా దగ్గుతూ, తుమ్ముతూ బాధపడింది.

తెల్లారేసరికి జ్వరం కూడా వచ్చింది. ఊపిరందక సతమతమవుతుంది.

ఆరింటికి ముందే డాక్టర్ కి ఫోన్ చేసి హాస్పిటల్ కి తీసుకు వెళితే, ఎగ్జామిన్ చేసి ఎడ్మిట్ చేసారు.

*బేసిక్ టెస్ట్స్* చేసి, పాపకి '*రెస్పిటోరి డిస్ట్రెస్*' అన్నారు..– పొరబోయి నీరో, ఆహారమో *ట్రేకియా* లోకి వెళ్ళుంటే లంగ్స్, గొంతు *ఇరిటేట్* అయ్యుండవచ్చని తేల్చారు.

సాయంత్రం వరకు *అబ్జర్వ్* చేసి, *నెబ్యులైజర్* తో *ట్రీట్* చేసి, ఇంటికి పంపేశారు.

**

బుధవారం పొద్దుటే నా కోసం శ్యాం వాళ్ళ ఆఫీస్ నుండి 'మీనా వచ్చిందని తెలిసి, ముందు గదిలోకి వెళ్లాను. నన్ను చూస్తూనే లేచి విష్ చేసింది.

"మేనేజర్ గుప్తా గారు పంపితే వచ్చాను మేడమ్, మీకు అన్నీ లోడ్ చేసిన ల్యాప్టాప్ కంప్యూటర్ తెచ్చాను. అంతా *సెట్అప్* చేసి వెళతాను. మీకింకా ఏమి ఎప్లికేషన్స్ కావాలో, చెప్పండి," అంటూ 'లెనోవ' ల్యాప్టాప్ బాక్స్ లోంచి తీసింది మీనా.
మీనా, శ్యాం వాళ్ళ ఆఫీసులో కంప్యూటర్ స్పెషలిస్ట్.

"ఇంట్లో ఇంటర్నెట్ వాడుకకి హై స్పీడ్ కనెక్షన్ ఉంది. ఫోటోలకి పికాసా ఎప్లికేషన్స్ తో పాటు మైక్రోసాఫ్ట్ ఆఫీస్ ఉంటే చాలు," అన్నాను.
"మచ్ మోర్ ఉన్నాయి మేడమ్," అంటూ, ఇంటర్నెట్ *బ్రౌజింగ్* లో *లేటెస్ట్* విధానాలు కొన్ని చూపించి, ఇ-మెయిల్ అకౌంట్స్ సెటప్ చేసింది.

"శనాదివారాల్లో నెట్వర్కింగ్ వాళ్ళు వచ్చి, సందీప్ బాబు కోసం లేటెస్ట్ గేమ్స్ తో సహా డెస్కాప్ సెటప్ చేస్తారు మేడం. మీకు ఎప్పుడు అవసరం అయినా నన్ను పిలవండి," అని చెప్పి మీనా వెళ్ళిపోయింది.
**
ఆదివారం పొద్దున్న పది నుంచే, తాతగారితో చెస్ ఆటలో మునిగిపోయున్న సందీప్ ని చూసి, "ఈ మధ్య సందీప్ టెన్నిస్ మీద కంటే స్విమ్మింగ్, చెస్ మీద ఆసక్తి చూపుతున్నాడే!" అన్నారు అత్తయ్య కాస్త ఆశ్చర్యంగా.

సిటింగ్ రూములో, పాపని ఆడిస్తూ వాళ్ళ దగ్గరే ఉంది విశాల.
ఆనంద్, శ్యాం టెన్నిస్ ఆడుతూ కోర్ట్స్ లో ఉన్నారు.

అత్తయ్య నన్ను, చిత్రని కిచెన్ ఛాయలకి రావద్దన్నారు.
దాంతో, మేము ఇంటిముందు గార్డన్లో గజేబోలోకి వెళ్ళి కూర్చున్నాము.

"మొన్న సాయంత్రమే వెళ్ళారు అమ్మావాళ్ళు. ఈ వారం రోజుల్లో మళ్ళీ రాలేదేమని అడుగుతూ నిన్ను చాలా సార్లు జ్ఞాపకం చేసుకొంది అమ్మ," అన్నాను చిత్రతో.

చిత్ర మౌనంగా ఉంది. ఆమె వంక చూసాను.

"నా మీద అలకా? ఏమట్లా ఉన్నావు? వొంట్లో బాగోలేదా?" అన్నాను ఒకింత ఆదుర్దాగా.

తలెత్తి నా వంక సూటిగా చూసింది చిత్ర.
"నీ మీద నాకు పీకల వరకు కోపంగా ఉంది నీల. నీవు యధాలాపంగా ఒకమాట, అరమాట చెబుతున్నావు. నా మీద నీకు కాన్ఫిడెన్స్ లేకుండా పోయింది. ఆ రోజు పాపకి పొరబోయినప్పుడు నీ *రియాక్షన్*, నీ మాటలు, నీ బాధ చూసాక – నీవెంత కలత చెందుతున్నావో తెలిసింది.
మీ ఆయనకి, నీకు మధ్య మాములు కంటే ఎక్కువే సమస్యలు, సంఘర్షణలు ఉన్నాయనిపిస్తుంది. నేను నీకు సహాయ పడగలను. నమ్మకముంచి బయటపడు," అంది నాతో చిత్ర.

తల వొంచుకుని మౌనంగా ఉండడం నా వంతయ్యింది.
"నేను ఇదివరలోనే చెప్పానుగా చిత్రా. ఒత్తి మొరటు మనిషి శ్యాం. భార్యా పిల్లలతో, సరళంగా, సున్నితంగా వ్యవహరించడం అతనికి చేతకాదు. పోట్లాడినా, అలిగినా, అమ్మింటికి పారిపోయినా మనిషిలో మార్పు రాలేదు. ఏమనుకోవాలి? ఎలా వేగాలి అతనితో? అనేదే నా సమస్య," అంటూ నవ్వేసాను.
ఇద్దరి మధ్య కాసేపు మౌనం.

"క్రీడాకారులు కొందరిలో ఆ దూకుడు, కరుకుగా వ్యవహరించడం ఉంటుంది. కాని వారు బాహాటంగానే మితిమీరి ప్రవర్తిస్తే తప్ప వాళ్ళ ప్రవర్తన పై 'పైశాచికమనో, మరేదో' అనో ముద్ర వేయలేము. వారంతట వారు ఒప్పుకుంటే తప్ప వారి నడత మారడానికి *కౌన్సెలింగ్*, లేదా వైద్యం లాంటివి జరిపించలేము," అంటూ నా వంక నిశితంగా చూసింది చిత్ర.

"కానీ, నాకు ఇప్పటికి తెలిసినంతమటుకు అయితే, శ్యాంకి పిల్లలపై అతిప్రేమ ఉండి, అతి ఉత్సాహం చుపిస్తున్నట్టుగా ఉంది. ఆఫ్ కోర్స్, నువ్వు నాకు విఫులంగా కాదని చెబితే తప్ప," అంది నా చేయి తన చేతుల్లోకి తీసుకుంటూ.

అంతలో, "మమ్మీ నాకు ఆకలి. ఫిష్ నువ్వే తినిపించాలి కదా! రా," అంటూ పరుగున వచ్చాడు సందీప్.

**

అత్తయ్య ప్రత్యేకంగా  చేయించిన వంటకాలు అందరికీ ఎంతో నచ్చాయి.

భోంచేసి, సందీప్ సహా మగవాళ్ళంతా స్పోర్ట్స్ టి.వి చూస్తుంటే, అత్తయ్య కాసేపు నడుం వాల్చారు.

కిచెన్ శుభ్రం చేసి నా గదిలోకి వెళ్ళేప్పటికి, వేదని పక్కన పెట్టుకుని, చిత్ర నా ల్యాప్టాప్ మీద పనిచేస్తుంది.

నన్ను చూడగానే, చాలా ఉత్సాహంగా, "ఇదెప్పుడొచ్చిందోయ్? చాలా మంచి పని చేసావ్.  అప్పట్లో ఎంత చెప్పినా కాలేజీలో ఇ-మెయిల్ కూడా లేకుండా బతికేసావ్.

ఇది లేటెస్ట్ మాడల్ లెనోవ... బాగుంది.

మా హాస్పిటల్ వారి 'వుమన్స్ వెల్నెస్' (Woman's Wellness) అనే *ఇంటరాక్టివ్*  వెబ్-సైట్ లో నిన్ను *ఎన్రోల్* చేసాను. సభ్యత్వం ఉంటే చాలు...

'ఢిల్లీ  ఫిజీషియన్ హెల్ప్' లిస్టు లో నాపేరు ఉంటుంది.  నేరుగా నాకే మెసేజ్ పంపవచ్చు... ఒకటేమిటి *ఎవ్రితింగ్ అండ్ ఎనీతింగ్ ఎట్ యువర్ ఫింగర్ టిప్స్*...," క్షణమాగింది చిత్ర.

"సరే తల్లీ, నాకు అన్నీ ఉపయోగకరమైన పనులే చేసావు. థాంక్స్ చిత్రమ్మా," అన్నాను నవ్వుతూ.

**

# 6

విద్యావంతుడు, స్థితిమంతుడు ఐన, శ్యాం '*జెంటిల్మెన్*' నైజం ఓ ప్రక్క, నాపట్ల ప్రేమ-ఆకర్షణ ఉండి కూడా, తన అసామాన్య ప్రవర్తనతో నన్ను బాధిస్తున్న అతని తీరు మరో ప్రక్క, నన్ను నిత్యం ఆలోచింపజేస్తుంది.

ఆ ఆలోచనే నన్ను, యూనివర్సిటీ వారి -'*ఆన్-లైన్ డిగ్రీ-కాలేజ్ స్టడీ*' - దిశగా నడిపించింది.

నాకున్న బి.ఎస్.సి డిగ్రీ నేపథ్యంలో, నేరుగా 'హ్యూమన్ *సైకాలజీ* ' కాలేజ్ కోర్సులు తీసుకొంటున్నాను.

కేవలం నా వ్యక్తిగత ఆసక్తి తోనే, ఆరు నెల్లగా ఈ చదువు సాగిస్తున్నాను. ఎంత సమయం వెచ్చిస్తే అంతగా అడ్వాన్స్ అవ్వచ్చు. స్టడీ టైంని బట్టే *క్రెడిట్ అవర్స్*.

నా '*కోర్స్ ఆఫ్ స్టడీ*'గా భిన్న వ్యక్తిత్వాలు, విభిన్న ప్రవృత్తులు గురించిన వాస్తవాలు సమగ్రంగా చదువుతున్నాను. తెలుసుకొంటున్నాను.

సైకాలజీ విద్యార్థినిగా, ప్రత్యేక వెబ్-సైట్ లకి *యాక్సెస్* కూడా ఏర్పడ్డంతో, ఇటు నా చదువుకి, అటు నాకున్న ఆసక్తికి, రిసర్చ్ విషయంలో మరింత ఉపయోగంగా ఉంది.

ప్రస్తుతానికి, మా పట్ల శ్యాం ప్రవర్తన అర్ధం చేసుకొనే యత్నంలో భాగమే ఈ చదువు, పరిశోధన.

- *పదే పదే దౌర్జన్య పూరితంగా ప్రవర్తించడం, ఎక్కువుగా తన భార్యనైన నా పట్ల, లేదా పసివాళ్ళ పట్ల, లేదా మూగజీవుల పట్ల అలక్ష్యంగా మసలుకోడం, ఖతార్ లేకుండా మమ్మల్ని ఉద్దేశపూరితంగానే గాయపరచడం* - స్పష్టంగా శ్యాం ప్రవర్తనలో నాకు కనబడుతున్నాయి.

శ్యాం వ్యక్తిగా బయటికి, బయటవారికి గొప్పగా కనబడినా అతనిలో ఓ 'శాడిస్ట్' నైజం తప్పక ఉందని నా అభిప్రాయం....

శ్యాంది, పుత్రోత్సాహం అనో, అత్యోత్సాహమనో కొందరనవచ్చు.... మరి అదైనా, బిడ్డలకి తండ్రివల్ల చేటే కాదా? ...

నా దృష్టిలో, అతనికి కౌన్సెలింగ్, నిపుణుల సలహాసహకారాలు చాలా అవసరం.

అలాగని నేను శ్యాం వద్ద, ఈ విషయం ప్రస్తావించి, నిపుణుల సహాయం తీసుకోమని చెప్పే ఆశ లేదని కూడా నాకు తెలుసు.

**

ఏదైనా, ఈ అసమాన పరిస్థితి నుండి ముందు మమ్మల్ని మేము రక్షించుకోవాలంటే, ఓ ఫామిలీ లాయర్ ని సంప్రదించాలి. ఈ చుట్టుపక్కల శ్యాం పలుకుబడి ఎక్కువే కాబట్టి, కాస్త దూరంలో ఉన్న వారిని కన్సల్ట్ చేయాలని నిశ్చయించుకొన్నాను.

శ్యాం గురించి కాని, నా సమస్యల గురించి కానీ, అనుసరించబోయే న్యాయనిపుణుల సలహా విషయాలు గానీ వీలయినంత గుంభనంగా ఉంచుదామనే నా ఆశ. చిత్ర ఆనంద్ ల నుండి కూడా.

తన వృత్తినైపుణ్యంతో చిత్ర గ్రహించగలిగినంత ఎలాగు గ్రహిస్తుంది. అంతేతప్ప, అగ్నిగుండం లాంటి నా జీవితంలోని మరెన్నో వివరాలు చిత్ర ఊహించలేదనే అనుకుంటాను.

నా సమస్యల పరిష్కార దిశగా మొదటి అడుగు వేశాను.
ఆగ్రాకి వెళ్ళే దారిలో ఓ పేరున్న లాయర్ - రాఘువ శర్మ వద్ద ఎపాయింట్మెంట్ తీసుకొన్నాను. నాలుగు వారాల సమయం ఉంది.
**
తెల్లారుఝాము నుండి మళ్ళీ వేద ఊపిరందక, దగ్గుతూ బాధపడసాగింది.
పొద్దున్నే డాక్టర్ వచ్చి చూసారు... మైల్డ్ గా '*ఎలర్జిక్ బ్రాంకైటిస్*' లా ఉందని నిర్ధారించారు. పీడియాట్రిక్ నర్స్ ని పిలిపించి, ఇంటివద్దనే నెబ్యులైజర్ మాస్క్ వేయించారు... దాంతో సర్దుకుంది వేద.....
నామకరణం నాడు, పొలమారినప్పటి నుండి, పాప ఇంకా కోలుకోలేదనిపించింది. కాని ఈ స్థితి పాపకి స్వతహాగా అరోగ్యపరంగా ఏర్పడ్డ ఇబ్బందని చిత్ర వివరించింది...
పసిదాని అవస్థ నన్ను బాగా కృంగదీస్తుంది....
**

కంప్యూటర్ ని నా పరిశోధనలకే కాదు. రమణి, చిత్రలతో అప్పుడప్పుడు సుదీర్ఘ సంభాషణలకి కూడా ఉపయోగిస్తున్నాను. మా మధ్య సాగే స్నేహపూరిత సంభాషణలు, మెసేజ్ లు మనసుని తేలిక పరుస్తున్నాయి.

అత్తయ్యకి, మామయ్యకి ఇంటర్నెట్ మీద చదివిన విషయాలు, విశేషాలు చెబుతుంటాను. అత్తయ్య ఈ మధ్య కొత్త రకం వంటకాల కోసం ఇంటర్నెట్ చూడమంటున్నారు.

**

సందీప్ ఫిఫ్త్ స్టాండర్డ్ కి వచ్చాడు. కాస్త పొడవయ్యాడు. రోజు స్విమ్మింగ్ చేయమని మాత్రం ప్రోత్సహిస్తాను. అప్పుడప్పుడు నా ఎదురుగా, ఆనంద్ - శ్యాం లతో టెన్నిస్ ఆడుతాడు కూడా.

లేటెస్ట్ మెడికల్ రిపోర్ట్ ప్రకారం, వాడి ఎడమ కంటి చూపు నెమ్మదిగా మెరుగవ్వడం సంతోషంగా ఉంది. మరోప్రక్క, వేద తరచుగా ఊపిరందక బాధపడ్డం నాకు బెంగగా ఉంది.

**

ఇవాళ సోమవారం, శ్యాం చాలా బిజీగా ఉంటారు. లాయర్, రాఘువ శర్మ గారితో, నా అపాయింట్మెంట్ కూడా ఈ రోజే.

విశాలకి, అత్తయ్యావాళ్ళకి, పాప బాధ్యత అప్పజెప్పి, పొద్దున్నే సందీప్ ని స్కూల్లో దింపేసి దారి పట్టాను.

ముందు 'యానిమల్ షెల్టర్' కి వెళ్లాను. డొనేషన్ చెక్స్ బ్యాంక్ డిపాజిట్ కి పంపాను. ఎంత డొనేషన్స్ వచ్చినా మూగజీవుల పరిరక్షణకి ఇంకెంతో సహాయ సహకారాల అవసరం ఉంది.  ఈ సారి నుండి, నా వంతుగా మరింత చేయూతనివ్వాలని అనుకున్నాను.

షెల్టర్  పని కూడా రెండు గంటల్లో ముగిసింది.

అక్కడి నుంచి పావుగంటలో లాయర్ గారి ఆఫీసు చేరాను.
**
ఆయన ఆఫీసులో ఐదు నిముషాలుగా వెయిట్ చేస్తున్నాను.   కాస్త నర్వస్ గానే ఉంది.

రూం లోకి వస్తూనే, "ఏమ్మా నీలా, చాలా దూరం నుంచే వస్తున్నావు," అన్నారు...
లేచి నిలబడి నమస్కరించాను.
"కూర్చో.  కాఫీ ఏమన్నా తీసుకుంటావా?" అంటూ ఎదురుగా ఆయన సీట్లో కూర్చున్నారు  రాఘువ గారు.
హుందాగా ఉన్నారాయన.  తెల్లని జుబ్బా వేసుకొన్నారు.  నుదుటి మీద నిలువుగా విభూతి  రేఖ ఉంది.

"వద్దండీ, నీళ్ళు చాలు," అంటూ కూర్చుని, బల్లమీద మూత వేసున్న గ్లాసు నుండి కాసిన్ని మంచినీళ్ళు తాగాను.



పూర్తి వ్యక్తిగత ఘర్షణలు మినహాయించి, ఆయనతో, అన్ని విషయాలు కూలంకుషంగా మాట్లాడాను. నేను చెప్పింది ఓపిగ్గా విన్నారు. కాసేపు ఆలోచించారు. కొన్ని ప్రశ్నలు వేసి నానుండి జవాబులు రాబట్టారు.

“లీగల్ గా ఈ సమస్యకి పరిష్కారం అనేది, నీ విషయంలో అంత సులభం కాదు. ఎందుకనంటే, మానసికంగా నీ వాళ్ళతో నీవు వేరవలేవు.
కానీ బౌతికంగా నీకు వేర్పాటు కావాలి.
కాబట్టి, నీవు విడిగా ఉండాలని కోరుకుంటున్నావని, కారణాలతో, నీ భర్తతో పాటు అత్త మామలకి చెప్పాలి. ఆ ఆపైన కోర్టులో ‘*లీగల్ సెపరేషన్*’ కి ఫైల్ చేయవచ్చు,” అన్నారాయన.

“ఆఫ్ కోర్స్, వాళ్ళు ఒప్పుకుంటేనే ఫైల్ చెయ్యాలని కాదు. నీ విషయంలో, ‘విడాకులకి’ ప్రత్యామ్నాయం ‘*లీగల్ సెపరేషన్*’ అని నా అభిప్రాయం. వేరుగా ఉంటూ, సమస్య పరిష్కరించుకునే వ్యవధిని పొందవచ్చు,” ఓ క్షణం ఆగారు.

‘*లీగల్ సేపెరేషన్*’ క్రింద వేరే నివాసం ఏర్పరుచుకోవాలి. ఆర్థిక వ్యవహారాలు నిర్ధారించుకోవచ్చు. అక్కరాల అయితే, సెపెరేషన్ పిటీషన్ ఫైల్ చేసాక, విడాకులు తీసుకొనే ప్రయత్నంలో ఉన్నట్టన్నమాట. అలాగని తప్పకుండా విడాకులు తీసుకోవాలని రూల్ ఏమీ లేదు. కొంత కాలం సమస్యపై పునరాలోచన చేయొచ్చు. ఈ లోగా సమస్య

తీరిపోవచ్చు. లేదా దూరంగా ఉంటూ  కొంత సమయం వెళ్ళబుచ్చనూవచ్చు,'' అంటూ నా వంక చూశారు.

“ఇలా అయితేనే, నీకు, నీ పిల్లలకి బౌతికంగా నీ భర్త నుండి రక్షణ ఉంటుంది. అతనికి, ఓ తండ్రిగా - నిర్దిష్ట సమయాల్లో, నీ ఇష్టప్రకారం మాత్రమే, మీ పిల్లలతో మెలిగే అవకాశం ఉంటుంది,''  అని ఆయన వివరించారు.

నిముషం మౌనం తరువాత, నా వంక  నిశితంగా  చూశారు.

“నీ భర్త ప్రవర్తన ఇంత తీవ్రంగా మిమ్మల్ని బాధిస్తుంటే, ఆయన్ని ముందుగా ఫామిలీ  కౌన్సల్లింగ్ కి ఒప్పించాలి.  అవసరం మేరకు నిపుణులని సంప్రదించవచ్చు. అప్పుడు కాని నీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరక్క పోవచ్చు,'' అని నిష్కర్షగా చెప్పేసారాయన.

అన్ని విషయాలు  ఆలోచించి  మళ్ళీ  కలుస్తానని,  ఆయన  వద్ద శలవు  తీసుకొని  తిరుగు  ముఖం పట్టాను.

పెద్దాయన మంచివారిలా నా పట్ల సానుభూతితో ఉన్నారనిపించింది.

**

జనవరి నెల వచ్చేసింది. వాతావరణం చల్లగానే ఉన్నా, బాగుంది.  ఒకటి రెండు సార్లు,  వేదని చూసే నెపంతో, రాత్రి తొమ్మిదయ్యాక, శ్యాం నా గదిలోకి రావడం, నాతో మాటలు కలపడం  చేసారు.

రోజూ సాయంత్రం, హాలు మధ్యలో పాపని ఉంచి, ఇంటిల్లిపాదీ ఆడుతుంటారు. నేను వారిని గమనిస్తూ, జానకి సాయంతో వంట పని చూస్తుంటాను.

వేదతో ఆడుతున్నప్పుడు సందీప్ కి, చెల్లిని సుకుమారంగా చూసుకోవాలని సుచిస్తుంటాను.
శ్యాం కూడా ప్రతిరోజు, పాపతో కాసేపు ఆడి కబుర్లు చెప్పిగాని పైకి వెళ్ళరు.

వేద పది నెలలప్పటి నుండే అడుగులు వేస్తుండడంతో, నాతో పాటు శాంతమ్మ కూడా నిత్యం దాని వెన్నంటే ఉంటుంది.
త్వరలోనే వేద మొదటి పుట్టినరోజు కూడా.
**
ఆదివారాలు శ్యాం ఇంట్లోనే ఉండడం, చిత్ర వాళ్ళు లంచ్ కి రావడం మూలంగా, పొద్దుటి నుండే లంచ్ కి ప్రిపరేషన్ మొదలెడతారు అత్తయ్య.

ఇవాళ, చిత్ర-ఆనంద్ మామూలుకన్నా కాస్త ముందుగానే వచ్చారు. పాలక్ పనీర్, చనా-బతూర చేసి తెచ్చింది చిత్ర. నేను ఎప్పటిలా మెంతికూర కైమా, వెజిటబిల్ ఫలావ్ చేసాను. అదే చేత్తో క్యాండి మిండి లకి కూడా మట్టన్ రైస్ వండించాను.

భోజనసమయంలో వేద పుట్టినరోజు విషయం ప్రస్తావనకొచ్చింది.
నేనేమంటానోనని అంతా వెయిట్ చేస్తున్నారు.

నేను ఆలోచిస్తూ, మిన్నకుండిపోయాను.

'లీగల్ సేపరేషన్' విషయమే కాక, వేద తరుచు అనారోగ్యం పాలవడం గుర్తొచ్చి, ఏ సెలబ్రేషన్లు, ఆర్భాటాలు చేయాలనిపించలేదు.
అదే మాట బయటకి, అందరితో అన్నాను కూడా...

కాసేపు నిశ్శబ్దత తరువాత, "అలాగే నీలా, ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్యనే కేక్ కట్ చేసి *బ్లెస్సింగ్స్* తీసుకుంటుంది, మన వేద. ఈ మధ్య పాపం రెండు సార్లన్నా జబ్బుపడింది కదా! మళ్ళీ ఆ పార్టీ హడావిడి, గోల వద్దులేమ్మా," అన్నారు మామయ్య.

మిగతా వాళ్ళంతా, అర్ధం చేసుకొని మామయ్య మాటలతో ఏకీభవించారు. ఒప్పుకున్నారు.

భోజనం తరువాత, టి.వి చూస్తూ ఐస్క్రీం తింటున్నారంతా.

వాళ్ళ అపార్ట్మెంట్ కాంప్లెక్స్ ఎదురుగా కొత్తగా నిర్మాణమైన 'రిక్రియేషన్ పార్క్' లో సంక్రాంతి *కైట్-ఫెస్టివల్* ఏర్పాట్ల గురించి చెప్పసాగారు ఆనంద్.

పతంగీలు ఎగరవేయడానికి కొత్త కాన్సెప్ట్ తో భిన్న ఎత్తుల్లో వెడల్పుగా గోడలు నిర్మాణం చేసారని, అక్కడ జరగబోయే మొదటి '*కైట్ ఫెస్టివల్*

పోటీల్లో చాలామంది పాల్గొనబోతున్నారని ఆనంద్ చెబుతుంటే, సందీప్ ఉత్సాహంగా విన్నాడు.

"మేమూ ఆ కైట్-ఫెస్టివల్లో పార్టిసిపేట్ చెయ్యవచ్చా అంకుల్?" అని అడిగాడు సందీప్.

"*ష్యూర్. వై నాట్?* మన అపార్ట్మెంట్ కాంప్లెక్స్ ఎంట్రెన్స్ కి సరిగ్గా *ఆపోజిట్* ఎంట్రెన్స్ ఆ పార్క్. పతంగీలు ఎగరవేయడంలో నేను ముందుంటాను. రేపే వెళ్ళి మన పేర్లు కైట్-ఫ్లైయింగ్ కాంపిటీషన్లో రాయిస్తాను," అంటూ ఆనంద్ సరేననడంతో, తన ఫ్రెండ్స్ ని ఇన్వైట్ చేస్తానంటూ వెళ్లాడు వాడు.

అందరూ మాట్లాడుతుండగానే, అత్తయ్య ఫోన్ తీసుకొని డయిల్ చేసారు.

"హలో రాజ్యం వదినా, వేద పుట్టినరోజుకి... మన కుటుంబాలు మాత్రమే ఉంటాము. మీకు సంక్రాంతికి సెలవలు కూడా కలిసొస్తాయిగా! వేదకి అమ్మమ్మతాతయ్య ఆశీర్వాదాలు కూడా ఉండాలి మరి. ఇంకా వారం పైనే ఉంది. అన్నయ్యగారు, మీరూ, వినోద్ సహా తప్పక రండి," అంటూ, అమ్మావాళ్ళని ఆహ్వానించారామె.

హాల్లో ప్లానింగ్ అయ్యాక, నేను చిత్ర కొనసాగింపుగా పాపతో సహా నా గదిలో కబుర్లకి చేరాము.

వేదని బోర్లా వేసి నెమ్మదిగా జోకొడుతున్న నాతో,

"మన రమణి, బిడ్డల్ని అడాప్ట్ చేసుకోనే ఆలోచనలో ఉందని తెలుసా నీకు? అడిగింది చిత్ర.
లేదన్నట్టు తలూపాను.
"ఇవాళ పొద్దున్నే, నా సలహా కోరుతూ ఆ విషయం ప్రస్తావించింది," అంది.

"ఆహా, మంచిదేగా, పోయిన యేడాదే *ఫర్టిలిటీ* క్లినిక్ డాక్టర్లని సంప్రదిస్తానంది," అన్నాను.

"అవును, అదంతా అయ్యింది. ఆ *ట్రైల్స్* కూడా ఫెయిల్ అవడం వల్లే, ఇక ఆలస్యం చేయకుండా ఈ *డెసిషన్* తీసుకున్నారు," అంది చిత్ర.
**
సాయంత్రం నాలుగయ్యాక, టీ తాగి చిత్ర, ఆనంద్ వెళ్ళిపోయారు. వాళ్ళని పంపించి లోనికి వస్తూ అక్కడే ఉన్న అత్తయ్య, మామయ్య, శ్యాం ని కూడా ఉద్దేశించి, "కాసేపు విశ్రాంతి తీసుకొని ఏడు గంటల సమయంలో లివింగ్ రూంలో కలుద్దాము. మీ అందరితో ముఖ్యమైన విషయం మాట్లాడాలి," అనేసి నా గదిలోకి వెళ్ళిపోయాను.

నిద్రపోతున్న వేద పక్కన వొరిగి, కొద్ది క్షణాలు కళ్ళు మూసుకున్నాను....

శ్యాం అంటే చిరాకు, అయిష్టం తప్ప భయమేమీ లేదు. అత్తయ్య మామయ్య అంటే గౌరవం. వారి పరువు ప్రతిష్టలకి భంగం కలగకుండా, వీలయినంత సులభమైన ఓ ఏర్పాటు గురించి చెప్పడమే కదా. నా క్షేమం, నా బిడ్డల క్షేమం మాత్రమేగా నేను కోరుకునేది.

ఈ మధ్య, శ్యాం నాతో మాటలు కలపడం అదీ గమనించి, ఏదో ఒక దుర్ఘటన జరిగే అవకాశం కల్పించదలుచుకోలేదు. ఈ వేళ శ్యాంతో, అత్తయ్య మామయ్యలతో, నా 'లీగల్ సేపరేషన్' నిర్ణయం గురించి చెప్పడం మంచిదని భావించే ఇలా అందరితో మాట్లాడుతానని సూచించాను.

**

సాయంత్రమవుతుండగా కిచెన్లోకి వచ్చి, జానకితో రోటి, కర్రీ చేయించి, ఆవిడని పంపేసాను.

సందీప్ తన రూంలో కంప్యూటర్ మీద ఉన్నాడు. వేదని అక్కడే విశాలకి అప్పజెప్పాను. గది తలుపులు వేసుకోమన్నాను. ఇక డిస్టర్బ్ చేయరు.

**

శ్యాం, అత్తయ్య, మామయ్యా అంతా లివింగ్ రూం లో ఉన్నారు. వెళ్ళి వారి ఎదురుగుండా కూర్చున్నాను. ముగ్గురినీ ఉద్దేశించి, మొదటి నుంచీ నాకు వ్యక్తిగతంగా కష్టం కలిగించి బౌతికంగా బాధ కలిగించిన సంఘటనలు ఏకరువు పెట్టాను.

నేను మెట్ల మీద నుండి పడిపోయిన సంగతి ప్రస్తావించి, "అది శ్యాం చెప్పిన అబద్ధం అత్తయ్యా, ఆయన నాకు విధించిన శిక్ష. ఎన్నో సార్లు నా పై దౌర్జన్యం చేసినా, నేను ప్రతఘటించింది మాత్రం అదే మొదటి సారి. అందుకే నన్ను గాయపరిచి, నేనే జారి పడినట్టు అందరిని నమ్మించారు," అన్నాను.

"ఇక పోతే, నా బిడ్డలకి ఎన్ని సార్లు తండ్రి వల్ల హాని జరిగిందో, మీకు ప్రత్యక్షంగా తెలుసు, చూసారు కూడా," , "నిజానికి ఇప్పుడు నా జీవితాన ప్రతి నిముషం భయాందోళనలతో గడుపుతున్నాను. నా బిడ్డల క్షేమం నాకు ముఖ్యం మామయ్యా," అని ఓ క్షణం ఆగాను.

ఇదంతా వింటూ శ్యాం మాత్రం ముడి పడిన భ్రుకుటితో కిందకి చూస్తూ గంభీరంగా ఉన్నారు.

"మీకు గాని, శ్యాం కి గాని, మా కుటుంబానికి గాని 'విడాకుల' అప్రతిష్ట రాకుండా ఓ ఏర్పాటు ఆలోచించాను.  న్యాయపరంగా ఆ ఏర్పాటు ని 'లీగల్ సేపరేషన్' అంటారు.  నేను పిల్లలతో బయట వేరే ఇంట్లో ఉండవలసి వస్తుంది.
కొంత కాలం ఇలా సాగవచ్చన్నారు లాయర్.  నాకు, నా పిల్లలకి శ్యాం నుండి పూర్తి స్వేచ్ఛ, రక్షణ  మాత్రం  కోరుకుంటున్నాను.  ఆయనకి  నా మీద భర్తగా ఎటువంటి అధికారం ఉండకూడదు. దౌర్జన్యం చేసే వీలు లేకుండా ఉండాలి," అన్నాను ధృడంగా.

ఓ సారి కళ్ళెత్తి  ధైర్యంగానే శ్యాం వంక చూసాను.

“మా పిల్లలకి  కన్న తండ్రిగా ఆయన బాధ్యతలు  నిర్వహిస్తే, నాకేమీ అభ్యంతరాలు లేవు. వాళ్లకి ఓ వయస్సు వచ్చేవరకు, నా కనుసన్నలలోనే  ఆయన పిల్లలతో మెలగాలి.

నా బాధ్యతలు, మీ పట్ల గౌరవాలు అన్నీ యధాతధం.  పిల్లలు మీ కళ్ళ ముందు మీ మనమలుగానే పెరుగుతారు.

వేద పుట్టిన రోజు అవగానే ఈ ఏర్పాటు విషయమై మరిన్ని వివరాలు మీ ముందుంచుతాను.

శ్యాం కూడా సహకరించాలి.  ఈ ఏర్పాటు తనకి వద్దనుకుంటే మాత్రం, అది ఆయన ఇష్టం. కలిసి ఉండే ప్రసక్తి మాత్రం లేనట్టే,” అన్నాను.

అత్తయ్యవాళ్ళని ఉద్దేశించి, “మీరు కూడా నన్ను అర్ధం చేసుకొని సహాయ పడతారని ఆశిస్తున్నాను,”  అంటూ,  మెల్లగా పైకి లేచి, “మరో సారి టీ తాగుతారా? ఎవరన్నా?’ అంటూ అక్కడి నుండి కదిలాను.

**

.... వేద పుట్టినరోజు కోసమే అమ్మావాళ్ళు, వినోద్ ఓ రోజు ముందే వచ్చారు.

వినోద్ కి ఇంటర్మీడియట్ *కంప్లీట్* అవుతుంది.  పేరున్న యూనివర్సిటీ లో చేరాలి.  శ్యాంతో చాలా సేపూ ఆ విషయాలే మాట్లాడుతున్నాడు. మంచి  రాంకింగ్ వస్తే ఢిల్లీ కి వచ్చి చదువుకోవాలని వాడి ఆశ.

నేను లాయర్ వద్దకి వెళ్ళిన విషయం అమ్మావాళ్ళకి చెప్పాను...

**

తనతో ఎప్పుడూ ఆడుకునే ఎనిమిదిమంది ఫ్రెండ్స్ని మాత్రమే, *కైట్-ఫ్లైయింగ్* కి పిలవమన్నాను సందీప్ తో. వేద చేత పుట్టినరోజు కేక్ కట్ చేయించాక, కైట్-ఫెస్టివల్ కి వెళదామన్నాను..

రెండు రోజుల ముందు నుంచే, ఓ డజనుకి పైగా కైట్స్ తెచ్చుకుని వెనుక సిటౌట్ లో ప్రిపరేషన్ మొదలు పెట్టారు సందీప్, వాడి ఫ్రెండ్స్. వినోద్ సహా.

వాడి ఉత్సాహం చూస్తుంటే అందరికీ ముచ్చటేసింది.

వాళ్ళ పతంగీల పంపకాలు, మాంజాలు, మాటలు, ఒక రోజంతా నడిచాయి.

అత్తయ్యవాళ్ళలో కాస్త దిగులు, నైరాశ్యం తోచాయి. అమ్మతో కూడా మునపటిలా లేరు. శ్యాం అయితే, ఎవరి వంకా సూటిగా చూసి మాట్లాడ్డం కూడా లేదు. కోపంగా ముభావంగానే ఉన్నారు. అమ్మావాళ్ళు కూడా గ్రహించారు.

నేను మాత్రం ఏం చేయగలను. నాకూ దిగులుగానే ఉంది. అలాగని, స్థిరత్వం లేని ఈ బూటకపు దాంపత్యాన్ని ఎలా భరించను?...ఎందాకని, పిల్లలకి కాపలా కాస్తూ, భయపడుతూ గడపగలను? అనిపించింది.

ఈ సంఘటనలన్నీ యాదృచ్ఛికంగా జరిగాయా? నిజంగా శ్యాం అమాయకుడా? అని కూడా ఆలోచించాను. 'కాదనే' జవాబు తేలుతుంది...

నేనైనా, లేని కారణాలతో కాపురాన్ని పాడు చేసుకునేటంత అవివేకిని కాను....

**

ఎల్లుండే సంక్రాంతి, వేద బర్త్డే. ...సందీప్ కి పతంగీల రోజు....

అమ్మా, అత్తయ్యా ఏవో కొత్తరకం పిండివంటలు చేస్తున్నారు...అంతా ఎవరి కాలక్షేపంలో వాళ్ళున్నారు....

ఇవాళ పొద్దున్న నిద్రలేచిన దగ్గరినుంచి వేద చిరాగ్గా ఉంది. పాలు తాగదు, సీరియల్ తినదు...

నేనే బలవంతంగా, రెండో పూట కూడా కాసిని పాలు మాత్రం తాగించాను.

సాయంత్రం అందరితో ఆడి అలిసిపోయిందనుకున్న వేద, అర్ధరాత్రవుతున్నా నిద్ర పోదు.

.. ఎప్పటిలా ఇబ్బంది పెట్టే దగ్గుతో పాటు కొత్తగా *వీజింగ్* మొదలైంది. గాలందక తలకిందులవ్వడంతో, డాక్టర్ కి ఫోన్లు చేస్తూనే మామయ్యవాళ్ళని నిద్రలేపాను. శ్యాం తో సహా ఉన్నపళంగా హాస్పిటల్ చేరాము.

అడ్మిట్ చేసి, *బ్రాంకో డయలేటర్స్* మీద ఉంచి, కొత్త మెడికల్ టెస్టులు చేస్తున్నామన్నారు.

అక్కడే కొన్ని గంటల పాటు వెయిట్ చేసాము...
మధ్యాహ్నానికి కాని కాస్త తేలికవ్వలేదు వేద పరిస్థితి.

రిపోర్ట్స్ వచ్చాయి.
*బ్రీదింగ్ ఎయిర్ ట్యూబ్స్* లో వాపు వల్ల , *సివ్యర్ బ్లాకేజ్* ఏర్పడిందని తేల్చారు...
ఉబ్బసం (asthmatic bronchitis) వ్యాధి లక్షణాలు ఉన్నాయని తేల్చారు. వయస్సు పెరిగి, బలం పుంజుకుంటే, ఒక్కోసారి నయమయిపోతుందట. లేదంటే, పాప ఎదిగాక *ఎలర్జీ టెస్ట్స్* చేసి, సమస్యకి కారణాలు ధృవీకరించవచ్చన్నారు.
*లైఫ్ త్రటనింగ్* కాదనీ, జన్యు సంబంధిత వ్యాధి కాని, లోపాలు కానీ కనబడలేదన్నారు.
... తరుచు ఇలా అవుతుంది కనుక, *ఇంటెన్స్ ఫిజికల్ యాక్టివిటీ అవాయిడ్ చేయమన్నారు.* పాప చుట్టూ పరిసరాల్లో కెమికల్స్ లేకుండా ఉంచమన్నారు. తీసుకోగల జాగ్రత్తలు చెప్పి, మందులు రాసిచ్చారు. మరో రోజుంచి, *డిస్చార్జ్* చేస్తామన్నారు డాక్టర్.
పాపకి ప్రాణాపాయం ఏమీ ఉండదని విన్నాక కుదుటపడ్డాను..
**
మరునాడు హాస్పిటల్ నుండి ఇల్లు చేరేప్పటికి, సాయంత్రం ఏడు దాటింది. మరో రెండు సార్లు టైం ప్రకారం వేదకి మందులు వేసి పడుకునేప్పటికి, రాత్రి పదయింది.

వేద హాస్పిటల్లో ఉన్న రెండురోజుల్లో కోలుకుంది.

అలిసిపోయి నేను, వేద కూడా అడ్డంపడి నిద్రపోయాము.

**

హాల్లో హడావిడికి మెలుకువచ్చింది. అమ్మా, అత్తయ్య గదిలోకి వస్తూ కనిపించారు. బెడ్ మీద నుంచి లేవబోతే, తూలి పడబోయాను. అమ్మ సాయంతో నిలదొక్కుకుని, తిరిగి మంచం మీద కూర్చున్నాను.

"ఏమ్మా నీలా, టైం పదకొండయ్యింది. వేదకి పాలు పట్టి, మందు వేసాము.....ఇక పోతే, హాల్లో అల్లరి వినబడుతుందిగా!. సందీప్ ఫ్రెండ్స్ పది మంది వరకు వచ్చారు. మరి నువ్వు పిల్లలతో కైట్-ఫెస్టివల్ కి వెళ్ళే స్థితిలో ఉన్నావా?", "నిన్ను చూస్తే బాగా నీరస పడిపోయావు. నీ వొళ్ళు వేడిగా కూడా అనిపిస్తుంది," అడిగింది అమ్మ.

"ఏమోమ్మా! ఆలోచిస్తాను. నేను లేకుండా సందీప్ ఎక్కడికీ వెళ్ళడుగా," నా మాట నూతిలోలా వినిపించింది.

అత్తయ్య వచ్చి పక్కన కూర్చున్నారు..."చూడు నీలా, శ్యాం మీదే నీకు అపనమ్మకం అని తెలుసు. నీ కారణాలు నీకున్నాయి. నీ నిర్ణయాలతో ముందుకు సాగిపోతున్నావు. వాడినుండి పిల్లల్ని కూడా దూరంగా ఉంచబోతున్నానని నీవే అంటున్నావు. శ్యాం చాలా కుమిలిపోతున్నాడు," క్షణమాగారు.

"ఏమైనా, ఈరోజు నీ తమ్ముడు, ఆనంద్, మామయ్య, నాన్నగారు, పదిమంది పనివాళ్ళు, పిల్లల వెంట ఉన్నారు. కాబట్టి, ముఖ్యంగా సందీప్ ని నిరుత్సాహ పరచకు. వాళ్ళని వెళ్ళనివ్వు. సాయంత్రం వాళ్ళు తిరిగొచ్చాకే, పేద కేక్ కట్టింగ్ పార్టీ చేద్దామని చెప్పాను కూడా," అన్నా రత్తయ్య.. .

మౌనంగా విన్నాను. లేచి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చేలోగా, విశాల వేదని నిద్ర లేపింది.

"హలో, హలో, బర్తడే బేబీ నిద్ర లేచిందా?" అంటూ, చిత్ర గదిలోకి వచ్చి అమ్మ పక్కనే కూర్చుంది
నన్ను చూసి, జ్వరంవచ్చిన దానిలా నీరసంగా ఉన్నానంది.
ఒప్పుకున్నాను. లేచి నడిచే సత్తువ కూడా లేదన్నాను.

సందీప్ తన ఫ్రెండ్స్ తో, కైట్-ఫెస్టివల్ కి వెళ్ళడం సంగతి చిత్రతో ప్రస్తావించాను. శ్రద్ధగా విన్నది చిత్ర.

"మరేం పర్వాలేదు... మా కాంప్లెక్స్ ఎదురుగా కొత్త పార్క్ లోనేగా ఈ ఫెస్టివల్ జరుగుతుంది. ఇప్పుడు నేను, ఆనంద్ పిల్లలతో వెళతాము, పతంగీలంటే పిల్లలతో సమానంగా ఆడతాడు, ఆనంద్.
నువ్వు మా వెంట వచ్చినా మా ఫ్లాట్లో ఉంటావు. రోజంతా సందీప్ వెంట తిరగవుగా! కాబట్టి బెంగపెట్టుకోకు.

అక్కడ మరే అవసరమున్నా నేను చూసుకుంటాను. అయినా ఇంత సైన్యం ఉందిగా మన వెంట. పిల్లలు సరదాగా ఆడి వస్తారు. సరేనా?" భరోసా పలికింది చిత్ర.

మౌనంగానే విన్నాను.

"అసలు, ముందుచూపుతో, పార్టీ అదీ వద్దని నువ్వు మంచి *డెసిషన్* చేసావు, నీలమ్మా.... వేద కూడా బాగా అలిసిపోయింది. సాయంత్రం వరకు వేద, నువ్వు రెస్ట్ తీసుకోండి. దాని ఆరోగ్యం కూడా త్వరలోనే బాగయిపోతుందిలే. *సో, చీర్ అప్,"*..అంది చిత్ర..

లేచి పదమంటూ చేయందుకుంది.

హాల్లోకి నడిచాము. ఇంతటి నీరసం ఎన్నడూ అనిపించలేదు.

సందీప్ పరిగెత్తుకుని నా వద్దకు వచ్చాడు. "*టెన్ టైమ్స్* వచ్చాను మమ్మీ. నువ్వు నిద్ర పోతున్నావు. మేమంతా రెడీ. ఆనంద్ అంకుల్ కూడా వచ్చేసారు....మేమెళ్ళమా? నువ్వూ వస్తావా?" అడిగాడు.

రాలేనంటూ, వాడికి జాగ్రత్తలు చెప్పాను. వినోద్ కి, ఆనంద్ కి కూడా 'సందీప్ జాగ్రత్త' అని సూచించాను...

ఇక చేసేది లేక, నవ్వుతూ అందరికీ వీడ్కోలు పలికాను.

వేదకి తలార స్నానం చేయించి, కొత్త బట్టలు వేయించారు అమ్మావాళ్ళు. బేబీ సీరియల్ తిని విశాలతో హాయిగానే ఆడుకుంటుంది.

నేనూ కాఫీ తాగి, అమ్మావాళ్ళ బలవంతం మీద ఏదో తిన్నాననిపించాను.
తలపోటుకి మందు వేసుకుని పడుకొన్నాను.
క్షణంలో నిద్ర పట్టేసింది.
**
గాఢ నిదురలో ఉన్న నన్ను ఎవరో గట్టిగా కుదిపి లేపుతున్నారు......మగతగా కళ్ళు తెరిచాను....ఎదురుగా అత్తయ్య...
"నిన్ను అర్జంటుగా రమ్మంటున్నారు..." హైరానాగా అత్తయ్య గొంతు.

ఉలిక్కి పడి లేచి, చీర, జుత్తు సర్దుకొని బయటకి నడిచాను...
వాకిలి దగ్గర నాకోసం తచ్చాడుతూ ఆనంద్ కనబడ్డారు...

"త్వరగా పద నీలా," అంటూ వడిగా నడుస్తున్న అతన్ని అనుసరించాను.
కార్లో కూర్చుంటూ, "ఏమిటి విషయం? సందీప్, శ్యాం ఎక్కడ?" అడిగాను.
నా మనసు కీడుని శంకించింది.

"వాళ్ళంతా పార్క్ లో కదా ఉన్నారు...సందీప్ ని *ఎంకరేజ్* చేస్తూ, ఆఖరి రౌండ్ లో దగ్గరుండి ఆడిస్తున్నాడు శ్యాం. ఈ కైట్-ఫ్లయింగ్ *కాంటెస్ట్* వాళ్ళే గెలిచేలా ఉన్నారు. నేనక్కడే ఉండి చుశానుగా! సందీప్, శ్యాం - విన్నింగ్ టీమ్ అనుకో.... కాకపోతే, నాకు సైకియాట్రిక్ వార్డ్ నుండి

ఎమెర్జెన్సీ కాల్ రావడంతో అటు వెళ్లాను. మళ్ళీ ఇప్పుడే వస్తున్నా,"
క్షణమాగారు ఆనంద్...

ఇంకా ఏమి చెబుతారోనని ఊపిరి బిగబట్టి వింటున్నాను....

"ఇంతలో, చిత్ర ఫోన్ చేసింది.... సందీప్ పతంగి ఎగరవేస్తూ, కాలు జారి పడ్డంతో, దెబ్బ తగలిందట. వెంటనే అంబులెన్స్ లో అపోలోకి తీసుకెళ్లారుట శ్యాం. చిత్ర కూడా బాబు వెంటే వెళ్ళింది. అందుకే నిన్ను తీసుకొని ఇప్పుడు హాస్పిటల్ కే వెళ్లడం." అన్నాడు ఆనంద్.

నిర్ఘాంతపోయాను...అవాక్కయ్యాను....

"జరిగిన సంగతి విని నాకూ టెన్షన్ గానే ఉందమ్మా. నేనటు, వాళ్ళిటు వెళ్ళామన్న మాట," అంటుండగా, హాస్పిటల్ చేరాము.

**

# 7

కార్ పార్క్ చేసి, "పదమ్మా," అంటూ హాస్పిటల్ ఎమర్జెన్సీ వార్డ్ వైపు నడిచారు ఆనంద్. గజిబిజిగా అయిపోయిన మనస్సు, తడబడుతున్న కాళ్ళు, నీరసించిపోతున్న ఆలోచనలని కూడదీసుకొని పరుగులాంటి నడకతో అనుసరించాను.

మా కోసమే వెయిట్ చేస్తున్న శ్యాం, చిత్ర, మమ్మల్ని వెంటనే డాక్టర్ ఆఫీస్ లోకి తీసుకొని వెళ్లారు. అందరం ఆదుర్దాగా డాక్టర్ ఎదురుగా కూర్చున్నాము.

డా. విద్య ఎక్సరేలని ఎగ్జాం చేస్తుంది. ఇక ఉండలేక, "నా సందీప్ కి ఏమయ్యిందో చెప్పండి ప్లీజ్," ఆపుకోలేక ఏడ్చేసాను. చిత్ర నన్ను పొదవి పట్టుకొంది.

డా. విద్య వచ్చి మాకెదురుగా కూర్చుంది.
నా వంక సానుభూతిగా చూసింది. "మీ మనసు పడుతున్న ఆవేదన అర్థం చేసుకోగలను. కానీ బాబుకి తగిలిన దెబ్బలు మామూలివి కావమ్మా," టేబిల్ పైనున్న నా చేతిని తట్టింది, ధైర్యం చెబుతున్నట్టు....

ఆ తరువాత నేను విన్న సంగతులు నన్ను పాతాళంలోకి తోసేసాయి.

"పదడుగుల పైనుండి అదాట్టుగా పడిపోవడంతో, బయటకి కనబడే దానికన్నా తల లోపల *ఇంజ్యూరీ* వల్ల, అపస్మారక స్థితిలో ఉన్నాడు పేషంట్.

చేయవలసిన పరీక్షలన్నీ చేస్తున్నాము. రిపోర్ట్లు రావడానికి కొద్ది టైం పడుతుంది. పైగా బాబు స్పృహలోకి రావడం గురించి వేచి చూస్తున్నాము," అని ముగించింది డాక్టర్.

నేను విసురుగా లేచాను. బాబుని చూడాలన్న ఆలోచనతో బయటికి వచ్చి ఐ.సి.యు వైపు పరిగెత్తాను.

చిత్ర నా వెంటే వచ్చి, "నువ్విలా ఆవేశంగా ఉంటే బాబుకి ఏమీ లాభం లేదు. పైగా బాబు క్షేమం రీత్యా, నిన్ను దూరం నుంచే చూడనిస్తారు. కాస్త నెమ్మదిగా ఉండడానికి ప్రయత్నించు, వెళ్లి సందీప్ ని చూద్దాము," అని నా భుజాల చుట్టూ చేతులు వేసి ఐ.సి.యు కి తీసుకెళ్ళింది.

లోన గదిలో బెడ్ మీద నా బాబు చేతికి ట్యూబులు, ముఖానికి మాస్క్ వేసి ఉన్నాయి. అలా వాడిని చూసిన నాకు, వొళ్ళు తెలియని దుఃఖంతో గుండెలు అవిసిపోయి కాళ్ళు చేతులు చల్లబడ్డాయి.
వణుకుతూ, తూలి కుప్పకూలి పోవడం మినహా అటు పైన ఏమయిందో తెలియదు.
**
కళ్ళు తెరిచేప్పటికి హాస్పిటల్లోనే బెడ్ మీద ఉన్నాను. పక్కన అత్తయ్య, అమ్మ, వినోద్ ఉన్నారు. అమ్మ లేచి దగ్గరగా వచ్చింది. "ఎలా ఉందమ్మా వొంట్లో" అమ్మ అడిగినా ఏమీ మాట్లాడక కళ్ళు మూసుకున్నాను.

చిత్ర వచ్చి, నా తల మీద చేయి వేసింది, "నీ కేమీ అవ్వలేదు, ఇప్పుడు బాగానే ఉన్నావు, నిన్న సొమ్మసిల్లి పోయావు. కాస్త సెడేట్ చేసి, రెస్ట్ గా ఇక్కడే ఉంచాము," అంది.

''సందీప్ ని చూడాలి చిత్రా,'' అని మెల్లగా లేచాను.

“సరే ఇలా రా,” అని పక్కనే ఉన్న ఆఫీస్ రూం లోకి నడిపించుకు వెళ్ళింది చిత్ర. నా వెనుకే అంతా వచ్చారు. నన్ను కూర్చోబెట్టి చిత్ర నా ఎదురుగుండా కూర్చుంది.


“చూడు నీల, బాబువి కొన్ని రిపోర్ట్స్ వచ్చాయి. ఇంకాసేపట్లో, అంటే తొమ్మిదికల్లా రిపోర్ట్స్ చూసే డా. విద్య ఇక్కడికి వస్తారు. అన్ని సంగతులు వివరిస్తారు. ఆ తరువాత జరగవలసినది చేద్దాము,'' చిత్ర నాతో అంటుండగానే, గదిలోకి డా. విద్య, వెంట మామయ్య, శ్యాం వచ్చారు.

అప్పటికి చేతికందిన రిపోర్ట్స్ ఆవిడ చదివి, ఎక్స్రేలు చూపించారు. నేను పెదవి విప్పకుండా, కన్ను ఆర్పకుండా ఉన్నాను.

ఆ రిపోర్టులని బట్టి, సందీప్ అదే అపస్మారక స్థితిలో ఉన్నాడని తేల్చింది. ''పేషంట్ పరిస్థితిలో మార్పు లేదు. వైటల్స్ తో పాటు మిగతా ప్రమేయాలన్నీ స్టేబుల్ గా ఉన్నాయి,'' అన్నారు విద్య.

యేదైనా, రావల్సిన మరిన్ని రిపోర్ట్స్ ని కూడా న్యూరోసర్జన్ పరిశీలించాకే, అసలు పరిస్థితి తెలుస్తుందని ఆవిడ వివరించింది.

**


ICU

ఎవరితో ఏమీ అనకుండా లేచి, ఐ.సి.యు కి వెళ్లి సందీప్ ని బయట నుండే చూసాను. 'నన్ను క్షమించు బాబు, నా కడుపు విషం రా, జన్మ నైతే ఇచ్చి, నిన్ను కంటికి రెప్పలా చూసుకున్నానని అనుకున్నానే గాని, నిజానికి నేనే నీ జీవితానికి ముప్పునిరా..కన్నా', 'నన్ను క్షమించు బాబు' అని మనసులోనే వాడిని వేడుకున్నాను. ఆగని కన్నీటిని తుడుచుకొని బయలుదేరాను.

నా కోసం ఆమడ దూరంలో వెయిట్ చేస్తున్న వినోద్, చిత్ర, ఆనంద్ ల వద్దకు వెళ్లాను. చిత్ర నడిగి కాస్త క్యాష్ తీసుకొని బయలుదేరాను.
"ఆగమ్మా, ఎక్కడికి? నేను తీసుకెళతాను, ఒక్కదానివి వెళ్ళద్దు," అంటూ నన్ను అనుసరించారు ఆనంద్.

సరేనని, ఎక్కడికి వెళ్ళాలో చెప్పి, చిత్ర కార్ లో జారిగిల పడ్డాను. ఆనంద్ ని హాస్పిటల్లోనే ఉండమంది చిత్ర. వెనక సీట్లో వినోద్ ఎక్కాక, తానే కార్ డ్రైవ్ చేయసాగింది.
**

***లాయర్ గారి ఆఫీసు….***

టైం పొద్దున్న పదకొండు గంటలు. వినోద్, చిత్రలతో పాటుగా, సీనియర్ అడ్వకేట్ రాఘువ శర్మ గారి ఆఫీస్ ఎదుట మౌనంగా వెయిట్ చేస్తున్నాను.

పది నిముషాలకి ఆఫీస్ రూంలోకి వెళ్ళి ఆయన్ని కలిశాము.

నన్ను చూస్తూనే, "ఏమిటమ్మా? ఫోన్ కూడా లేకుండా వచ్చావు? ఏమి సంగతి? నీ ఆరోగ్యం బాగుందా?" అన్నారాయన నా వంక నిశితంగా చూస్తూ.

ఆపుకోలేని కన్నీరు, చేసుకున్న నిర్ణయాలతో బండబారి పోయింది గుండె. ఓ క్షణం మనసు కూడదీసుకొని, "శర్మ గారు, మీకు నా పరిస్థితి ఇదివరలోనే చెప్పాను. నేను పోయిన వారమే, మా ఇంట్లో వాళ్లకి సంగతి వివరించి, 'లీగల్ సెపరేషన్' గురించి చెప్పాను." అంటూ ఆగాను.

"ఆ మేరకు అవసరమైన పేపర్ వర్క్ కానివ్వండి," గట్టిగా ఊపిరి తీసుకున్నాను.

"మా బాబు సందీప్ మళ్ళీ గాయపడ్డాడు. శ్యాం వల్ల. ప్రతిసారి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పసివాడి చావుదెబ్బలకి కారణమౌతున్నది వాడి తండ్రే. విచక్షణ లేకుండా పసివాణ్ణి పదేపదే అలివికాని వాటికి నెడుతుంటారు. ఈ సారైతే, వాడు బతుకుతాడో లేదో కూడా తెలియదు. హాస్పిటల్లో కోమాలో ఉన్నాడు. నాకు, నా బిడ్డలకి నా భర్త నుండి పూర్తి విముక్తి వెంటనే కావాలి సార్." అంటూ చేతులు జోడించి వేడుకున్నాను.

**

శర్మగారు అంతా విన్నారు. పక్కనే కూర్చున్న చిత్రని, దూరంగా వెనకాల కూర్చున్న వినోద్ ని చూసి, "వీరెవరు?" అని అడిగారు.

"ఈమె నా ఫ్రెండ్ డా. చిత్ర, వీడు నా తమ్ముడు వినోద్. నేను మీకు చెప్పిన కొన్ని సంఘటనలకి వీడు ప్రత్యక్ష్య సాక్ష్యం కూడా. ఇక వీళ్ళ నుండి నా విషయం దాచవలసిన అవసరం లేదు, శర్మ గారు," అన్నాను.

"సరే అయితే, *పిటీషన్* వెంటనే *ప్రిపేర్* చేద్దాం. ఆ పిటీషన్ లో అన్ని కోణాలు కవర్ చేయవచ్చు, మళ్ళీ ప్రత్యేకించి నీ భర్త నుండి, పిల్లలకి *ప్రొటెక్షన్* కోరడం అనవసరం," వివరించారు శర్మ గారు..

ఓ క్షణం ఆగి, ఫోన్లో సెక్రెటరీని పిలిచారు డాక్యుమెంటేషన్ కి.

నా వంక చూస్తూ, "చూడు నీల, పక్కన కాన్ఫరెన్స్ రూంలో కూర్చుని, మొదటి నుంచి నీవు నాకు చెప్పిన విషయాలన్నీ డాక్యుమెంట్ చేయించు. నాకు కావలిసిన మిగతా *డీటైల్స్* నేనే తీసుకుంటాను.
ఈలోగా నీ పరిస్థితులు మారి, నీ ఆలోచనలో మార్పు వస్తే నాకు చెప్పవచ్చు. నీ విషయమై నా ఫ్రెండ్, ఓ పోలీస్ ఆఫీసర్ని కూడా సంప్రదిస్తాను, సరేనా? ఇక డాక్యుమెంట్ చెయ్యి. వెళ్ళండి," అన్నారాయన ఫోన్ అందుకుంటూ.

మేమంతా కాన్ఫెరెన్స్ రూం లో కూర్చున్నాము. చిత్ర వంక చూసాను, దాని ముఖాన ఎన్నో ప్రశ్నలు, మరెన్నో అనుమానాలు. నేను ఔనన్నట్టు తలాడించాను. ఇంతలో, సందీప్ విషయంగా చిత్రకి ఫోన్ వచ్చింది. మరునాడు పొద్దున్నే ఎనిమిదింటికి న్యూరోసర్జన్ తో మీటింగ్ అని తెలియజేశారు.

మరో ఐదు నిముషాల్లో సెక్రెటరీ వచ్చి ల్యాప్టాప్ కంప్యూటర్ బల్ల మీద ఉంచి, మా ముగ్గురికీ నీళ్ళ బాటిల్స్ అందించి ఎదురుగా కూర్చున్నాడు.

పదేళ్ళగా నా జీవితాన జరిగిన సంఘటనలు ఒక్కోటి చెప్పవలసినంత చెప్పాను. అవసరమైన వివరాలతో సహా. తనెదురుగా, సందీప్ గాయపడ్డ సంఘటనలని వినోద్ చేత చెప్పించాను.

అంతా అయ్యాక నా వంక తిరిగాడు వాడు. ''పోతే అక్కా, పతంగీలు ఎగర వేస్తూ, అందరం అక్కడే ఉన్నాము. లీడ్ లో ఉన్న మన సందీపే గెలవాలని, వాడి తో పాటు బావ కూడా పట్టుదలగా ఉన్నారు.
*లాస్ట్ - విన్నింగ్ రౌండ్* లో పదడుగుల ఎత్తున్న గోడ మీదకి సందీప్ తో శ్యాం బావ వెళ్లారు.
కిందనుండి ఫాలో అవుతూ మేమంతా ఎంకరేజ్ చేస్తూనే ఉన్నాము.... ఎవరూ అనుకోని విధంగా, త్రుటిలో జరిగింది వాడు పైనుండి పడిపోవడం. ప్రమాదవశాత్తు జరిగిందక్కా,'' అంటూ బాధ పడ్డాడు. కాసేపు మౌనంగా ఉండిపోయాము.

అక్కడి నుంచి విషయమంతా చిత్ర కి కూడా తెలుసునన్నాడు.

"ఆ వెంటనే వీడు ఫ్లాట్ కి ఫోన్ చేసి నాకు సంగతి చెప్పాడు. బాబు పరిస్థితి చూసి ఆంబులెన్స్ పిలిపించాము. ఎలాగూ ముందు చేయవలసింది బాబుకి వైద్యం కాబట్టి, వాడితో మేమంతా హాస్పిటల్ కి వెళ్ళాము. మీ నాన్నగారు, మామయ్యగారు కూడా వెనకాలే వచ్చారు," చెబుతూ కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యింది చిత్ర.

దుఃఖాన్ని దిగమింగుకొని, "అంతకు ముందే ఆనంద్ ఎమెర్జెన్సీగా హాస్పిటల్ కి వెళ్లవలసి వచ్చింది. పని చూసుకొని తిరిగి వస్తూ, ఫోన్ మీద కనక్ట్ అయ్యారు. ఇక చేసేది లేక, నీకు చెప్పే ధైర్యం లేక, నిన్ను హాస్పిటల్ కి తీసుకురమ్మని ఆనంద్ కి చెప్పాను. ఇదిరా జరిగింది, చాలా బాధగా ఉంది నీలా ఇదంతా నాకు," అంటూ చిత్ర వాపోయింది.

**

సాయంత్రం నాలుగయ్యింది. అప్పటి వరకు వినోద్, చిత్ర చెప్పినది కూడా డాక్యుమెంట్ చేసాడు లాయర్ గారి సెక్రటరీ.

డాక్యుమెంటేషన్ను ముగించి సెక్రెటరీ లోనికి వెళ్లగానే, "నీలా ఏమిటిదంతా? నీ జీవితం అగ్నిగుండంలా ఉంది. ఇదంతా నిజమా! అని ఆశ్చర్యంగా ఉంది," అన్నది చిత్ర ఆదుర్దాగా.

"ఇన్నాళ్ళగా రాజీ పడి జీవితాన్ని నెట్టుకొస్తున్నందు వల్లనే ...ఇప్పుడిక ఇలా అర్థంలేని విధంగా తయారయింది...," అన్నాను నిర్లిప్తంగా.

ఇంతలో సెక్రెటరీ వచ్చి, మేమింక వెళ్లవచ్చని, లాయర్ గారు ఫోన్ చేస్తారని చెప్పాడు.

**

మరునాడు రిపోర్ట్స్ వచ్చాక డాక్టర్లు ఏమంటారో అన్న టెన్షన్ తోనే, హాస్పిటల్లో ఆ రాత్రి గడిపాను.

**

పొద్దున్నే ఆనంద్, చిత్రలతో పాటు వెళ్ళి, సందీప్ రిపోర్ట్స్ పరిశీలిస్తున్న న్యూరోసర్జన్ డా. నిఖిల్ ఇనాందార్ ని కలిసాము.

అరగంటలో మమ్మల్ని పేషెంట్ ఏరియాకి రమ్మన్నారు.

ఆత్రుతగా అక్కడికి వెళ్ళి కూర్చున్నాము.

కాసేపటికి, రిపోర్ట్స్ చేత పుచ్చుకుని వచ్చారాయన. ప్రశాంతంగానే ఉన్నారు.

అదృష్టవశాత్తు బాబుది సర్జరీతో బాగవ్వగల పరిస్థితేనని ఆయన అభిప్రాయపడ్డారు. '*డైరెక్ట్ ఇంజ్యూరి*' వల్ల కాకుండా- తీవ్రమైన కుదుపు, షాక్ వల్ల ఏర్పడ్డ '*సెరబ్రెల్ హెమరేజ్*' అవడం మేలయిందన్నారు. *స్లో బ్లీడింగ్* అవడంతో గట్టెక్కే అవకాశం మెరుగయ్యిందన్నారు..

*బ్రెయిన్ టిష్యూ నడుమ ఎక్యూములేట్* అయిన *బ్లడ్ డ్రైన్* చేసి,*సెరబ్రెల్ ఎడిమా (స్వెల్లింగ్)* తగ్గిస్తే, బాబు ఇప్పుడున్న గడ్డు పరిస్థితి నుండి తేరుకునే అవకాశం మాత్రం ఉందన్నారు. తక్షణమే సర్జరీ షెడ్యూల్ చేస్తాన్నారు.

వేయి ఉద్యానవనాలు ఒకేసారి విరగబూసినంత ఆనందం నిండింది గుండెల్లో. కాలి నడకన స్వామిని దర్శించుకుంటానని వేయి దణ్ణాలు పెట్టాను. సంతోషంతో పిచ్చిదాన్నయ్యాను.

సర్జన్ కి ధన్యవాదాలు తెలిపి, మామయ్య, శ్యాం సర్జరీకి ఏర్పాట్లు చేయడానికి వెళ్ళారు.

అక్కడి నుండి లేచి బాబుని చూడ్డానికి ఐ.సి.యు దిశగా అడుగులు వేశాను.

ఈ సారి బాబుని చూసిన క్షణం, వేయి ఏనుగుల బలంతో ముందుకు సాగిపోతాను అనిపించింది.

"నేను బాగాయి పోతాను మమ్మీ," అని సందీప్ అంటునట్టుగానే తోచింది.

శ్యాం, మామయ్య కూడా లోనికొచ్చి వాడిని చూసాక, సర్జరీకి *ప్రిపేర్* చేయడానికి సందీప్ ని అక్కడినుండి తీసుకెళ్ళారు...

**

దేవుని మీదే భారం వేసి, మామయ్య, శ్యాం వెనుకే ఐ.సి.యు బయటకి నడిచాను. కాస్త దూరంలో వెయిట్ చేస్తున్న ఆనంద్ చిత్రలని కలిసాను.

"చూడమ్మా, మేమిద్దరం ఇవాళ నీ అందుబాటులోనే ఉన్నాము," అన్నారు ఆనంద్ నా వంక చూస్తూ.

నాతో పాటే ఉన్న మామయ్య కలగజేసుకున్నారు.
"సందీప్ సర్జరీకి కొన్ని గంటలు పడుతుందన్నారు. నీవు కాసేపు మనింటికో, లేదా చిత్ర వద్దకో వెళ్ళి రెస్ట్ తీసుకోమ్మా," అన్నారాయన నాతో.

"ఇంటి నుండి అందరు కూడా మధ్యాహ్నం వస్తారు.. ఇప్పుడు వెళ్ళి, వాళ్ళతో రావచ్చు," అన్నాడు శ్యాం నన్నుద్దేశించి..

"లేదు మామయ్య, నేనిక్కడే ఉంటాను. చిత్రతో ఓ సారి గుడికి వెళ్ళి వచ్చేస్తాను. మీరు ఇంట్లో వాళ్ళందరికీ చెప్పండి సందీప్ బాగయిపోతాడని," అన్నాను...
అలాగేనంటూ మామయ్య, శ్యాం వెనుదిరిగారు.

నన్ను, చిత్రని బ్రేక్ఫాస్ట్ చేయమని హాస్పిటల్లోనే *కేఫటేరియా* కి తీసుకువెళ్ళారు ఆనంద్. దూరాన ఉన్న ఓ కార్నర్ టేబిల్ వద్ద చేరాము.
ఆర్డర్ చెప్పి వచ్చి, మా ఎదురుగా కూర్చున్నారాయన.

లాయర్ దగ్గర జరిగినదంతా చిత్ర నుండి విన్న ఆనంద్, అదే విషయం ప్రస్తావించారు. బాగా అలోచించి, లాయర్ గారితో కూలంకుషంగా మాట్లాడి, అడుగువేయమని సలహా ఇచ్చారు. అవసరమయితే, లాయర్ వద్దకు తామూ వస్తామన్నారు..

ఆర్డర్ వచ్చాక, కాఫీ తాగి పేషంట్ రౌండ్స్ చేయడానికి వెళ్ళారు ఆనంద్. కాఫీ సిప్ చేస్తూ, నేను చిత్ర మిగిలాము.

"వేద మిమ్మల్ని రాత్రిళ్ళు మేలుకోబెట్టడం లేదు కదా! విశాల అన్నీ సరిగ్గా చూసుకుంటుందా?" అడిగాను.


"వేద సంగతి నువ్వు ఆనంద్ ని అడగవలసింది. వర్క్ నుండి ఇంటికెళ్ళడం ఆలస్యం…వేద ని తనే చూసుకుంటున్నారు," అంది చిత్ర.

"మీకు నేనెలా థాంక్స్ చెప్పాలో తెలీదు చిత్రా. ఇటువంటి క్లిష్ట సమయంలో అమ్మావాళ్ళుతో పాటు, వేద నీవద్ద ఉండబట్టి, కాస్తైనా మనశ్శాంతిగా నేను సందీప్ విషయం చూడగలుగుతున్నాను," అన్నాను కృతజ్ఞతగా…

"నీవు నాకు థాంక్స్ చెప్పాలా? వేదని మేము చాలా ఎంజాయ్ చేస్తున్నాము… మీ ఇంటికంటే మా అపార్ట్మెంట్ ఎంతో దగ్గర కదా హాస్పిటల్కి. అమ్మవాళ్ళు మావద్ద ఉండడమే వీలు. ఏం పర్వాలేదు," అంది కాఫీ ఫినిష్ చేస్తూ చిత్ర….

…చుట్టూ *బ్రేక్ఫాస్ట్* రద్దీ తగ్గింది. ఇంచుమించు ఎవరూ లేరు. సెకెండ్ రౌండ్, మళ్ళీ మాకు కాఫీ ఆర్డర్ చేసింది చిత్ర.

*కంఫర్టబుల్*గా అక్కడే కాసేపు కూర్చుండిపోయాము.



“ఇప్పుడు ఇంత తెలిసాక, నా దగ్గర ఏదీ దాచకుండా ఇంకా ఏమన్నా ఉంటే చెప్పు,” అంది సూటిగా చిత్ర.

క్షణం మౌనంగా ఉన్నాను.
గట్టిగా ఓ సారి ఊపిరి తీసి, చిత్ర వంక చూసాను.

“అయితే, నేను చెప్పేది ఓపిగ్గా విను. ఔను, శారీరకంగా, మానసికంగా నేను నా భర్త - శ్యాం బాధితురాలినే. పైశాచికం, శాడిజం నా భర్త శ్యాంప్రసాద్ నైజం అన్నది నేను నమ్మిన నిజం. ఎన్నో సార్లు నన్ను అన్ని విధాల గాయ పరిచాడు. హింసించాడు.
మా ఇరుకుటుంబాల పరువుని, నా బిడ్డల భవిష్యత్తుని, నా స్థిరత్వాన్ని గురించిన ఆలోచనలతోనే ఆ నరకం నుండి బయట పడడానికి ఇంత కాలం పట్టింది,” అంటూ నిట్టూర్చాను.

నా పట్ల శ్యాం ప్రవర్తన, నా నుదుటి మీద గాయం, నా మీద శ్యాం దౌర్జన్యం, మానసిక శారీరిక హింస, గర్భవతినైన నేను గాయాలతో హాస్పిటల్లో జేరడం వెనుక అసలు నిజం, సందీప్ కి ఎన్నో మార్లు కలిగిన హాని, అన్నీ మొదటినుంచీ పూస గుచ్చినట్టు చెప్పాను చిత్రకి.

అంతా విని, షాక్ అయింది చిత్ర......

కొంత సేపటికి గాని తేరుకోలేదు. "ఎంతటి దుస్థితి అనుభవించావు నీలా? ఇంతటి దావాగ్ని నీలో నివురుగప్పి ఉందని ఏమాత్రం ఊహించలేదు తెలుసా," అని కన్నీళ్లు పెట్టుకొంది.

"మా పట్ల శ్యాం ప్రవర్తన ఏ కోవకి చెందిన '***మానసిక ప్రవృత్తి***' అనేది, నువ్వే నాకంటే బాగా చెప్పగలవు," అన్నాను చిత్రతో.

... తానేదో అనబోయేలోగా చిత్ర సెల్ ఫోన్ మోగింది.

"హలో, రమణీనా? ఓ నిముషం ఆగు," అని నా వంక చూసింది..
"రమణి చాలా సార్లు నీ కోసం ఫోన్ చేసింది," అంటూ ఫోన్ నాకందించింది.

రమణి నాకు ధైర్యం చెప్పింది...సందీప్ కి తన విషెస్ చెప్పింది...
నన్ను చూడ్డానికి, ఈ సారి తన ఇద్దరు పిల్లలతో ఢిల్లీ వస్తానంది.
**
సర్జరీ అయ్యి నాలుగు రోజులయింది. సందీప్ ఆపద నుండి బయట పడ్డట్టేనన్నారు డాక్టర్లు. వాడు క్షేమంగా ఉన్నట్టే....
ప్రతిపూట మామయ్య, శ్యాం వచ్చి సందీప్ ప్రోగ్రెస్ కనుక్కుంటారు. అమ్మావాళ్ళు, అత్తయ్యా కూడా ...

సందీప్ ప్రొగ్నాసిస్ బాగుందని, ప్రాబ్లం లేకుండా ఇంప్రూవ్ అవుతున్నాడని రెండు రోజుల్లో డిస్చార్జ్ చేస్తామన్నారు డాక్టర్లు...

**
సందీప్ హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చి కూడా నాలుగు రోజులయింది.
కొద్దికాలం వాడి కోసం నర్స్ ని ఉంచాము.
డాక్టర్ గారి ఆదేశాలు పాటిస్తూ సవ్యంగా కోలుకుంటున్నాడు.
**
ఇప్పటి వరకు నాకు సాయంగా ఉన్న అమ్మావాళ్ళు తిరుగు ప్రయాణమయ్యారు. మరి రెండు గంటల్లో వారి ట్రైన్.
సర్దడం అయింది. భోజనాల వద్ద నాకు జాగ్రత్తలు చెప్పింది అమ్మ.
నేను శ్రేయస్కరమైన నిర్ణయాలు తీసుకోబోతున్నానని, బెంగ పెట్టుకోవద్దని వాళ్ళకి చెప్పాను.

నేను అత్తయ్య కూడా గేటు వరకు వెళ్ళాము.
“మళ్ళీ వస్తానక్కా,” అని వెడుతూ, కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు వినోద్.
**
కారు కదిలిపోయాక వెనుతిరిగి ఇంట్లోకి వస్తుండగా నా సెల్ ఫోన్ రింగ్ అయింది. లాయర్ గారి ఫోన్ అనుకొని ఆదుర్దాగా తీసాను. ఆయనే.

పేపర్ వర్క్ అయ్యి, అన్ని పనులు ముగిసాయని చెప్పి, మరో రెండు రోజుల్లో కలవమన్నారు.
నా కోసం శనివారం పొద్దున్నే సమయం కేటాయించానన్నారు.
**
ఆనంద్, చిత్రలతో, శర్మగారి వద్దకు వెళ్లాను.

వాళ్ళని నా శ్రేయోభిలాషులుగా పరిచయం చేసాను.
నేను కోర్టులో వేయబోయే పిటీషన్ గురించి శర్మ గారు మాకు వివరించారు.

ఫామిలీ కోర్ట్ లో దాఖలయ్యే 'లీగల్ సేపెరేషన్' పిటీషన్ ల పై సంతకాలు పెట్టాను. '*రిస్ట్రైనింగ్*' ఆర్డర్ అవసరం లేదని నిర్ధారించారు.

నా తరఫున ఆనంద్ వ్యక్తపరిచిన ఎన్నో అనుమానాలకి బదులుగా,
"శ్యాం నుండి ఈ పిటీషన్ కి 'నో కాంటెస్ట్' అని నా అభిప్రాయం," అన్నారు లాయర్ శర్మ గారు.

లీగల్ నోటిసులు శ్యాంకి సోమవారమే వెళతాయట. అన్ని పేపర్స్ కాపీలు నాకు అందజేశారు. ఆయనకి ధన్యవాదాలు చెప్పి సెలవు తీసుకొని, అక్కడి నుండి బయటకొచ్చాము.
**
నన్ను ఇంట్లో డ్రాప్ చేసి, చిత్ర వాళ్ళు గార్గావ్ దిశగా వెళ్ళారు. వాళ్ళు ఈ మధ్యన, అక్కడ ఎకరాల భూమిని కొనుగోలు చేసారు.
..'ఆనందా కుటీర్' అన్న పేరుతో ఆ భూముల్ని *డెవెలప్* చేస్తారట...
**

# 8

## ఆరేళ్ళ తరువాత

పొద్దునే, టి.వి ఆన్ చేయమంటూ ఫోన్ చేసింది చిత్ర. లోకల్ చానెల్ మీద న్యూస్ చూడమంది.

స్పోర్ట్స్ న్యూస్ సెగ్మెంట్ జరుగుతుంది....

***'ఢిల్లీ స్విమ్మింగ్ కమిషన్ వారు, సందీప్ మధురై అనే యువ స్విమ్మర్ ని నేషనల్ జూనియర్ స్విమ్ టీమ్ కి కెప్టెన్ గా సెలెక్ట్ చేసారు.***
***పదహారేళ్ళ వయసులో అంతటి గుర్తింపు అనూహ్యమైనదే',***
***'అంతే కాదు, ఈ యువ ఈతగాడు ఒకప్పటి ప్రఖ్యాత క్రీడాకారుడు శ్యాంప్రసాద్ మధురై తనయుడు'*** అని చెబుతూ సందీప్ స్కూల్ ఫోటో, వాడు పాల్గొన్న స్విమ్ టోర్నమెంట్ నుండి ఓ క్లిప్ చూపించారు.

సందీప్ ఆశ్చర్య పోయాడు. వాడి ఆనందానికి అవధులు లేవు. నాకూ సంతోషంగా అనిపించింది.

"తాతగారు న్యూస్ చూసారో లేదో," అంటూ, తాతగారికి ఫోన్ చేసాడు సందీప్.

నేను బ్రేక్ఫాస్ట్ ప్రిపేర్ చేద్దామని కిచెన్ లోకి వెళ్లాను.
**
పోయినేడే జూనియర్ కాలేజి స్విమ్ టీంకి కెప్టెన్ అయ్యాడు సందీప్. ఇప్పటికే, ఢిల్లీలో జరిగే స్విమ్మింగ్ టోర్నమెంట్స్ లో పాల్గొని, విజయాలు సాధించాడు. చదువుల్లో కూడా ముందంజలోనే ఉన్నాడు.

పిల్లలిద్దరికీ, తాతగారి *సపోర్ట్*, చిత్ర ఆనంద్ ల *ఎంకరేజ్మెంట్* కూడా మెండుగా తోడ్పడుతున్నాయి.

నేను పిల్లలతో విడిగా ఉంటున్న ఈ ఆరేళ్ళల్లో, పిల్లలిద్దరూ వాళ్ళ తాతయ్యకి బాగా దగ్గిరయ్యారు. అత్తయ్య రెండేళ్ళ క్రితం హృద్రోగంతో మరణించాక, మామయ్య నెలకి సగం రోజులు పిల్లలతో గడుపుతూ, మా దగ్గరే ఉంటుంటారు.
వేద అంటే ఆయనకి ప్రాణం. వారానికి మూడు రోజులు దాన్ని వెంట బెట్టుకుని మ్యూజిక్ క్లాస్ కి వెళతారాయన. వేద ఫస్ట్ స్టాండర్డ్ కి వచ్చింది.

ఈ 'వేర్పాటు' ఏర్పాటుకి శ్యాం నుండి ఎటువంటి ఆటంకం లేకపోవడంతో అలాగే కొనసాగుతున్నాము.
ఈ మధ్య కాలంలో, తాను ఫామిలీ కౌన్సెలింగ్ కి వెళతానని మామయ్యతో అన్నారట శ్యాం.

లాయర్ గారి సలహా మేరకే, శ్యాం, మా ఇంటికొచ్చి పిల్లల్ని కలవడానికి ఒప్పుకున్నాను.

గత రెండేళ్లగా మాత్రం, పిల్లల బర్తడేలకి, ఫెస్టివల్స్ కి, వాళ్ళకి కానుకలు తీసుకుని మామయ్యతో కలిసి వస్తుంటారు. ఆ కాసేపు, వాళ్ళ డాడీ తో *ఫ్రెండ్లీగా* గడుపుతారు సందీప్, వేద.

రెండేళ్ళ క్రితం, మామయ్య మాకోసం కొనుగోలు చేసిన ఆధునిక విల్లాలోకి మారాము. చిత్ర వాళ్ళకి దగ్గరే.
అన్నిటికీ చాలా వీలుగా ఉంది.... అనుకుంటూ కిచెన్లో పని ముగించాను...
**
బ్రేక్ఫాస్ట్ టేబిల్ మీద సర్ది, పిల్లల్ని పిలుద్దామని హాల్లోకి వచ్చిన నాకు,
"మమ్మీ హైదరాబాద్ తాతతో మాట్లాడు," అంటూ ఫోన్ అందించాడు సందీప్.

సందీప్ గురించి గర్వంగా ఉందన్నారు నాన్న. ఈ మధ్యనే, నేనూ చైల్డ్ సైకాలజీ విద్యా విధానంలో మాస్టర్స్ డిగ్రీ కంప్లీట్ చేయడం నాన్నకి సంతోషం కలిగించింది.

"మీరు ఓ సారి ఢిల్లీ రావాలి," అన్నాను అమ్మతో మాట్లాడుతూ.....

"అలాగే చూద్దాం. నీవు సుఖంగా, సంతోషంగా జీవించడం ముఖ్యం తల్లీ," అంది అమ్మ.

ఈ మధ్య అమ్మావాళ్ళు ప్రయాణాలు తగ్గించారు.
వినోద్ ఐ.ఐ.టి లో చదువుతున్నాడు. వీలున్నప్పుడల్లా వచ్చి పిల్లలతో సరదాగా గడుపుతాడు. వినోద్ మామయ్య రాక కోసం ఎదురు చూస్తుంటారు పిల్లలిద్దరూ.
**

సందీప్ కి అభినందలు తెలిపడానికి, సాయంత్రం వర్క్ నుండి చిత్ర, ఆనంద్ లతో పాటు, అదే  సమయానికి మామయ్య, వినోద్ కూడా ఇంటికి వచ్చారు,

“మీ డాడీని నిన్ననే కలిసాను.  *హి విల్ బి వెరీ ప్రౌడ్ ఆఫ్ యు*, సందీప్. మేము కలిసినప్పుడల్లా ... నీ గురించి, వేద గురించి తప్పక మాట్లాడుతాము,” అన్నారు ఆనంద్ సందీప్ తో.
శ్యాం ఆనంద్ ని తరుచుగా కలుస్తూనే ఉంటారట...

వస్తూ పిల్లలకి ఇష్టమైన స్వీట్స్ తెచ్చారు మామయ్య.  విశాల అందరికీ కాఫీ తో స్నాక్స్, స్వీట్స్ సర్వ్ చేసింది.

“ఏమ్మా చిత్రా, మీ ‘ఆనందా కుటీర్’ నిర్మాణం పూర్తయి, రెండేళ్లగా అక్కడ సామాజిక కార్యక్రమాలు సవ్యంగా జరుగుతున్నాయని చెప్పావు.  తప్పక ఓ సారి వెళదామని కూడా చెపుతుంటావు.
నాకు ఓపిక ఉండగానే మీ కుటీరమంతా తిరిగి చూడాలనుంది. పిల్లలకిప్పుడు సమ్మర్ హాలిడేస్.  ప్లాన్ చేయవచ్చు కదా!” అన్నారు మామయ్య చిత్రతో.
**
*సెయింట్ బార్న బస్ జూనియర్ కాలేజీ* ప్రాంగణంలో సందీప్ వాళ్ళ స్విమ్ *టీమ్ కి రిసెప్షన్* ఇచ్చారు స్కూల్ వాళ్ళు.   మామయ్య, శ్యాం సహా వచ్చారు.  గర్వంగా సందీప్ ని కౌగలించుకుని అభినందించారు శ్యాం...

**
పొద్దున్నే, లాయర్ శర్మ గారు నుండి ఫోన్. "నీలా, నీ భర్త శ్యాంప్రసాద్ మధురై, ఫామిలీ కౌన్సెలింగ్ కి సుముఖంగా ఉన్నట్టు, కోర్ట్ ద్వారా సమాచారం. నువ్వు సరేనంటే వాళ్ళ లాయర్ కి జవాబు ఇస్తాను. మనం చెప్పిన *కౌన్సలర్* దగ్గరికే వస్తారు," అన్నారాయన.

'శ్యాం లో మార్పంటూ వస్తే, దానికి కారణం, పిల్లల మీద ప్రేమే' అనుకోవాలి.

చీకటి పడుతుండగా, చిత్ర, ఆనంద్ వచ్చారు, "నీకో హ్యాపీ న్యూస్," అంటూ.
"శ్యాం వచ్చి హాస్పిటల్లో నన్ను కలిశారమ్మా," అన్నారు ఆనంద్ సోఫాలో కూర్చుంటూ.
"నీకు లాయర్ ద్వారా ఫామిలీ కౌన్సెలింగ్ కి అంగీకారం పంపారంట. నా వద్ద పేషంట్ గా నమోదయ్యారు కూడా. వచ్చేవారం ఫస్ట్ *అపాయింట్మెంట్.*
మాకూ ఇది సంతోషకరమే," అన్నారు ఆనంద్ ఉత్సాహంగా....

చూద్దాం ఈ మార్పులు ఎటు దారి తీస్తాయో! మంచికే అయితే మంచిదే మరి! అనుకొన్నాను మనస్సులో.....
**

'ఇదిగో వస్తా, అదిగో వస్తా' అంటూ ఐదేళ్ళగా గడిపేసిన రమణి పిల్లాపాపలతో, ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీ వస్తుంది. వాళ్ళతో పాటు మూడేళ్ళ తరువాత అమ్మావాళ్ళు కూడా వస్తున్నారు.

**

"ఇన్నాళ్ళకి, అందరం ఇలా కలిసామంటే, అంతా చిత్ర కృషి ఫలితమే," అన్నారు మామయ్య, అందరితో కలిసి భోజనానికి కూర్చుంటూ.

"రీ-యూనియన్, అంటూ మమ్మల్ని రమణి కుటుంబంతో జత కట్టి మరీ పిలిపించింది. అన్నిటా చిన్నప్పటినుండి పట్టుదల ఆ అమ్మాయికి," అన్నారు నాన్న చిత్ర గురించి...

"ఈ వారమంతా మనందరి యాక్టివిటీ - చిత్ర ప్లానింగ్ ప్రకారమే అని తెలిసిందే కదా! చిన్న వాళ్ళతో సహా మీరంతా కూడా తప్పక ఎంజాయ్ చేస్తారని, నేను హామీ ఇస్తున్నా," అన్నారు ఆనంద్ నవ్వుతూ..

రమణి – విజయ్ ల పిల్లలు, ఐదేళ్ళ ఆరతి, శంకర్, హ్యాపీగా వేదతో కబుర్లాడుతూ భోంచేస్తున్నారు.

ఆనంద్, వినోద్, రమణి భర్త విజయ్, సందీప్ సహా, ఇద్దరు తతయ్యలతో, స్విమ్ టీమ్ యాక్టివిటీస్ గురించి మాట్లాడుతూ, కలిసి భోంచేస్తుంటే చాలా రోజుల తరువాత, నాకు ఆప్తులైన వాళ్ళందరి నడుమ ఆనందంగా అనిపించింది.

**

శనివారం పొద్దున్నే రెండు ట్రావెల్ వాన్స్ తీసుకొని 'ఆనందా కుటీర్' కి బయలుదేరాము.

నిజానికి అది ఓ ఆశ్రమం అన్నారు ఆనంద్. అనాధ, వృద్ధ, స్త్రీ సంక్షేమానికి పాటు పడుతున్న సంస్థ అని వివరించారు...

మధ్యాహ్నం పన్నెండుకి ముందే ఆశ్రమం చేరాము.

ప్రవేశద్వారంలా ఉన్న ఆశ్రమం *ఎంట్రెన్స్* నుండే ఇరుపైపులా బారులుగా పచ్చని చెట్లతో అందంగా నీడగా ఉంది దారంతా. అందరికి అక్కడ నాలుగు కాటేజీల్లో బస ఏర్పాటు చేసింది చిత్ర.

ఒంటిగంటకి భోజనశాలకి వెళ్ళాము. అక్కడ వృద్ధులు, పిల్లలు, వికలాంగులు కలిసి వందమంది పైనే ఉంటారు. పనివాళ్ళు, వడ్డించేవాళ్ళు, ఆయమ్మలు ఇరవై మందన్నా ఉన్నారు.

మేమంతా కాస్త ఎడంగా రెండు టేబుళ్ళ వద్ద కూర్చున్నాము.

'ఆనందా కుటీర్' లో స్థానికంగా నివసించే పిల్లల ప్రార్ధనా గీతంతో మొదలయ్యి, దేవునికి కృతజ్ఞతలు తెలుపుకొని, మమ్మల్ని సాదరంగా ఆహ్వానించాక, భోజనం వడ్డించారు.

అతిధులం, మేము వచ్చామనే, ప్రత్యేకంగా ఈ నాటి భోజనం, డైనింగ్ హాల్లో ఏర్పాటు చేసారట....

అరిటాకులు వేసి వడ్డించారు. ఎంతో రుచిగా ఉన్నాయి కూరగాయల వంటకాలు. తాగడానికి కొబ్బరి నీళ్ళు.....
**
భోంచేసాక, షుమారు పాతిక ఎకరాల్లో నిర్మించిన ఆశ్రమ ఆవరణంతా వాన్ లోనే తిరిగాము.... పశుశాల, బడి, ఆసుపత్రి, వృద్ధాశ్రమం, స్త్రీ సంక్షేమం, అనాధాశ్రమం, దేవుని గుడి అన్నీ చూశాము. .

ఆనంద్ మమ్మల్ని, ప్రతి సేవాశ్రమం దగ్గర ఆపి..., సమాజానికి దాని అవసరం గురించి, పిల్లలకి వివరిస్తూ ఆసక్తిగా సాగనిస్తున్నారు మా టూర్....

అంతా చూసాక, ఆఖరున కుటీరం మధ్యన ఉన్న తోటలోకి వచ్చాము. కొన్ని వందల చెట్లు వలయాకారంలో నీడనిస్తూ, ఓ ఉద్యానవనంలా ఉంది అక్కడ.

అప్పటికే అలిసిపోయిన పిల్లలు, వేద, విశాల, అమ్మతో సహా కాటేజీకి వెళ్ళిపోయారు.
మగవాళ్ళంతా సేవాశ్రమాల వైపుగా, సందీప్ తో వినోద్ యానిమల్ షెల్టర్ వైపుగా వెళ్లారు.

చిత్ర, నేను, రమణి తోట మధ్యలో ఉన్న గాంధి విగ్రహం ముందు కూర్చున్నాము.

చేతికర్ర పట్టుకున్న గాంధీ తాత నిలువెత్తు విగ్రహం అది.

‘అక్కడ ఆ విగ్రహం, ఆశ్రమ ఆశయాల్ని చెప్పకనే చెబుతుంది’ అనుకున్నాను. రమణి కూడా అదే అన్నది.

బుట్టెడు మల్లెలు, సంపెంగలతో పాటు తోట మాలి మాకు కొబ్బరినీళ్ళు తెచ్చిచ్చాడు.
మరోసారి కొబ్బరి నీళ్ళు తాగుతూ, కొద్దిసేపు ముగ్గురం మౌనంగా ఉన్నాము.

“నేను అన్నయ్యలా భావించే ఆనంద్ గారంటే, నాకున్న గౌరవం ఈ రోజు రెట్టింపయ్యింది. నీవు నా స్నేహితురాలవైనందుకు కూడా నాకెంతో గర్వంగా ఉంది చిత్రా,” అన్నాను.

“అవును, అసలు ఎంతో ఉన్నత ఆశయాలతో స్థాపించినట్టుగా ఉంది ఈ సేవా కుటీరాన్ని. నీవు, ఆనంద్ కూడా ఎంతో గొప్ప ఆలోచనలు ఉన్నవారని తెలుస్తుంది చిత్రా,” అంది రమణి.

“సరే తల్లీ మీ పొగడ్తలు ఆపండమ్మా,”, “మా గొప్పతనం ఏమీ లేదు. ఏదో మా వంతు సమాజం లోని నిరాశ్రయులకి చేయూత నిద్దామనే,” అంది చిత్ర.

“ఆనంద్ పుర్వీకుల ఆస్తులు అమ్మేసి, ఇక్కడ భూమి కొన్నారు ఆనంద్. లండన్ లో సెటిల్ అయిన వాళ్ళ అన్నయ్య ఆశయం కూడా ఇదే అవ్వడంతో, మూడేళ్ళపాటు ఈ కుటీర నిర్మాణంలో మునిగి తేలారు. ప్రాక్టీసు నుండి కూడా, దాదాపు ఏడాది పాటు దూరంగా ఉన్నారు మరి,” అంది చిత్ర..

మాట్లాడుతుండగానే, ఓ పదిమంది చిన్నపిల్లలు దూరం నుంచి పరిగెత్తుకుంటూ వచ్చి, బిలబిల మంటూ చిత్ర చుట్టూ చేరారు.

“అమ్మా, అమ్మా” అంటూ తలా ఓ కబురు చెప్పారు చిత్రకి. అందులో ఇద్దరు నడువలేని వారైతే, ఒకరు మూగ అని కూడా అర్ధమయ్యింది. వారిని ఆయాలు తీసుకు వచ్చారు.
అందరిని చుట్టూ కూర్చోబెట్టుకొని, వారి చదువులెలా సాగుతున్నాయని వాకబు చేసింది చిత్ర.
ఇంతలో డ్రైవర్ రెండు సంచులు నిండా గిఫ్టు తీసుకొని వచ్చాడు.
చిత్ర వారందరికీ తలా ఓ గిఫ్ట్ ఇచ్చింది.
ఇంకా మంచి మార్కులు తెచ్చుకుంటే, అదనంగా బహుమానాలుంటాయని కూడా చెప్పింది.

“మీరిప్పుడు పార్క్ లోకెళ్ళి ఆడుకోండి. మరో ఐదు నిముషాల్లో ఆనంద్ డాడీ మీ దగ్గరికే వస్తారు. నేను మళ్ళీ పదిహేను రోజులకి కనబడతా,” అని వాళ్ళని బుజ్జగించి అటుగా పంపింది చిత్ర.

ఓ నాలుగేళ్ల బాబు మాత్రం వెళ్ళనని మొరాయించాడు. 'మమ్మీ', అంటూ చిత్ర వొళ్ళోనే కూర్చున్నాడు. వాడికి ముద్దుపెట్టి, పర్స్ నుండి ఓ చాక్లెట్ ఇచ్చాక, ఆయమ్మతో వెళ్లాడు.

ఇదంతా చూస్తూ, నేను రమణి కూడా కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యాము. మేము నోరు విప్పేలోగానే, "మీరు అడగబోయే ప్రశ్నలకి, అనాలనుకుంటున్న మాటలకి, బదులుగా, ముందు నేను చెప్పేది వినండి," అంది చిత్ర.

"ఈ ఆశ్రమం ఆనంద్ ఆశయం. నేను విధిగా సాయం చేసాను అంతే....

ఇక నా విషయానికి వస్తే, నాకు పిల్లలు పుట్టరన్న దిగులుకన్నా, పిల్లలంటే ఇష్టమున్న ఆనంద్ కి తండ్రి హోదా ఇవ్వలేకపోతున్నాననే బాధే ఎక్కువయ్యింది.
చాన్నాళ్ళు ట్రీట్మెంట్ తీసుకున్నా నాకు ప్రెగ్నెన్సీ రాలేదు. పోనీ బిడ్డల్ని అడాప్ట్ చేసుకుందామా అని ఆనంద్ ని అడిగాను.
దానికి జవాబుగా – 'ప్రేమనిచ్చి, పెంచి, వృద్ధిలోకి తీసుకురాడానికి సొంత పిల్లలే అయ్యుండాలని తను అనుకోవడం లేదని, ఆశ్రమబిడ్డలని తన సొంత పిల్లలుగానే భావిస్తున్నానని, అన్నాడు ఆనంద్," ఓ క్షణమాగి, కళ్ళు తుడుచుకుంది చిత్ర.

"ఇంకేముంది, అంతే. నేనూ ఆనంద్ తో చేతులు కలిపి అతని అడుగుజాడల్లోనే నడుస్తున్నాను. ఇప్పుడు నా మనస్థితి పూర్తి సంతృప్తితో నిండుంది.

నాకు ఎందరో బిడ్డలు. వాళ్ళని ప్రేమించడానికి, వారి బాగోగులు పట్టించుకోడానికి నా జీవితకాలం చాలదనుకో. అంతటి ప్రేమని, అనుభూతిని ఇస్తున్నారు ఈ ఆశ్రమ బిడ్డలు," అంటూ మా వంక చూసింది.

"ఇంకా నా విషయంలో ఏమన్నా ప్రశ్నలున్నాయా మీకు? నీలవేణి గారు, చంద్రమణి గారు" అంటూ నవ్వేసింది.

నేనూ, రమణి కూడా చిత్ర చేయందుకున్నాము, "లేవు చిత్రలేఖ గారు," అని ఒకేసారి అన్నాము..........

మా చేతుల్ని పట్టుకుని మాతో పాటు పైకి లేచింది చిత్ర.

**

రమణి వాళ్ళు, పిల్లలు వెళ్ళి రెండు రోజులవుతుంది... ఇల్లంతా బోసిపోయిందనుకున్నాను.

అమ్మావాళ్ళు కొద్ది రోజులు ఉంటారు.

ఈ వేళ అత్తయ్య వర్ధంతి. నా మనస్సులోనే కాదు, మా పూజా మందిరంలో కూడా ఆవిడకి ప్రత్యేక స్థానం ఉంది.

ఆవిడ గురించే ఆలోచిస్తూ కాసేపు కూర్చుండిపోయాను......

పిల్లలతో నేను విడిగా వచ్చేసాక, సుస్తీగా ఉన్న అత్తయ్యని చూడ్డానికి చిత్రని వెంట బెట్టుకుని వెళ్ళేదాన్ని.

అలా ఓ సారి మాత్రం శ్యాం పుట్టిన రోజట. నేను వచ్చినందుకు సంతోషాన్ని వెలిబుచ్చిన ఆమె, ఆ రోజు నాతో అన్న మాటలు మరువలేను...

నా రెండు చేతులు పట్టుకుని, "నీవు ఎంతో ఓపిక, జ్ఞానం ఉన్న నిండైన మనిషివి, నీలు. నీలాంటి కోడలు దొరకడం మా అదృష్టమే తల్లీ. నీవు కాబట్టి ఇంటి పరువు, మా మీద గౌరవ మర్యాదలు ఉంచి, కుటుంబం కోసం త్యాగాలు చేసి జీవిస్తున్నావు.
నీ కోసమైనా నా కొడుకులో నీవు కోరుకునే మార్పు రావాలని ఆ దేవుడుని ప్రార్థిస్తానమ్మా," అంటూ తన మనసులోని మాట చెప్పుకున్నారు...

"అంతే కాదు తల్లీ, వాడిలో మార్పంటూ వస్తే, వాడిని తప్పక ఆదరించమని కూడా నిన్ను కోరుతున్నాను నీల," అన్నారు కన్నీళ్ళతో ఆమె.
ఆ నాటి ఆమె అర్థింపు నాపై చెరగని ముద్ర వేసింది...
శ్యాం లో ఆ మార్పు రావాలనే నేనూ కోరుకునేది...వేచి చూడాలి...

‘జీవితంతో రాజీ పడిన నేను, వ్యక్తిగతంగా కూడా అత్యాశలు పెట్టుకోలేదు. అందుకే ఇలా మనగలుగుతున్నాను ’ అనుకున్నాను.

## శుభం

## అంకితం:

**మా జీవితాల్లోకి అడుగిడి, నిత్యం మాకు సంతోషాలు పంచి మా మనస్సుల్లో ప్రేమని నింపి, మా జ్ఞాపకాల్లో నిలిచిపోయిన మా ప్రియమైన ‘మాయ’కి ఈ నవల అంకితం...**

**నా తల్లితండ్రులు కీర్తిశేషులు శ్రీమతి శారద, మేజర్ సత్యనారాయణ గార్ల జ్ఞాపకాలకు నా ఈ మొట్టమొదటి నవల ఓ చిరుకానుక...**

**- ఉమాభారతి**

*************************